

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ fb.com/vaartha

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-2-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 8 పేజీలు: 12 వెల: 8.00


ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ బహుమానం

ఈరోడ్ ఉప ఎన్నికలో డిఎంకె గెలుపు

9లో



# ఢిల్లీకి 'డబులింజన్'

## హస్తినలో మళ్లీ విరిసిన కమలం

| బిజెపి | ఆప్ | కాంగ్రెస్ |
|---|---|---|
| 48 | 22 | 0 |

### 28 యేళ్ల తర్వాత ఢిల్లీ పగ్గాలు చేపడుతున్న బిజెపి

కేజ్రీవాల్, సిసోడియా సహా ఓటమిపాలైన ఆప్ దిగ్గజాలు

ఓటర్లపై ఎక్కువ ప్రభావం చూపిన లిక్కర్ స్కాం

బిజెపి పంచిన 'ఉచిత హామీల'తో అందలం అందించిన మహిళా ఓటర్లు

కేంద్రం, ఢిల్లీలో ఒకే ప్రభుత్వంతో అభివృద్ధి తారస్థాయికి చేరుతుందన్న బిజెపి నేతలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశరాజధాని అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించింది. దాదాపు 28 ఏళ్ల తర్వాత ఎర్రకోటపై బిజెపి జెండా ఎగిరింది. మొత్తం 70 స్థానాల్లో 48 స్థానాల్లో గెలిచి మెజార్టీమార్కును సైతం దాటి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీకి కేవలం 22 స్థానాలు మాత్రమే దక్కాయి. ఇక పోతే శతాధికవర్షపార్టీ కాంగ్రెస్‌కు ఈసారి కూడా చుక్కెదురయింది. ఢిల్లీ ప్రజలు ఒక్కనియోజకవర్గంలో కూడా ఆదరించలేదు. మూడోసారి జరిగిన ఎన్నికల్లో కూడా ఆపార్టీ జీరోస్థానానికే పడిపోయింది. ఆపార్టీ ఉనికే లేకుండాపోయిందని చెప్పవచ్చు. ప్రధానిమోడీ, కేంద్ర మంత్రి అమిత్‌షా అనుసరించిన వ్యూహాలతో బిజెపికి ప్రజలు పట్టం కట్టారు. 40 లక్షల ఓట్లు కలిగిన పూర్వాంచల్ ఓటర్లుకూడా 20 నియోజకవర్గాల్లో మోడీకే మొగ్గు చూపించారు. అందుకు అనుగుణంగా బీహార్, యూపిలకు చెందిన వారే ఎక్కువ ఉండటంతో ఆరాష్ట్రాల అగ్రనేతలను కూడా ప్రచారం లోకి దించి ఓటర్లను ఆకర్షించారు. అన్నింటికంటే >>2

## ఢిల్లీ సెక్రటేరియట్ సీజ్

### ఎల్‌జి ఆదేశాలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశరాజధాని అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ పరాజయం వేళ అనూహ్యపరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ సచివాలయాన్ని సీజ్‌చేయాలని లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా కీలకనిర్ణయం ప్రకటించారు. ముందస్తు అనుమతి లేకుండా ఫైళ్లు రికార్డులను తొలగించవద్దని అన్నివిభాగాలకు ఆదేశాలు జారీచేసారు. ఆయన సూచనల >>2

## ప్రజల తీర్పును అంగీకరిస్తున్నాం

### ఓటమిపై మాజీ సిఎం కేజ్రీవాల్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 8:** ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును శిరసావహిస్తున్నామని ఢిల్లీమాజీ సిఎం అరవింద్‌కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన మాట్లాడుతూ తమపార్టీ అధికారం కోసం రాజకీయాల్లోకి రాలేదని ఇక నిర్మాణాత్మక ప్రతి పక్షంగా బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు సేవ లందిస్తుందని కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ ప్రజలతీర్పును శిరసావహించాల్సిందేనని అన్నారు. భారీ మెజార్టీతో విజయం సాధించడంపట్ల >>2

### ఢిల్లీ సిఎం రేసులో పర్వేష్‌సింగ్ వర్మ

### కుంభకోణాలు, నాయకత్వ లేమితోనే ఓటమి: అన్నాహజారే

2లో

## అసెంబ్లీ తొలిసభలోనే

# కాగ్ నివేదిక ఇస్తాం

బిజెపి వేడుకల్లో ప్రధాని మోడీ

అవినీతి పాలనకు ఇక విముక్తి

రాజధాని అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా

ఆప్ చేతిలోనే యమున కలుషితం: ప్రధాని

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఢిల్లీప్రజలు దశాబ్దకాలంపాటు సాగిన అవినీతిపాలనకు విముక్తి కల్పించారని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. యమునామాయీకిజై అన్న నినాదంతో ప్రధాని బిజెపి కార్యాలయంలో పెద్ద ఎత్తున జరిగిన వేడుకల్లో పాల్గొని అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు.

ఢిల్లీప్రజలు ఇపుడు ఎంతో ఉపశ మనంతో ఉల్లాసంగా ఉన్నార న్నారు. 21వ శతాబ్దంలో ఢిల్లీ ప్రజలు తమకు సేవచేసుకునే భాగ్యం కల్పించారని, అవి ధంగానే తాను ఢిల్లీ వాసులందరికీ లేఖరాసా >>2




శనివారం న్యూఢిల్లీలోని బిజెపి కార్యాలయం వద్ద కార్యకర్తల విజయోత్సవ హేల

# పదేళ్ల అరాచకానికి తెర

### ఢిల్లీ ఎన్నికల ఫలితాలు అవినీతి, అక్రమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు

### డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల వల్ల వేగంగా అభివృద్ధి: సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఫిబ్రవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీ ఎన్నికల ఫలితాలు అవినీతి, అక్రమ ప్రభుత్వంపై సామాన్య, మధ్యతరగతి ప్రజల విజయానికి ప్రతీక అని ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో అభివృద్ధి అనుహ్యాంగా జరుగుతుందన్నారు. విశ్వవ్యాప్తంగా దేశంలో ఎన్డీఏ ప్రభుత్వ విధానాలను మెచ్చుకుంటున్నారన్నారు. ప్రపంచపటంలో ఆర్థికంగా, సాంకేతికంగా భారతదేశం అత్యున్నత స్థాయిలో ఉండటానికి ప్రధాని నరేంద్రమోడీ విధానాలే కారణమన్నారు. ఢిల్లీలో అందుకు భిన్నంగా 10 ఏళ్ళకుపైగా అరాచక విధానాలతో, అభివృద్ధి నిరోధక పాలన సాగిందన్నారు. ఆర్థిక నేరాల్లో ఆప్ నాయకులు కీలకంగా ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని తీవ్రంగా నష్టపరిచారన్నారు. ప్రపంచ నగరాలకు దీటుగా నిలవాల్సిన ఢిల్లీని కేజ్రీవాల్ కాలుష్యనగరం మార్చారన్నారు. ఢిల్లీలోని తెలుగువారంతా బిజెపి అండగా నిలవడం అభినందనీయమన్నారు. తాము ప్రచారం చేసిన ప్రాంతాల్లో బిజెపికి విజయం అందించిన ఆయా నియోజకవర్గాల ప్రజలకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల వలన దేశంలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ విజయం చారిత్రాత్మక ఘట్టంగా చంద్రబాబు అభివర్ణించారు. ఈ విజయం మొత్తం దేశ ప్రజల ను జాగృతం చేస్తోందన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో కాం గ్రెస్ కనీస బోణి కొట్టకపోవడం ఆ పార్టీ పట్ల ప్రజలకు ఎంతపఏహ్యత ఉందో అర్థమవుతుం దన్నారు.

**ఆప్‌ను ప్రజలు తిప్పికొట్టారు: కేంద్రమంత్రి పెమ్మసాని**

ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్‌పై పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకోలేదని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఏబీఎన్‌తో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. సంక్షేమం, తాయిలాలతో ప్రజలను మభ్యపెట్టాలని కేజ్రీవాల్ చూశారని విమర్శించారు. ప్రజల్లో స్పష్టమైన మార్పు తాము ప్రచారం చేసినప్పుడే కనిపించిందని అన్నారు. ఢిల్లీలో వెహికల్ పొల్యూషన్‌తో పాటు పొలిటికల్ పొల్యూషన్ ఉందని అన్నారు. బీజేపీ గెలుపుతో పొలిటికల్, వెహికల్ పొల్యూషన్ పోతాయని చెప్పారు. సీఎం చంద్రబాబు, తాను ఢిల్లీ ఎన్నికల్లో >>2



## బిజెపి విజయం చరిత్రాత్మకం

### డి.సిఎం పవన్

**విజయవాడ,ఫిబ్రవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీలో 27 ఏళ్ళ తరువాత బిజెపి చారిత్రత్మక విజయం సాధించడం అపూర్వమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆ మేరకు ఆయన 'ఎక్స్' పోస్టులో స్పష్టం చేసారు. 2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా నిలిచేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్తశుద్ధితో పరిపాలన సాగిస్తున్నారు. సంక్షేమాన్ని విస్మరించని అభివృద్ధి కార్యక్రమాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు ఇస్తున్నారు. నరేంద్ర మోదీ నిర్దేశించిన లక్ష్యాన్ని అందుకోవడంలో దేశ రాజధాని ఢిల్లీ పాత్ర అత్యంత కీలకం. ఈ తరుణంలో ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కూటమి ఘనవిజయం సాధించడం >>2

### రాజధానికి అనుసంధానంగా

# కృష్ణానదిపై 9 వంతెనలు


### గుంటూరు, కృష్ణ, పల్నాడు, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల్లో కొంతభాగంతో అతిపెద్దనగరంగా అమరావతి

### ప్రణాళికలు రూపొందిస్తున్న ప్రభుత్వం

**విజయవాడ,ఫిబ్రవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను దూరాభారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. అనుసంధానంగా కృష్ణానదిపై మొత్తం తొమ్మిది వంతెనలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ఎన్‌టిఆర్, బాపట్ల జిల్లాల్లో కొంతభాగం కలిపి అతి పెద్దనగరంగా తయారవనున్నాయి. వీటి నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అమరావతి కొత్త రైల్వేలైన్‌తో సమానంగా వీటిని కూడా పూర్తిచేయాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. అమరావతి ఔటర్ రింగు రోడ్డుకు కేంద్రం ఆమోదం తెలిపిన నేపథ్యంలో వీలైనంత త్వరగా మిగిలిన పనులూ పూర్తి చేసుకునేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందిస్తోంది. రాజధాని తూర్పుభాగంలో పెనమలూరు మండలం చోడవరం గుంటూరు జిల్లా రామచంద్రాపురం దగ్గర్లో ఇన్నర్‌రింగురోడ్డు వంతెన కట్టనున్నారు. కృష్ణా జిల్లా కాసరనేనివారిపాలెం గుంటూరు జిల్లా పెదకొండూరు మధ్య తూర్పు జాతీయ రహదారి బ్రిడ్జి రానుంది. వల్లూరుపాలెం మున్నంగి మధ్యలో జాతీయ రహదారి వస్తుంది. వీటికి దిగువలో పెనుమూడి వారధి కూడా ఉంది. కృష్ణానదిపై కొత్తగా నిర్మించే వంతెనలన్నీ ఒక్కో దానికి 10లేదా 15 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండనుంది. దీంతో ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం చెబుతోంది.

**కృష్ణానదిలో పర్యాటకానికి ప్రణాళిక**

కొత్తగా నిర్మించబోయే వంతెనలతోపాటు ఒకటీ రెండు బ్యారేజీలు నిర్మించడం ద్వారా నీటిని నిల్వ చేసి కృష్ణానదిలో వాటర్ ఎమ్యూజ్‌మెంట్ ఏర్పాటు చేయాలంటూ గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా విడుదల చేసిన విజన్ 2020-21 డాక్యుమెంటులో ప్రస్తావించారు. దీనిలో భాగంగానే ప్రకాశం బ్యారేజీ నుండి అటు కృష్ణాజిల్లా(ప్రస్తుత ఎన్‌టిఆర్), గుంటూరు జిల్లావైపు తాడేపల్లి దగ్గర రిటెనింగ్ వాల్స్ నిర్మించి పర్యాటకం, నీటిలో బోటు షికార్లు ఏర్పాటు చేయాలనేది >>2




శనివారం న్యూఢిల్లీలో ఆర్బీఐ సిబిడి సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

# ఢిల్లీకి 'డబులింజన్'

>> ఎక్కువగా మధ్యతరగతి కుటుంబాలకు బడ్జెట్‌లోచూపించిన తాయిలాలు కట్టిపడేసాయి. మధ్యతరగతి కుటుంబాలకు వార్షిక ఆదాయపన్ను పరిమితి 12 లక్షలకు పెంచుతూ బడ్జెట్‌లో ప్రకటించారు. ఇదే పెద్ద అస్త్రంగా ఢిల్లీలోపనిచేసింది. ఢిల్లీలో ఎక్కువశాతం మధ్యతరగతి వర్గాలే ఎక్కువ. వేతన జీవులకోసం 8వ వేతన సంఘం నియామకంప్రకటించి పెద్ద ఎత్తున ఓట్లు రాబట్టుకుంది. అంతేకాకుండా ఈఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకంగా నిలిచారు. 60 లక్షలపైచిలుకు ఉన్న మహిళా ఓటర్లు బిజెపికే పట్టం కట్టారు. నెలకు రూ.2500 సాయంతోపాటు గర్భిణీలకు 25వేల రూపాయల ఆర్థికసాయం ఓటర్లలో బలంగా నాటుకునిపోయింది. ఢిల్లీలో నిరంతరం కేంద్రంతో వివాదం, లెఫ్టినెంట్ గవర్నర్‌తో వివాదం మద్యం కుంభకోణాలతో నిత్యం వార్తల్లో నిలిచిన ఆమ్ ఆద్మీపార్టీని ప్రజలు ఏవగించుకున్నారు. మహామహులంతా కూడా ఓటమి పాలయ్యారు. జైలుకు వెళ్లి వచ్చిననేతలందరినీ ఓటమి చవిచూపించారు. మాజీ సీఎం పార్టీ అధినేత అరవింద్‌కేజ్రీవాల్, మాజీ డిప్యూటిసిఎం మనిశ్‌సిసోడియా, ఆప్ ప్రభుత్వంలో ఆరోగ్యమంత్రిగాపనిచేసిన సత్యేంద్రజైన్ ముగ్గురినీ కూడా ఢిల్లీ ఓటర్లు ఇంటికి పంపించారు. ఇక అతిస్వల్ప మెజార్టీతో మాత్రమే ఢిల్లీ సిఎం అతిశి మొర్లేనా సింగ్ కల్కాజీ స్థానంలో గట్టెక్కారు. కేవలం నాలుగువేలపైచిలుకు ఓట్లే ఆమె మెజార్టీ సాధించారు. పోలింగ్‌ముగిసిన వెంటనేప్రకటించిన ఎగ్జిట్‌పోల్ సర్వేలు అన్నీ కూడా వాస్తవరూపం దాల్చాయి. 50సీట్లకుపైబడి వస్తాయని ప్రకటించినా ఏకైక అతిపెద్ద పార్టీగా రావడంఖాయం అన్న సర్వేలను ఢిల్లీప్రజలు నిజంచేసారు. అదేవిధంగా ఢిల్లీలో యువ ఓటర్లు, మొదటిసారి ఓటుహక్కుపొందిన ఓటర్లు కూడా కొంత కీలకంగా మారారు. కేంద్రంతో సఖ్యతతో కొనసాగుతూ అభివృద్ధికి పట్టం కట్టే పార్టీయే తమకు ముఖ్యమన్న భావన ఢిల్లీ ఓటర్లలో వ్యక్తం అయింది. అందువల్లనే ఢిల్లీప్రజలు భారతీయ జనతాపార్టీని అఖండమెజార్టీతో గెలిపించడంతో ఆపార్టీలో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. సుష్మస్వరాజ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన తర్వాత మళ్లీ ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రాలేదు. దేశంలోని ఇతర రాష్ట్రాలపై ఫోకస్ పెంచిన బిజెపి ఢిల్లీని పెద్దగా పట్టించుకోలేదు. కాగా 2014 నుంచి ప్రధానిగా మోడీ పగ్గాలుచేపట్టినప్పటినుంచి ఆప్‌ప్రభుత్వ పనితీరును గమనిస్తూ వచ్చారు. దేశ రాజధాని పరిసరప్రాంతాలు కేంద్రపాలిత ప్రాంతం కేంద్రం అధీనంలోనే ఉంటున్నందున ఢిల్లీని పార్టీ ఖాతాలోవేసుకుంటే పాలన సౌలభ్యం మరింతమెరుగుపడుతుందని ముందునుంచి భావించారు. ఆదిశగానే వ్యూహాలను అమలుచేసి ఢిల్లీలో కాషాయ జెండాను ఎగురవేసారు.



ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి విజయం పట్ల పాట్నాలో శనివారం సంబరాలు చేసుకొంటున్న ఆపార్టీ మహిళా నేతలు

# బిజెపి విజయం చరిత్రాత్మకం

>> స్వాగతించదగ్గ పరిణామం. డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా దేశ రాజధానిలో సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమం క్షేత్ర స్థాయికి చేరతాయి. ఢిల్లీ అభివృద్ధికీ, దేశ రాజధానిలోని ప్రజల శ్రేయస్సు, సంక్షేమం కోసం వికసిత సంకల్ప్ పత్రం ద్వారా బీజేపీ ఇచ్చిన హామీలు ప్రజల మెప్పు పొందాయి. నరేంద్ర మోదీ ఢిల్లీ ప్రజలు ఉంచిన విశ్వాసానికి ప్రతీక అక్కడి ఘన విజయం. ఆర్థిక అవకతవకలకు ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాల అమలు, పరిపాలన సాగుతాయని అక్కడి ప్రజలు విశ్వసించారు. కేంద్ర హోమ్ శాఖామాత్యులు అమిత్ షా దేశ రాజధాని ప్రజల ఆకాంక్షలు అర్థం చేసుకొన్నారు. ఆయన రాజకీయ అనుభవం, చాతుర్యం సత్ఫలితాలను ఇచ్చాయి. కేంద్ర ఆరోగ్య శాఖామాత్యులు, బీజేపీ జాతీయ అధ్యక్షులు జె.పి.నడా కూటమిని ముందుకు తీసుకువెళ్లడంలో సఫలీకృతులయ్యారు.

ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో విజయానికి మూలకారకులైన నరేంద్ర మోదీ కి, అమిత్ షా జె.పి.నడ్డా, బీజేపీ, మిత్రపక్ష నాయకులకు హృదయపూర్వక అభినందనలు.

# ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తి రంగంలో 8 ప్రాజెక్టులు: సిఎం చంద్రబాబు

## సౌర, పవన, పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ఏర్పాటుకు ఉత్తర్వులు

**విజయవాడ, ఫిబ్రవరి8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 8 సౌర, పవన, పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రత్యామ్నాయ విద్యుత్తు పునరుత్పత్తి రంగంలో ప్రభుత్వ పలు సంస్థల ద్వారా పెట్టుబడులు రప్పిస్తుందని ఆయన స్పష్టం చేసారు. "ఎక్స్" వేదికగా సీఎం చంద్రబాబు ఈ విషయం వెల్లడించారు. ఈ క్రమంలో సౌర, పవన, పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిప్రభుత్వం వేర్వేరు ఉత్తర్వులు జారీచేసింది. ఎకోరెన్ ఎనర్జీకి చెందిన 4 విద్యుత్ ప్రాజెక్టులను ఇతర సంస్థ పేరిట బదలాయించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. వైఎస్సార్ జిల్లా పెద్దముడియం, నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలాల పరిధిలోని ఎస్ఏఈఎల్ సోలార్ ఎంహెచ్‌పీ2 లిమిటెడ్ 300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతించారు. అనంతపురం జిల్లా తాడిపత్రి, వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలంలోని ఎస్ఏఈఎల్ సోలార్ ఎంహెచ్‌పీ 1 లిమిటెడ్ 300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. అన్నమయ్య జిల్లా నందలూరు మండలం చింతలకుంట, మంటపంపల్లిలో 2 వేల మెగావాట్ల కొమ్మూరు పంప్డ్ హైడ్రో స్టోరేజ్ వపన్ ప్రాజెక్టును, మేఘా, ఇంజినీరింగ్ సంస్థకు కేటాయింపునకు అనుమతించారు. అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం గంగవరం గ్రామ పరిసరాల్లో టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ 400 మెగావాట్ల సోలార్ పవన్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గుజ్జిలిలో 1500 మెగావాట్లు, చిట్టంవలసలో 800 మెగావాట్ల కలిపి మొత్తం 2300 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుకు నవయుగ ఇంజినీరింగ్ కంపెనీకి అనుమతించారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కనగానపల్లి, రామగిరి మండలాల్లో కడప రెన్యువబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 231 మెగావాట్ల పవన పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. అనంతపురం జిల్లాలోని శెట్టూరు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండల్లాల్లోని 178.20 మెగావాట్ల పవన్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనంతపూర్ రెన్యువబుల్స్ లిమిటెడ్‌కు అనుమతించారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిధిలోని కంబదూరు, రామగిరి మండలాల్లో 118.80 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆస్పరి రెన్యువబుల్స్‌కు ఆదేశాలిచ్చారు. కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలోని ఎకోరెన్ ఎనర్జీకి చెందిన 498.30 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును ఆయన రెన్యువబుల్ పవర్ పేరిటి బదలాయిస్తూ ఆదేశాలిచ్చారు. రాళ్లఅనంతపురంలో ఉన్న ఎకోరెన్ ఎనర్జీకి చెందిన 201.30 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును 02 పవర్ ఎస్‌జీ2 లిమిటెడ్ పేరిట బదలాయించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఎకోరెన్ ఎనర్జీకి చెందిన 349.5 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును ఏంఎంపీఐన్ ఎనర్జీ బదలాయించారు. ఎకోరెన్ ఎనర్జీకి చెందిన శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లె మండలం మద్దెలచెరువు గ్రామంలోని 42.90 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును ఎన్ఎస్ఎల్ రెన్యువబుల్ ఎనర్జీ పేరిట బదలాయించి, 50 మెగావాట్ల సోలార్, విండ్, హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతిస్తూ ఉత్తర్వు జారీచేశారు.

**సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 10 తేదీన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం**

సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం ఈ నెల 10 తేదీన జరగనుంది. 229వ, 230వ బ్యాంకర్ల సమావేశాలను ఒకేసారి నిర్వహించేందుకు అధికారులు సచివాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది అక్టోబరు 17 తేదీన 228వ ఎస్ఎల్ బీసీ సమావేశం జరిగింది. వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలు సహా, పీ4 విధానం అమలు అంశాలపై ఎస్ఎల్ బీసీ సమావేశంలో చర్చించనున్నారు.

ప్రాథమిక రంగానికి రుణాల వితరణ, ఎంఎస్ఎంఈలకు ఆర్థిక సహకారం, వార్షిక రుణ ప్రణాళికలపై సమీక్ష చేయనున్నారు. 228వ బ్యాంకర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, యాక్షన్ టేకెన్ రిపోర్టుపైనా ఎస్ఎల్‌బీసీలో చర్చించనున్నారు. టిడ్కో ఇళ్లు, డ్వాక్రా రుణాలు, ముద్రా రుణాలు, స్టాండప్ ఇండియా, పీఎం స్వనిధి లాంటి కేంద్ర పథకాలపైనా సమీక్ష చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ నెట్వర్క్, డిజిటల్ జిల్లాల అంశంపైనా ఎస్ఎల్ బీసీ సమావేశంలో చర్చించనున్నారు. సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఇతర శాఖల మంత్రులు హాజరు కానున్నారు.

# ప్రజల తీర్పును అంగీకరిస్తున్నాం

>> బిజెపికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రజలు ఎంతో విశ్వాసంతో గెలిపించారని, ప్రజల ఆకాంక్షలమేరకు పనిచేస్తుందని ఆశిస్తున్నట్లు కేజ్రివాల్ పేర్కొన్నారు. గడచిన పదేళ్లలో విద్య, ఆరోగ్యం, మంచినీరు, విద్యుత్ రంగాల్లో గణనీయమైన కృషిచేసామని అన్నారు. ఢిల్లీలో మౌలికవసరులు పెంపొందించేందుకు కృషిచేసామన్నారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి పార్టీకేడర్ మొత్తం అకుంఠిత దీక్షతో పనిచేసిందని అభినందించారు. న్యూఢిల్లీ సెంట్రల్ నియోజకవర్గంలో నాలుగు వేల ఓట్ల తేడాతో ఆయనపై బిజెపి అభ్యర్థి పర్వేష్‌వర్మ గెలిచిన సంగతి తెలిసిందే.

# కాగ్ నివేదిక ఇస్తాం

>> న్నారు. ఈరోజు ఢిల్లీ ప్రజలంతా నాపై విశ్వాసం ఉంచినందుకు శిరసువంచి అభివాదం చేస్తున్నట్లు మోడీ అన్నారు. అభివృద్ధిలో ఢిల్లీని పరుగులు పెట్టిస్తానని ఈసందర్భంగా ఢిల్లీప్రజలకు హామీ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. అభివృద్ధి, విజన్, నమ్మకానికి దక్కిన విజయమే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం అన్నారు. ఈ విజయం అవిశ్రాంతంగా పోరాడిన ప్రతి బిజెపి కార్యకర్తకు దక్కుతుందని అభినందించారు. మార్పుకోరుతూ ఢిల్లీప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం సిటీగా పరిమితం కాదని యావద్దేశానికి వర్తించే చరిత్రాత్మక తీర్పు అని మోడీ శ్లాఘించారు. భిన్న సంస్కృతులకు నిలయమైన ఢిల్లీనిమినీ హిందూస్థాన్‌గా భావిస్తామన్నారు. అవినీతికి వ్యతిరేకంగాపార్టీ పెట్టినవారు పూర్తి అవినీతిలో కూరుకుపోయారని అన్నారు. ఢిల్లీ తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే కాగ్ నివేదిక ప్రవేశపెడతామని మోడీ హెచ్చరించారు. వాయుకాలుష్యం పారిశుధ్యసమస్యలు పట్టిపీడిస్తున్నాయని, ఆప్‌ప్రభుత్వంలో యమునా కాలుష్య కాసారంగా మారిపోయిందని, యమునాలో విషం కలిపారంటూ హర్యానపై తప్పుడు ఆరోపణలుచేసారని, యమునాను ఆప్‌ప్రభుత్వం అపవిత్రం చేసిందని కాలుష్యకోరలనుంచి యమునానదిని రక్షిస్తామని ఎంత కష్టమైనా యమునా నదిని ప్రక్షాళనచేస్తామని ప్రధాని అన్నారు.

అలాగేసభలో కాంగ్రెస్‌పైనా ఛలోక్తులు విసిరారు. ఢిల్లీ ఫలితాల్లో కాంగ్రెస్ జీరో హ్యాట్రిక్ కొట్టిందని వ్యాఖ్యానించారు. వరుస ఓటములతో కాంగ్రెస్‌కు గోల్డ్‌మెడల్ ఇవ్వవచ్చని అన్నారు. కాంగ్రెస్ మునిగిపోవడమే కాకుండా వారి మిత్రులను కూడాముంచేస్తోందని వ్యంగ్యోక్తులు సంధించారు. ఇండియా కూటమిలోని పార్టీలకు కాంగ్రెస్ నిజస్వరూపం తెలిసిపోయిందని ఓటుబ్యాంకు రాజకీయాలను మిత్రులు కూడా గ్రహించారని మోడీ పేర్కొన్నారు. పూర్వాంచల్ ఓటర్లకు ప్రధాని మోడీ ధన్యవాదాలు తెలిపారు. సభకు బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపినడ్డా అధ్యక్షత వహించారు. ఢిల్లీ విజయం బిజెపి క్షేత్రస్థాయిలో పనిచేసిన ప్రతి కార్యకర్త విజయం అని నడ్డా పేర్కొన్నారు.

## బిజెపిని మరోసారి గెలిపిస్తున్నందుకు
# రాహుల్ గాంధీకి అభినందనలు
### ఢిల్లీ ఫలితాలపై సెటైరికల్ ట్వీట్, పాత వీడియోను పంచుకున్న కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి8:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యం చూపింది. విజయం ఖాయం చేసుకుంది.

ఈ నేపథ్యంలోనే ఢిల్లీ ఎన్నికల ఫలితాల ట్రెండ్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సోషల్ మీడియా వేదికగా స్పం దించారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఎద్దే వా చేస్తూ పోస్టు పెట్టారు. 'బీజేపీని మరోసారి గెలిపిస్తున్నందుకు రాహుల్ గాంధీకి అభినం దనలు' అంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు. దీనికి 2024లో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ వీడియోను కేటీఆర్ జతచేశారు.

# కృష్ణానదిపై 9 వంతెనలు

>> గతంలో ఉన్న ప్లాను. దీన్ని ప్రస్తుతం అమలు చేసేందుకు వీలుగా ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు రిటైనింగ్ వాల్స్ చేపడుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లావైపు గోడ నిర్మాణం పూర్తి చేయగా, గుంటూరు జిల్లావైపు నిర్మాణానికి ఇటీవల రూ.294కోట్లు కేటాయించారు. దీనిలో భాగంగానే పెదపులిపాక సమీపంలో బ్యారేజీ నిర్మాణం చేపట్టాలనేది గత ప్లాను. ఇటీవల ఇచ్చిన మాస్టర్‌ప్లానులో దీన్ని కూడా చూపించారు.

ప్రసుతం కృష్ణానదిపై కృష్ణా, గుంటూరు జిల్లాల మధ్యలో ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గ వారధి ఉన్నాయి. కృష్ణా, బాపట్ల జిల్లాలను కలుపుతూ పెనుమూడి వారధి ఉంది. వీటికితోడు త్వరలో రాజధానిలో నుండి వెళ్లే పశ్చిమ జాతీయ రహదారి వంతెన అందుబాటులోకి రానుంది. ఇవి కాకుండా మరో ఆరు వంతెనలు ఏర్పాటు చేయనున్నారు. ఔటర్‌రింగురోడ్డుకు అనుసంధానంగా అమరావతి పశ్చిమ ప్రాంతంలో అమరావతి, మున్నలూరు మధ్య అతిపెద్ద వంతెన నిర్మించనున్నారు. వైకుంఠపురం కేతనకొండ మధ్యలో ఇన్నర్‌రింగురోడ్డుపై మరో వంతెన నిర్మిస్తారు. ఉద్దండ్రాయునిపాలెం, ఇబ్రహీంపట్నం మధ్య రాజధాని ఐకానిక్ బ్రిడ్జి కట్టనున్నారు. వీటితోపాటు వెంకటపాలెం, సూరాయపాలెం మధ్యలో పశ్చిమ జాతీయ రహదారి వంతెన పూర్తవుతోంది. మొత్తం నాలుగు వంతెనలు అమరావతి నూతన నగరంతో కలిసే విధంగా నిర్మించనున్నారు.

# కమలం జోరుకు కంగుతున్న ఆప్ దిగ్గజనేతలు!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశరాజధాని ఢిల్లీలో కీలకపరిణామం చోటుచేసుకుంది. అధికార ఆప్ అగ్రనేతలకు ఢిల్లీ ఓటర్లు షాకులిచ్చారు. ఆప్ జాతీయ కన్వీనర్ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఈ ఎ న్నికల్లో ఓటమిని చవిచూసారు. ఆయనతోపాటు అగ్రనేతలు మనీష్‌సిసోడియా, సత్యేంద్రజైన్‌లు కూడా ఓటమి పాలయ్యారు. న్యూఢిల్లీ సెంట్రల్ నియోజకవర్గంనుంచి పోటీచేసిన కేజ్రీవాల్‌పై బిజెపి అభ్యర్థి పర్వేష్ వర్మ గెలిచారు. అయితే ఈ ముగ్గురునేతలు ఢిల్లీ మద్యం కుంభకోణంకేసులో నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ముగ్గురునాయకులు జైలుశిక్ష అనుభవించి బయటకు వచ్చారు. దీనితో వీరిని ప్రజలు ఓడించారు. మరోవైపు కల్కాజి నియోజకవర్గంలో సీఎం అతిశి మాత్రం విజయం సాధించారు. జంగ్‌పురలో బిజెపి అభ్యర్థి తర్వీందర్‌సింగ్‌చేతిలో మనీష్ సిసోడియా పరాజయం పాలయ్యారు. అలాగే షాకుర్‌బస్తీలో సత్యేందర్‌జైన్‌సైతం ఓటమి పాలయ్యారు. అదేవిధంగా మరో ప్రముఖ ఆప్‌నేత సౌరభ్‌భరద్వాజ్‌మాత్రం గ్రేటర్ కైలాశ్ స్థానంలోమూడోసారి గెలిచారు. బిజెపికి చెందిన శిఖారాయ్‌పై ఆయన గెలిచారు. అదేవిధంగా ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ నేత పాఠక్ బిజెపి అభ్యర్థి ఉమంగ్‌బజాజ్‌చేతిలో రాజిందర్‌నగర్‌స్థానంలో ఓటమి పాలయ్యారు.

# ఢిల్లీ సిఎం రేసులో పర్వేష్‌సింగ్ వర్మ
## మహిళ అయితే భాంసురి స్వరాజ్, మీనాక్షిలేఖి, స్మృతి ఇరానీ?

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** రెండున్నరదశాబ్దాల నిరీక్షణ తర్వాత ఢిల్లీ పీఠంపై ఇపుడు కాషాయం జెండా ఎగిరింది. దేశరాజధాని అధికారాన్ని ఎవరికి అప్పగిస్తుందో అన్న ఉత్కంఠమధ్యజరిగిన ఎన్నికల్లో బిజెపి ఏకైక అతిపెద్దపార్టీగా అవతరించింది. మెజార్టీ మార్కు 36 స్థానాలను దాటి ఏకంగా 48 స్థానాలు కైవసంచేసుకుంది. సీఎం రేసులో ప్రధానంగా ఉన్న పర్వేశ్ సాహిబ్ సింగ్‌వర్మ ఈ విజయంపై మాట్లాడుతూ ఢిల్లీప్రజలకు ధన్యవాదాలుచెప్పారు. ప్రధాని మోడీ నాయకత్వంలోనే డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. ఇక సీఎం పదవి పరంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయమే అందరికీ శిరోధార్యమని ఎవరి అంచనాలు ఎవరికి ఉన్నా హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని ఖరాఖండిగాచెప్పారు. పర్వేశ్ మాజీ సీఎం సాహిబ్‌సింగ్ వర్మ కుమారుడు. 2014నుంచి 2024 వరకూ పశ్చిమఢిల్లీనుంచి లోక్‌సభ సభ్యుడిగా కొనసాగారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఆయన రికార్డుస్థాయిలో 5.78 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిచారు. ప్రస్తుతం బిజెపి హైకమాండ్ ఢిల్లీ పాలనపగ్గాలు పర్వేశ్‌చేతికి అందించే అవకాశాలే ఎక్కువ అని స్పష్టం అవుతోంది. వీరుకాకుండా ఢిల్లీ బిజెపి చీఫ్ వీరేంద్రసచ్‌దేవాకూడా రేసులో ఉన్నారు. అలా కాకుండా మహిళకే అవకాశం ఇవ్వాలని భావిస్తే బిజెపి ఎంపి మాజీ సీఎం సుష్మస్వరాజ్ కుమార్తె భాంసురి స్వరాజ్ పేరుకూడా వినిపిస్తోంది. అలాగే కరోల్‌బాగ్‌నుంచి పోటీచేసిన దుష్యంత్‌కుమార్ గౌతమ్, ఎంపిలుగా ఉన్న మీనాక్షిలేఖి, అమేథిలో ఓటమి చవిచూసిన కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ పేర్లు కూడా వినిపిస్తున్నాయి.



పర్వేశ్ సాహిబ్ సింగ్‌వర్మ



# తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు సిద్ధమైన ఇసి
## 15వ తేదీలోగా సంబంధిత సిబ్బందికి శిక్షణ పూర్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి8:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ సిద్ధమవుతోంది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించిన ఈసీ, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ అందించడంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 15వ తేదీలోగా సంబంధిత సిబ్బందికి ఎన్నికల తీరుపై శిక్షణ పూర్తి చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైందని చెప్పవచ్చు. అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలలో తమ హవా కొనసాగించేందుకు ఇప్పటి నుండే కసరత్తు ప్రారంభించాయి. మొదటగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండడంతో అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పార్టీలు సమాయత్తమయ్యాయి. ఈ దశలో ఓవైపు రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతుండగా, ఎన్నికల కమిషన్ కూడా అదే రీతిలో అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. ఈనెల 10, 12, 15న పీవో, ఏపీవో లకు శిక్షణ ఇవ్వనుండగా పదవ తేదీలోగా ఎన్నికలకు సిబ్బందిని నియమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. కాగా, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు ఖరారంటూ సోషల్ మీడియాలో సమాచారం వైరల్ గా మారింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 10వ తేదీ విడుదల కాబోతుందని, 24న మొదటి విడత ఎన్నికలు, మార్చి మూడో తేదీన రెండో విడత ఎన్నికలు, మార్చి పదవ తేదీన మూడో విడత ఎన్నికలను నిర్వహించేందుకు ఈసీ సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఎన్నికల కమిషన్ ఇప్పటివరకు గ్రామపంచా యతీ ఎన్నికల నోటిఫికేషన్ పై అధికారిక ప్రకటన చేయలేదు. ఇటీవల సీఎల్పీ సమావేశం నిర్వహించిన తెలంగాణ కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికలలో తమ హవా చాటుకునేందుకు నాయకులను సిద్ధం చేసింది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో విజయాలను సాధించిందని, ఓవైపు రాష్ట్ర అభివృద్ధి తో పాటు, మన వైపు సంక్షేమ పథకాలను కూడా అమలు చేశామన్నారు.

# ఢిల్లీ సెక్రటేరియట్ సీజ్

>>మేరకు సాధారణపరిపాలనశాఖ ఉత్తర్వులు జారీచేసింది. భద్రతాపరమైన సమస్యలు రికార్డుల భద్రతను పరిరక్షించుకునేందుకు ఈ అభ్యర్థన చేసామని జిఎడి పేర్కొంది. సచివాలయంలోని అన్ని శాఖల ఇన్‌ఛార్జిలు సెక్రటేరియట్ కార్యాలయాలు మంత్రుల క్యాంపు కార్యాలయాలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని అన్ని రికార్డులుభద్రపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. ఈ ఫలితాల వేళ అదీ బిజెపి విజయం సాధించిన తర్వాత ఈనిర్ణయం వెలువడటం తీవ్ర చర్చకు దారితీసింది. అయితేఈ ఉత్తర్వులు సాధారణ పరిపాలనలో భాగమని అధికార మార్పిడి జరగబోతున్న తరుణంలో ముఖ్యమైన ప్రభుత్వ రికార్డులు దుర్వినియోగం కాకుండాచూడటమే వాటి ఉద్దేశ్యమని అధికారులు చెపుతున్నారు. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు నిజంచేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ఓటర్లు బిజెపికి పట్టం కట్టారు. కమలదళం హోరులో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీపార్టీకొట్టుకునిపోయింది. శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి మ్యాజిక్‌ఫిగర్ 36ను దాటేసింది. హ్యాట్రిక్‌సాధించాలనుకున్న ఆప్ ఆశలకు గండికొట్టింది.

# పదేళ్ల అరాచకానికి తెర

>> ప్రచారం చేసిన చోట బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారు ఏం మాట్లాడాలనేది ముందుగానే నిర్ణయించుకుంటారని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు.

**విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఘనంగా సంబరాలు:** విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఢిల్లీ పీఠాన్ని కమలనాథులు కైవసం చేసుకోవడంతో బీజేపీ శ్రేణులు బాణసంచా కాల్చి, మిఠాయిలు తినిపించుకుని, నృత్యాలు చేశారు. ఢిల్లీ గడ్డ బీజేపీ అడ్డా అంటూ నినాదాలు చేశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు. సామాన్యుల పార్టీగా ప్రారంభమై అవినీతిలో ఊబిలో కూరుకుపోయిన ఆప్‌నకు దిల్లీలోని అన్ని వర్గాల ఓటర్లూ గుణపాఠం చెప్పారని, ఎన్నికల్లో ప్రజల తీర్పు కాంగ్రెస్‌తోపాటు ఆమ్‌ఆద్మీ పార్టీకి ఓ గుణపాఠమని అన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారానే దిల్లీ అభివృద్ధి సాధ్యమన్న విశ్వాసంతోనే భారతీయ జనతా పార్టీని ప్రజలు ఆదరించారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. దిల్లీ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ విజయభేరి మోగించిన నేపథ్యంలో, ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయంలో వద్ద నిర్వహించిన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలతో కలిసి బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. అవినీతి, అక్రమాలే ఆప్ పతనానికి కారణమని, ఇవాళ దేశం మొత్తం సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న బీజేపీ వైపు చూస్తున్నాయని చౌదరి అభిప్రాయపడ్డారు. చిట్టచివరి వ్యక్తి వరకూ సంక్షేమ ఫలాలు అందాలన్న కృతనిశ్చయంతో బీజేపీ పథకాలను అమలుచేస్తోందని, అందుకే ఇవాళ దేశం నలు మూలలా పార్టీ విజయకేతనం ఎగురవేస్తోందని ఆయన తెలియజేశారు.

# కుంభకోణాలు, నాయకత్వ లేమితోనే ఓటమి
## ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమిపై అన్నాహజారే



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమిపై సామాజిక కార్యకర్త అన్నా హజారే స్పందించారు. అరవింద్‌కేజ్రీవాల్ విధానాలు, నిర్ణయాలు మద్యం పాలసీ కుంభకోణాలు, నాయకత్వలోపం వంటివి ఓటమికి కారణాలని విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అరవింద్‌కేజ్రీవాల్ తీరుపై మండిపడ్డారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పనితీరు సరిగ్గాలేక పోవడానికి కారణం సరిపోని నాయకత్వం కుంభకోణాలు, రాజకీయ వివాదాలపై దృష్టికేంద్రీకరించడమే కారణమన్నారు. ఆప్‌నేతలకు తాను పదేపదే సలహాలు ఇచ్చినా వారు పట్టించుకోలేదని అన్నాహజారే అన్నారు. ఎన్నికల అభ్యర్థులు స్వచ్ఛమైన వ్యక్తిత్వం, స్వచ్ఛమైన మనస్సు, కళంకంలేని ఖ్యాతి కలిగి ఉండాలని ఎప్పుడూ చెపుతూనే ఉన్నానని అయితే ఆప్ దానిని కోల్పోయిందని వారుమద్యం, డబ్బుతో కూడిన కుంభకోణాల్లో చిక్కుకున్నారన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ప్రతిష్టను దెబ్బతీసారని అందుకే ఎన్నికల్లో ఓట్లు సంపాదించడానికి వారు ఇబ్బందిపడ్డారన్నారు. మరోవైపు అరవింద్ కేజ్రీవాల్ నిరంతరం మంచి వ్యక్తిత్వాన్ని ప్రోత్సహించినా ఎన్నికల్లో పనిచేయలేదని హజారే అన్నారు. మద్యంకుంభకోణాల్లో ఆయన ప్రమేయం ఉందని ప్రజలు విశ్వసించారన్నారు. ఆరోపణలు రాజకీయాల్లో భాగమే కానీ అమాయకత్వాన్ని వారు కాపాడుకోవాలి. సత్యం ఎప్పుడూ సత్యంగానే ఉంటుందన్నారు. ఆప్‌తో దూరంగా ఉండాలని తాను మొదటి నుంచి నిర్ణయించుకున్నట్లు అన్నా హజారే అన్నారు. ఒకసమావేశం జరిగితే ఆపార్టీలో చేరకూడదని అనుకున్నానని అప్పటినుంచి దూరంగా ఉన్నానన్నారు. ప్రతిఫలం ఆశిం చకుండా లక్ష్యం సాధించడానికి ప్రయత్నించడం సరైన విధానమని దీన్ని గ్రహించడంలోకేజ్రీవాల్ విఫలం అయ్యారని అందుకే నిండా మునిగి పోయారన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 9-02-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
ద్వాదశి రా.7.26
ఆరుద్ర సా.5.52
వర్జ్యం : తె.5.56-7.32
దు.సా.4.38-5.24
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. శుభకార్యాలలో పాల్గొంటారు.

**వృషభం :** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మిథునం:** పనులలో తొందరపాటు వద్దు. ఖర్చులు పెరుగుతాయి ప్రయాణాలు.

**కర్కాటకం :** ఆలోచనలు స్థిరంగా ఉండవు. దైవదర్శనాలు మిత్రుల కలయిక. పనులు సకాలంలో పూర్తి.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. ఆర్థిక లాభాలు పొందుతారు. నూతన వస్తు లాభాలు.

**కన్య :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

**తుల :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. మిత్రుల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**ధనుస్సు:** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. వాహన సౌఖ్యం.

**మకరం:** రుణబాధలు ఎదురై అధిగమిస్తారు. మిత్రులతో విభేదాలు ఏర్పడిన పరిష్కరించుకొంటారు.

**కుంభం:** స్వల్ప అనారోగ్యం సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. ధన వ్యయం పెరుగుతుంది.

**మీనం :** వృత్తి, వ్యాపారాలు నిరాశపరుస్తాయి. అనుకోని ఖర్చుల ఎదురైన సమర్థవంతంగా నిర్వహిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

09-02Pg3exHMNWJQEV1111VJA.qxd:09-02Pg3exHMNWJQEV.qxd 01/01/01 8:24 AM Page 1





## విజయసాయిరెడ్డి నాటకాలాడుతున్నారు

### - టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**విజయవాడ.ఫిబ్రవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** దోపిడీలో,అవినీతిలో భాగస్వాములైనా వైఎస్ జగన్, విజయసాయి రెడ్డిలు కలిసి నాటకాలాడు తున్నారని, ఇద్దరినీ నమ్మటానికి లేదని తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. జగన్నాటకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దారుణాలు, దోపిడీలు, దాడులకు కేరాఫ్ అడ్రస్ జగన్ మోహన్ రెడ్డి అని మండిపడ్డారు. జగన్ 1.0, 2.0 రెండు కూడా ప్రజాధనం దోపిడీనే ప్రధాన లక్ష్యమని దుయ్యబట్టారు. ప్రజా తీర్పును గౌరవించలేని వారు ఇక కార్యకర్తలను ఏం గౌరవిస్తాడని నిలదీశారు. జగన్ మళ్లీ అధికారంలోకి రావడం పగటి కలే అని ఎద్దేవా చేశారు. విశ్వసనీయత, నీతి, నిజాయితీల గురించి జగన్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు అల్లినట్లు ఉందని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏనాడు పరిపాలన చేయని జగన్ అధికారం కోల్పోవటాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రజా తీర్పును గౌరవించడం రాదు కాబట్టే అసెంబ్లీకి రాను అంటున్నాడని ధ్వజమెత్తారు. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు హరించేలా సొంత డిస్టిలరీలు జగన్ నడిపారని ఆరోపించారు. బీసీలను జగన్ నట్టేట ముంచి రిజర్వేషన్లలో కోత పెడితే, చంద్రబాబు ఏడు నెలల్లో పునరుద్ధరణ చేశారన్నారు.

# నవ్వు ఆరోగ్యానికి దివ్య ఔషధం

### - రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్ పర్సన్ పొడపాటి తేజస్వి
### - సుమధుర హాస్య నాటికల పోటీలు, వార్షికోత్సవం ప్రారంభం



**విజయవాడ.ఫిబ్రవరి 8,ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం మనం ఎదుర్కొనే ఒత్తిళ్లను అధికమించి హాయిగా నవ్వుకోవడానికి మనం ప్రయత్నించాలని, మనిషి ఆరోగ్యానికి నవ్వే దివ్య ఔషదం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్క ృతి కమీషన్ చైర్ పర్సన్ పొడపాటి తేజస్వి అన్నారు. సుమధుర కళా నికేతన్ 27వ తెలుగు హాస్య నాటికల పోటీలు, 51వ వార్షికోత్సవం సిద్ధార్థ కళా పీఠం సౌజన్యం తో మొగల్ రాజ్ పురం లోని పి బి సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిధిగా విచ్చేసిన పొడపాటి తేజస్వి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ ఎదుటి వారిని ఏడిపించడం సులభమే, కాని నవ్వించడం కష్టం అన్నారు. కళాకారులు తమ హాస్యనటనతో మనల్ని ఆనందింపజేయడం అభినందనీయం అన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని నాటకరంగ అభివృద్ధికి కృషి చేద్దాం. ప్రభుత్వం తరుపున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కళాకారుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం నాటకరంగానికి ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఇతర రాష్ట్రాల్లో కళలకు వంచి ప్రోత్సాహం ఉంది అని తేజస్వి అన్నారు. ఇటువంటి కళలకు ప్రజల ప్రోత్సాహం అవసరం అన్నారు. సుమధుర గౌరవా ధ్య క్షులు డాక్టర్ యం సి దాస్ స్వాగతం పలు కుతూ నేటి సినిమాల్లో వస్తున్న వెకిలి, బూతు హాస్యాన్ని నిరసించాలన్నారు. కుటుంబ సమేతంగా చూడతగ్గ హాస్యనాటికలను ప్రత్స హించాలని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సామంతపూడి నరసరాజు తాము అత్యంత వ్యయప్రయాసలతో పోటీలను నిర్వహించేది ప్రజల ఆనందం కోసమేనన్నారు. కళా పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎన్ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి పసుమర్తి విజయ భాస్కర శర్మ సంస్థ ఆశయాలను వివరిస్తూ పేద కళాకారులకు చేయూతను అందిస్తున్నట్లు తెలిపారు. సిద్ధార్థ కళా పీఠం అధ్యక్షులు పి లక్ష్మణ రావు ప్రసంగిస్తూ యువతను ఈ కళలపట్ల ఆకర్షితులను చేయాలన్నారు. సభలో కళావిపంచి, హైదరాబాదు అధ్యక్షులు బొప్పన నరశింహారావు, బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, గాంధీ కొ ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకటరావు ప్రసంగించారు. ప్రముఖ రంగస్థల సినీనటులు, రచయిత ఎస్ కె మిశ్రో కు జి రాధాకృష్ణ మూర్తి(జిఆర్కె) స్మారక పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. సత్కార అనంతరం మిశ్రో మాట్లాడుతూ తన కష్టాలను మర్చిపోయి ప్రేక్షకులను వినోదవరుస్తున్న కళాకారుడు ధన్యజీవి అన్నారు. అనంతరం హాస్య నాటిక పోటీలలో తొలి ప్రదర్శనగా కళాంజలి, హైదరాబాదు వారిచే వీడేం మగాడండి బాబూ నాటిక ప్రదర్శనతో ప్రేక్షకులను నవ్వించారు. చదువు, ఉద్యోగం రాకపోయినా, ఆటల్లో ఓడినా, సకాలంలో పెళ్ళి కాకపోయినా వీడేం మగాడండి బాబూ అంటారు. మగాడి అవస్థలను చక్కటి హాస్యంతో ప్రదర్శించారు. దీనిలో శోభారాణి, సురేంద్ర, కొల్లా రాధాకృష్ణ, తిరుమల, దర్శకుడు జి ఎస్ చలపతి నటించగా, పి టి మాధవ్ రచన చేశారు. తదుపరి సహృదయ, ద్రోణాదుల వారు వర్క్ ఫ్రం హోమ్ నాటిక, అద్దేపల్లి భరత్ కుమార్ రచనను, కె మహేంద్ర దర్శకత్వంలో ప్రదర్శించారు. ఇందులో దర్శకుడు డి మహేంద్ర, కొత్త శివరాం ప్రసాద్, ఆళ్ళ హరిబాబు, షేక్ షఫీ ఉజ్మా, వి నాగేశ్వరరావు, లహరి పాల్గొన్నారు. కాఫీ కలపడం కూడా రాని భార్యతో కొత్త కాపురం పెట్టి, అన్ని సపర్యలూ చేస్తుంటాడు సాఫ్ట్ వేర్ ఉద్యోగి సుధీర్. వర్క్ ఫ్రం హోమ్ పర్మిషన్ తీసుకుని ఇంటి పని, ఆఫీస్ పని తో సతమతమయ్యే ఇబ్బందులను నవ్వుల నజరానాగా అందించారు. తొలుత సింగారమణి సి హెచ్ అజయ్ కుమార్ శిష్య బృందం స్వాగత నృత్యాలతో అలరించారు. ఇంపైన నాదస్వరం వినిపించారు. సుమధుర సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి కైలాసరావు చక్కటి వ్యాఖ్యానం అందించగా, కోశాధికారి డి వి శివరాం, కార్యనిర్వాహక కార్యదర్శి పి ఎస్ ఎన్ మూర్తి, బి ఆంజనేయ రాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## మహానాడు రోడ్డు పేరు యధాతథం, ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ,ఫిబ్రవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** మహానాడు రోడ్డు పేరును యధాతథంగా ఉంచాలంటూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవినేని అవినాష్ ప్రోద్బలంతో మహానాడు రోడ్డు పేరును దేవినేని రాజశేఖర్ పేరుగా మార్చారు. మహానాడు పేరు కొనసాగించాలంటూ స్థానికుల నుంచి పెద్దఎత్తులో విజ్ఞప్తులు ప్రభుత్వానికి వచ్చాయి. స్థానికుల విజ్ఞప్తితో పాటు రోడ్డు చరిత్రను వివరిస్తూ మున్సిపల్ కమిషనర్‌కు విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు లేఖ రాశారు. ఈ లేఖపై స్పందించి రికార్డును పరిశీలించి, సమగ్ర నివేదికను ప్రభుత్వానికి మున్సిపల్ కమిషనర్ నివేదించారు.

## పేదరిక నిర్మూలనకు ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యం అవసరం: సిఎం చంద్రబాబు

### - అన్నక్యాంటీన్‌కు విజయవాడ కానూరుకు చెందిన గుమ్మడి నాగేశ్వరరావు రూ.5 లక్షల విరాళం



**విజయవాడ, ఫిబ్రవరి8, ప్రభాత వార్తప్రతినిధి:** పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యం అవసరమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అన్నక్యాంటీన్‌కు విజయవాడ కానూరుకు చెందిన గుమ్మడి నాగేశ్వరరావు రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని కుటుంబ సభ్యులతో కలిసి రూ.5 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును సీఎం అభినందించారు. ఇదే విధంగా అన్న క్యాంటీన్ నిర్వహణకు దాతలు మరింతగా ముందుకు రావాలన్నారు. అమరావతి నిర్మాణంలోను ప్రజా సహకారం అవసరమన్నారు. ప్రభుత్వానికి ఆయా కార్యక్రమాలకు ప్రజలందించే విరాళాలు, ఇతర సహకారాలను పారదర్శకంగా వెల్లడిస్తామన్నారు.

## గూడ్స్ రైలు ప్రమాదంపై విచారణ!

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ ప్రధాన కేంద్రంలో ఈ నెల 4వ తేదీన జరిగిన గూడ్స్ రైలు ప్రమాదంపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు. ఈ నెల 4న మంగళవారం సాయంత్రం 6.7గంటల ప్రాంతంలో గుంతకల్లు జంక్షన్ సౌత్ క్యాబిన్ ఎదురుగా కిలోమీటర్ నెంబర్ 442/26-28,పాయింట్ నెంబర్ 84వద్ద,తోరణగల్లు నుంచి గుత్తి వైపు వెళ్తున్న బిటిబిఆర్/ఎన్ గూడ్స్ రైలుకు చెందిన 26వ వ్యాగన్ నెంబర్ ఇసిఆర్ 73121189916 వ్యాగన్‌కు చెందిన అన్ని చక్రాలు పట్టాలు తప్పగా, 27వ వ్యాగన్ నెంబర్ ఎస్‌డబ్ల్యుఆర్ 73150805924వ్యాగన్‌కు చెందిన ఒక ట్రక్ చక్రాలు పట్టాలు తప్పాయి.

ఈ ప్రమాదంపై డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా విచారణకు ఆదేశించారు. దీంతో శనివారం నుంచి విచారణ ప్రారంభమైంది.

## న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉంది

### - సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్



జ్యోతిప్రజ్వలనం చేసిన హైకోర్టు న్యాయమూర్తి దృశ్యం

**పలమనేరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్ తెలిపారు. చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలో నూతనంగా రూ.15.18 కోట్లతో నిర్మించిన కోర్టు భవనాని సుప్రీం కోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్ శనివారం ప్రారంభిచారు. ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావ్, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, న్యాయమూర్తులు వారిని ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్ మాట్లాడుతూ ప్రజలలో న్యాయవ్యవస్థపై నమ్మకం పెంచే బాధ్యత న్యాయవాదులకు ఉందని గుర్తుచేశారు. 10 సంవత్సరాలలో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పలు కోర్టు భవనాలను ప్రారంభించాను అయితే మదనపల్లె, పలమనేరు కోర్టులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పలమనేరులో గతంలో చిన్న గదులలో ప్రజలకు న్యాయ పరిష్కారం జరిగేదని, నేడు నూతన భవనం నిర్మాణం జరగడం ఆ భవనాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సమస్యలతో వచ్చే ప్రజలకు న్యాయం అందించి ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. చట్టాల ద్వారా ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడుతూ న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తిలు బి.కృష్ణ మోహన్, టి.సి.డి శేఖర్, తిరుమతి మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి గురునాథ్, చిత్తూరు అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్.పి.డి వెన్నెల, డి ఎల్ ఎస్ ఏ సెక్రటరీ భారతి, పలమనేరు సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆది నారాయణ, సివిల్ కోర్టు న్యాయమూర్తి లిఖిత, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రాధమ్మ, ఆర్డీఓ భవానీ, ఏపి బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారక నాథరెడ్డి, పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## రెండునెలల్లో బిసి యూనిట్లు వందశాతం పూర్తవ్వాలి :మంత్రి సవిత



**తిరుపతి,ఫిబ్రవరి 8ప్రభాత వార్తప్రతినిధి:** ప్రస్తుత ఆర్థికసంవత్సరం ముగిసేలోపు బిసి కార్పొరేషన్ల ఆధ్వర్యంలో అందజేస్తున్న స్వయం ఉపాధిపథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి, వందశాతం గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రబిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేవించారు. బిసిలను ఆర్థికంగా అభివృద్ధిచేసేందుకు, బిసి, ఈడబ్ల్యుఎస్, కాపుకార్పొరేషన్ల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపాధి పథకాలు అమలుచేస్తున్నారన్నారు. శనివారం మధ్యాహ్నం తిరుపతి పద్మావతి విశ్రాంతిభవనంలో ఆమె జిల్లాలోని బిసి కార్పొరేషన్, జౌళి, చేనేతశాఖ అధికారులతో సమీక్షించారు. పాడి, గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లు, మహిళలకు కుట్టుమిషన్లతోబాటు ఈవెంట్‌మేనేజ్‌మెంట్ నిర్వహణపై ఆర్థిక సాయం అందించున్నట్లు తెలిపారు. జనరిక్ మందులషాపుల ఏర్పాటుకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు చెప్పారు. అన్ని కులవృత్తులవారికి ఆర్థిక భరోసా కలిగించేలా యూనిట్లు ఏర్పాటుకు సబ్సిడీతో రుణాలు అందజేస్తున్నట్లు మంత్రి చెప్పారు. బిసి స్వయం ఉపాది యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తుల గడువు ఈనెల 12వరకు పొడిగించిన విషయాన్ని ఆమె అధికారులకు సూచించారు. లక్ష్యంమేరకు యూనిట్లు గ్రౌండింగ్ చేయాలన్నారు. చేనేతకు పెద్దపీట వేయాలన్నారు.

ఈ సమావేశంలో బిసి కార్పొరేషన్ ఇడి శ్రీదేవి, చేనేతజౌళిశాఖ ఏడి వరప్రసాద్, ఆప్కో జిల్లా మార్కెటింగ్ అధికారి కోటేశ్వరరావు, ఖాదీవిలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ఏడి వెంకట్రావు, లేపాక్షి మేనేజర్ రవి పాల్గొన్నారు.

## దక్షిణ కైలాసంలో కన్నుల పండువగా భీష్మఏకాదశి

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** దక్షిణకైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తి దివ్య క్షేత్రంలో శనివారం అంగరగ వైభవంగా భక్తి శ్రద్దలతో భీష్మఏకాదశి పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో రాజేష్, సూరి గురుకుల్స్ స్వామి అమ్మవార్లతో పాటు వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామని అందంగా ఆలంకరించారు. అక్కడ ఇఒ డి.బాపిరెడ్డి పూజలు జరిపి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. స్వామి అమ్మవార్లను పాతాళ వినాయకుని ఆలయం ఎదురుగా ఉన్న గోపురం నుంచి రాజగోపురం ద్వారా ఆలంకార మండపం వద్దకు చేర్చారు. అక్కడ సప్పరాలపై ప్రతిష్టించి ఉభయదారులు వెంటరాగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో స్వామి అమ్మవార్లను కన్నుల పండు వగా భక్తులు దర్శించుకుం టుం డగా గ్రామోత్సవం నిర్వహించారు. తేరు వీధిలోని అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామి నాధన్, ఎస్ఎంకె పరశురాం (అచ్చితా) గురుకుల్ చే హారతులందించారు. అక్కడే గల షణ్ముఖ స్వామి ఆలయం వద్ద హారతులిస్తూ ఊరేగింపు సాగింది. నెహ్రూవీధి, సినిమావీధి, బాబూ అగ్రహారం కోనేరు వద్ద నుంచి స్వామి అమ్మవార్లను విజ్ఞాన గిరి వద్ద నిర్మించిన మండపం వద్దకు చేర్చారు.

## స్వమిత్వ పథకం పనులు రాష్ట్రంలో తిరిగి ప్రారంభం

**విజయవాడ,ఫిబ్రవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ కంఠాల్లోని ఇండ్లు, ఖాళీ స్థలాలపై ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించే స్వమిత్వ పథకం పనులు ఏపీలో తిరిగి ప్రారంభించారు. మే నెలాఖరుకల్లా 10 లక్షల ఆస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే పూర్తిచేసి, యాజమాన్య హక్కు పత్రాలు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయంలో ఈ పథకం నత్తనడకన సాగిందనే అభియోగాలున్నాయి, ఎన్నికల ముందు ఈ పథకం కార్యచరణకు బ్రెక్ పడింది. ఇక రాష్ట్రంలో కోటికిపైగా ఆస్తులుంటే ఐదేళ్లలో ఐదు లక్షలకే యాజమాన్య హక్కులను నిర్ధారించారు. అందులోనూ 3 లక్షలు మాత్రమే ధ్రువపత్రాలు (ప్రాపర్టీ కార్డులు) పంపిణీ చేశారు. ఈ పథకం ఆగిన నేపథ్యంలో సర్వే ప్రాధాన్యాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించింది. స్వమిత్వ పథకంలో ఇచ్చే యాజమాన్య హక్కు పత్రాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. దీనికోసం సర్కార్ చట్ట సవరణ చేయనుంది. కీలకమైన ఇలాంటి పథకానికి గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం నిధులివ్వకుండా తూట్లు పొడిచింది. 17,554 రెవెన్యూ గ్రామాల్లో కోటికిపైగా గ్రామకంఠం ఆస్తులుంటే గత ఐదు సంవత్సరాల్లో 1410 గ్రామాల్లో 5 లక్షల ఆస్తులను మాత్రమే డ్రోన్ చిత్రాల ద్వారా సర్వే చేశారు. వీటికి సంబంధించి ముద్రించిన మూడు లక్షల ధ్రువపత్రాల్లో అప్పటి సీఎం జగన్ ఫొటో ఉండడంపై విమర్శలు వచ్చాయి.

## మిర్చిని కేంద్రం కొనాలి: కేంద్ర వ్యవసాయ మంత్రికి టిడిపి విజ్ఞప్తి

**విజయవాడ,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త ప్రతినిధి:** గత ఏడాది చివరి త్రైమాసికంలో కురిసిన వర్షాల కారణంగా మిరప పంట తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు క్వింటాల్‌కు రూ.11,600 చొప్పున చెల్లించి కేంద్ర ప్రభుత్వం మిర్చిని కొనాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. ఈ అంశంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాసిన లేఖను వారు కేంద్రమంత్రికి అందచేశారు.

# తిరుమల సమాచారం

## 12న రామకృష్ణతీర్థముక్కోటి భక్తులకు సకల సౌకర్యాలు

### అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో అత్యంత ముఖ్యమైన తీర్థాలలో రామకృష్ణతీర్థముక్కోటి 12వతేదీ బుధవారం జరగనుంది. ఇందుకు తరలివచ్చే భక్తులకు గోగర్భమ్‌డ్యామ్ పాయింట్ వద్దనుండి యాత్రికులను ఆర్టీసి బస్సుల్లో తరలిస్తామని తెలిపారు. ఉదయం 5గంటల నుండి మద్యాహ్నం 12గంటల వరకు భక్తులను అనుమతిస్తారు. టిటిడి అధికారులు, విజిలెన్స్, పోలీసులు సమన్వయంతో భద్రత ఏర్పాట్లు చేయాలని చౌదరి ఆదేశించారు. రామకృష్ణతీర్థముక్కోటి ఏర్పాట్లు, భద్రతపై శనివారం అన్నమయ్యభవనంలో ఇఒ సుబ్రమణ్యం, వివిఎస్ఓ సురేంద్ర ,డిఎస్ఓ శ్రీనివాసులు, పోలీసు అధికారులతో సమీక్షించారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని, భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు ఇఒ ఆదేశించారు.

## భగవంతుని నామస్మరణతోనే ముక్తి

### - అందరికీ శుభాలు కలగాలని వేడుకున్నాం: ప్రముఖులు



**తిరుమల,ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** నిరంతరం దైవనామస్మరణతోనే ముక్తికలుగుతుందని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని ప్రముఖులు తెలిపారు. కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని వాళ్ళు ఆకాంక్షించారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ప్రముఖ గాయని శోభారాజ్, రాష్ట్రమంత్రి సవిత, జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సయాని కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఆనంద నిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. కలియుగ వైకుంఠం తిరుమల కొండపై రెండవశనివారం నాదనీరాజనం వేదికపై శ్రీవేంకటేశ్వరస్వామికి గాయని డాక్టర్ శోభారాజ్ అన్నమయ్యకీర్తనలు ఆలపించారు. వేలాదిమంది భక్తులు ఎంతో భక్తిభావంతో, ఆధ్యాత్మికతతో ఈ కీర్తనలు ఆలకించారు. అన్నమయ్య కీర్తనలు స్వామివారి సహస్రదీపాలంకార సేవలో ఆలపించారు.

## కన్నులపండుగగా 12న గరుడసేవ



**తిరుమల,ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్ప గరుడసేవకు ఎంతో విశిష్టత ఉంది. గరుడసేవలో స్వామివారు లక్ష్మీకాసులహారం, పచ్చలహారం, మరిన్ని అమూల్యమైన ఆభరణాలు ధరించి ఆలయ మాఢవీధుల్లో భక్తులకు కటాక్షిస్తారు. ప్రతినెలా పౌర్ణమిరోజున గరుడసేవ నిర్వహిస్తారు. ఈనెల 12వతేదీ బుధవారం పౌర్ణమిన గరుడసేవ జగరనుంది. 108 వైష్ణవదివ్యదేశాలలో గరుడసేవకు విశిష్టత ఉంది. రాత్రి 7గంటలకు మలయప్ప వాహనంపై అధిరోహించి భక్తులకు అభయమిస్తారు.

## ఎన్ఆర్ఐలకు ఇక గోవిందుని విఐపి బ్రేక్ దర్శనం

### - ప్రతిరోజూ తల్లిదండ్రులతోనూ వందమందికి అవకాశం

**తిరుమల,ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వస్తున్న ఎన్ఆర్ఐ భక్తులకు ఇకనుండి వందమందికి విఐపి బ్రేక్ దర్శన భాగ్యం కల్పించేందుకు టిటిడి నిర్ణయించింది. ఎన్ఆర్ఐలు వారి తల్లిదండ్రులతో కలసి వచ్చినా వారికి అవకాశం కల్పించనుంది. ఈ మేరకు గతనెలలో ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి (పొలిటికల్)నుండి అందిన లేఖమేరకు టిటిడి పాలకమండలిలో చర్చించిన అధికారులు తాజాగా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఈ కోటాలో 50మంది భక్తులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. ఇకనుండి ఈ కోటాను పెంపుదలచేస్తూ అదనంగా మరో 50మంది ఎన్ఆర్ఐలు ఆయారోజుల్లో తిరుమలకు చేరుకుని ముందురోజు ఆధారాలతో ఫారమ్ పూర్తిచేసి దాఖలుచేస్తే విఐపి బ్రేక్ దర్శన భాగ్యం కల్పిస్తారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణకు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఏపిఎన్ఆరక్ఐలు బ్రేక్ టిక్కెట్లు కొనుగోలుచేసి ఈ సదవకాశం వినియోగించుకోవచ్చు.

**SUPREME COURT OF INDIA**

**RECRUITMENT OF JUNIOR COURT ASSISTANT**

Online applications from eligible candidates are invited for the post of Junior Court Assistant (Group 'B', Non-Gazetted Post) placed in Level 6 of Pay Matrix with initial Basic Pay of **Rs. 35,400/-**. The approximate Gross Salary as per existing rate of allowance including HRA comes to **Rs. 72,040/-** per month (pre-revised pay scale PB-2 with Grade Pay of **Rs. 4200/-**). The details about eligibility conditions etc. can be downloaded from Supreme Court Website **www.sci.gov.in**.

Sd-
(Mashroor Alam Khan)
Registrar (Recruitment)

Place: New Delhi
Dated: 04.02.2025

**SMFG INDIA CREDIT COMPANY LIMITED**
**(Formerly Fullerton India Credit Company Limited)**

SMFG IndiaCredit

కార్పొరేట్ కార్యాలయం : 10వ అంతస్తు, కార్యాలయం నం. 101, 102 & 103, 2 నార్త్ ఎవెన్యూ, మేకర్ మేక్సిటీ, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (E), ముంబై-400051.

**స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

**(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8(1) క్రింద)**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (2002 యొక్క 54) క్రింద దిగువ సంతకందారుడు **SMFG ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ (పూర్వపు ఫుల్లర్‌టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్)** దాని నమోదిత కార్యాలయం కమ్మర్ జోన్ IT పార్క్, టవర్ బి, 1వ అంతస్తు, నం.111, మౌంట్ పూనామల్లె రోడ్డు, పోరూర్, చెన్నై, తమిళనాడు, పిన్‌కోడ్-600116 మరియు కార్పొరేట్ కార్యాలయం, 10వ అంతస్తు, కార్యాలయం నం. 101, 102 & 103, 2 నార్త్ ఎవెన్యూ, మేకర్ మేక్సిటీ, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (E), ముంబై 400051 వద్ద కలిగివున్నదాని అధీకృత అధికారి అయినందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఋణగ్రహీత(లు) **1. బర్నబాసు కిరాణ షాపు 2) పాలిపే బర్నబాసు 3. పాలిపే బిందు** ఋణఖాతా నంబర్ 212120911233855 క్రింద నోటీస్‌లో పేర్కొనబడిన సొమ్ము రూ.22,02,176/- (రూపాయలు ఇరవై రెండు లక్షల రెండు వేల ఒక వంద డెబ్బై ఆరు మాత్రమే) 16.10.2023 నాటికి. సదరు నోటీస్ స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోపుగా తిరిగి చెల్లించవలసినదిగా పిలుపు ఇస్తూ 16.10.2023 తేదీ గల డిమాండ్ నోటీస్ జారీ చేసారు.

ఋణగ్రహీత(లు) బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున ఋణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) యొక్క నిబంధనలు 2002 నిబంధన 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క ఉపవిభాగం (4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ క్రింద పేర్కొనబడిన ఆస్తిని ఈ **04వ రోజు ఫిబ్రవరి 2025** సంవత్సరంలో స్వాధీనం చేసుకొన్నారని ఇందుమూలముగా నోటీస్ ఇవ్వడమైనది.

ఋణగ్రహీతను ప్రత్యేకంగాను మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరిపినా ఫుల్లర్‌టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ బకాయి మొత్తం రూ.22,02,176/- (రూపాయలు ఇరవై రెండు లక్షల రెండు వేల ఒక వంద డెబ్బై ఆరు మాత్రమే) 16.10.2023 నాటికి ఛార్జికి లోబడివుండును మరియు ఆపైన వడ్డీతో. చట్టపు విభాగం 13 యొక్క ఉపవిభాగం (8) యొక్క ఏర్పాటు ప్రకారం ఋణగ్రహీత తనఖా పెట్టబడిన ఆస్తి తిరిగి పొందే కాలానికి సంబంధించిన ఏర్పాటును ఋణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది.

స్థిరాస్తి యొక్క వివరణ : కృష్ణా జిల్లా ఆం.ప్ర. యొక్క S.R.O ఉయ్యూరు పరిధిలోని మరియు ఉయ్యూరు మునిసిపాలిటీలో ఉన్న అసెట్ నెం: 1144010504 ప్రాపర్టీ ట్యాక్స్ ప్రకారం (భూమిపై) ఇ.నం.6-454 దగ్గర, ఆర్.ఎస్.నెం. 697/1లో 142.38 చ.గజాలు లేదా 119.02 చ.మీటర్ల ఒక విస్తీర్ణం గల నివాసిత ఖాళీ స్థలం. సరిహద్దులు: షెడ్యూలు: తూర్పు: వరంగ్ గ్రేసమ్మ యొక్క ఆస్తి 30.7" చ.అ. దక్షిణం: షేక్ సలీమున్నీస యొక్క ఆస్తి 44.6" చ.అ. పడమర: 30.0" చ.అ. వెడల్పు జిల్లా పరిషద్ రోడ్ 28.0" చ.అ. ఉత్తరం: షేక్ అబ్దుల్ జబ్బార్ యొక్క ఆస్తి 43.0" చ.అ.

ప్రదేశం : విజయవాడ, తేదీ: 09.02.2025

సం/-, అధీకృత అధికారి
SMFG ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ (పూర్వపు ఫుల్లర్‌టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్)

# కుల గణనపై దుమారం

కుల గణనపై రాజకీయ దుమారం రేగుతోంది. కుల,మత, ప్రాంత వైషమ్యాలు లేని తెలంగాణ రాష్ట్రంలో కుల గణన కొత్తగా కులాల కుంపట్లు పెట్టినట్లు అవుతుంది. గత ప్రభుత్వ హయాంలోని సమగ్ర కుటుంబసర్వే, ప్రస్తుత కులగణనసర్వే రెండు సర్వేలగురించి వాటి మధ్యఉన్న వ్యత్యాసాల గురించిప్రజల్లో ఉన్నఅపోహల్ని తొలగించే ప్రయత్నం చేయాలి. 2014 సర్వేలో బీసీ జనాభా శాతంలో ముస్లిం, మైనార్టీ జనాభాశాతాన్ని కలిపించకుండా ఓసీ జనాభాశాతం 21శాతం అందులో నుండి13ముస్లిం మైనార్టీలను తీసేసి ఓసీ జనాభా పదిశాతంలోపే మాత్రమే అని ప్రచారం చేస్తున్నారు. అయితే అది వాస్తవ దూరమని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. ఓసీల్లో ఉన్నముస్లిం,మైనార్టీల జనాభా శాతాన్ని తీసివేసినప్పుడు, బీసీల్లో ఉన్న ముస్లిం, మైనార్టీ (బీసీఇ)జనాభా శాతాన్ని తీసి వేసినపుడే అసలు ఎంతమంది ఉన్నారో తెలుస్తుంది.2024కులగణన సర్వేలో బీసీజనాభా ముస్లిం మైనార్టీలను మినహాయించి 46.25 ఓసీ జనాభా 13.31.వాస్తవానికి బీసీజనాభా శాతం ఎక్కువగా ఉంటుందని కొంతమంది, లేదు ముస్లిం, మైనార్టీలను మినహాయించి ఓసీ జనాభా ఎక్కువగా ఉంటుందని కొన్ని కుల సంఘాల వారు వాదిస్తున్నారు. ఎవరికి ఇష్టం వచ్చినట్టువాళ్లు మాట్లాడుతుంటే ప్రభుత్వం చేసిన ఈబృహత్తర కార్యక్రమంబూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. అందుకే ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలి.వివరాలపై ప్రజల్లో ఉన్నఅనుమానాలను నివృత్తి చేయాలి. ప్రజల్లో ఉన్న అపోహలుతొలగించాలి. ప్రభుత్వమే ఈ వివాదానికి తెరదించాలి.తమ పరిధిలో ఉన్న అన్నిఅంశాలను పరిగణనలోకి తీసుకుని బీసీలకు న్యాయంచేస్తామనిచెబుతూ పంచాయితీ ఎన్నికలకు వెళ్లాలనేది కాంగ్రెస్ ప్లాన్. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ వైపు జనం మొగ్గుచూపుతారా లేదా అన్నదే ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

సిహెచ్ వి వి రఘుబాబు

బీసీ రిజర్వేషన్ల రచ్చ తెలంగాణా పాలిటిక్స్‌లో హీట్ క్రియేట్ చేస్తోంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేకు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేసిన కుల గణన నివేదికకు తీవ్ర వ్యత్యాసం ఏర్పడటంతో రాష్ట్ర ప్రజల్లో గందరగోళం ఏర్పడింది. అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచుతామని, కులాల లెక్కలు తేలుస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అందుకు తగ్గట్టుగా కులగణన సర్వేచేసింది. కానీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీ రిజర్వేషన్ల పెంపు పాజిబుల్ అయ్యేలా కనిపించడం లేదు. అయితే సాధ్యమైనంత త్వరగా స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని నుకుంటోంది ప్రభుత్వం. అందుకే ఇప్పుడు రిజర్వేషన్ల ఇష్యూ హాట్ టాపిక్ అయింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో రాష్ట్రంలో బీసీ జనాభా 46.25 శాతమని తేల్చారు. ముస్లిం మైనార్టీలకు చెందిన బీసీలు 10.08 శాతంగా ఉన్నారని నివేదిక చెబుతోంది. అంటే తెలంగాణలో మొత్తం బీసీల జనాభా 56.33శాతంగా తేలింది. ఇక తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకున్నాక మొదటిసారి 2014లో బిఆర్ఎస్ హయాంలో ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే జరిగింది. ఈ సర్వేలో దాదాపు 3.63 కోట్ల జనాభా ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇందులో సామాజిక వర్గాల వారీగా జనాభా శాతం చూస్తే ఓసి21, బీసీ51, ఎస్సీ 18, ఎస్టీ10 శాతంగా తేల్చగా, ఇందులో ముస్లిం, మైనార్టీలు దాదాపు 14 ఉన్నట్లు తెలిపింది. ఇందులో కూడా బీసీ, ఓసీలు ఉంటారు. కాని ప్రత్యేకంగా ముస్లిం మైనార్టీ బీసీ, ముస్లిం మైనార్టీ ఓసీ లని ప్రత్యేకించి చెప్పలేదు. ఈ సర్వే నివేదికతో తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణనను బేరీజు వేసుకుంటే కొన్నివర్గాల జనాభ తగ్గడంతో ఈ సర్వేలు ప్రజలు, రాజకీయ పార్టీల్లో గందరగోళాన్ని కలిగిస్తున్నాయి. ఇకకాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన సమయం వచ్చింది. కానీ సుప్రీంకోర్టు తీర్పుప్రకారం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదు. అంటే ప్రస్తుతమున్న 22 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచడానికి వీల్లేదు. ఇక్కడే కాంగ్రెస్ ప్రభుత్వం ఓ స్ట్రాటజీని ఫాలో అవుతోందనేది అర్థమవుతోంది. బీసీ రిజర్వేషన్లను పెంచుకునేలా పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానంచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించనుంది. అప్పుడు బీసీ రిజర్వేషన్ల బాల్ బీజేపీ సర్కార్ కోర్టులోకి వెళ్తుందని, తమ పరిధిలో ఉన్నంత వరకు చేశామని ప్రజలకు చెప్పుకోవచ్చని కాంగ్రెస్‌ప్లాన్ అనే చర్చ సాగుతోంది. ఇదే సమయంలో 42శాతం బీసీ రిజర్వేషన్ హామీని చట్ట పరంగా కాకుండా, పార్టీ పరంగా నిలబెట్టుకుంటామని సీఎం



రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో 42శాతం సీట్లు డెడికేటెడ్‌గా బీసీలకే ఇచ్చి మాట నిలబెట్టుకుంటామంటున్నారు. అయితే ఇది స్థానిక సంస్థల వరకే పరిమితమా లేక అసెంబ్లీ, పార్లమెంట్ ఇతర ఎన్నికలకు కూడా పార్టీ పరంగా బీసీలకు 42 శాతం టికెట్లు ఇస్తారా అనేదానిపై మాత్రం స్పష్టత లేదు. ఇక మిగతా పార్టీలు కూడా బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే ఉన్న 22 శాతం రిజర్వేషన్ ప్రకారం ఆ సీట్లు బీసీలకు ఇస్తూనే, జనరల్ స్థానాల నుంచి మరో 20శాతం సీట్లు బీసీ కోటాలో చేర్చేలా ఆలోచనచేస్తోంది. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పరంగా 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యం కాకపోయినా పార్టీపరంగా ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చామని చెప్పుకోవాలన్నది రేవంత్ సర్కార్ ఆలోచన. తాము బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వడానికి రెడీగా ఉన్నాం మీ సంగతి ఏంటంటూ బీఆర్ఎస్, బీజేపీపై ఇప్పటికే సీఎం సవాల్ చేశారు. ప్రభుత్వ పరంగా రిజర్వేషన్లు పెంచాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందని కేంద్రంలో తమ ప్రభుత్వం లేదు.కాబట్టి ఇప్పుడు అది సాధ్యం కాదని ప్రజలకు చెప్పాలనుకుంటూనే, పార్టీ పరంగా 42శాతం బిసిలకు స్థానికసంస్థల టికెట్లు ఇచ్చి కామారెడ్డి డిక్కరేషన్‌ను తు.చ తప్పకుండా అమలు చేశామని చెప్పేందుకు సిద్ధమవుతోంది. మరోపక్క దేశవ్యాప్తంగా సగటున ప్రతి జనాభా లెక్కల్లో 13 పెరుగుదల కనిపిస్తుంది. కానీ తెలంగాణ ప్రభుత్వం చేసిన బీసీ కులగణన లెక్కల్లో మాత్రం బీసీ జనాభా తగ్గినట్లు, ఓసి జనాభా పెరిగినట్లు కన్పిస్తుండటంతో వివాదం చెలరేగింది. అయితే ఇందులో ఒక లాజిక్ ఉందంటున్నారు అధికారులు. 2014లో సకుటుంబ సర్వే ఫలితాల్లో మొదటగా ముదిరాజ్, 2వ స్థానంలో మున్నూరు కాపు, 3వ స్థానంలో గౌడ,4వ స్థానంలో యాదవ సామాజిక వర్గాలున్నాయి.కానీ ఇప్పుడు మాత్రం మున్నూరుకాపు సామాజిక వర్గం 4వ స్థానంలో ఉందనేది అనధికార సమాచారం. ఇందువల్లనే మొత్తం బీసీలు తగ్గిపోయారనే వాదన ఉంది. కాపులు గతంలో ఓసీ కేటగిరీలో ఉండేవాళ్లు. ఇప్పుడు కూడా ఆంధ్రప్రదేశ్‌లో కాపులు ఓసి క్యాటగిరీలోనే ఉన్నారు. 1950 తర్వాత తెలంగాణలో మున్నూరు కాపులోని కొన్ని వర్గాలను గుర్తించి బీసీలలో చేర్చారు. ఇప్పటికీ తెలంగాణ పల్లెల్లో మున్నూరు కాపులకు, రెడ్లకు పెద్ద తేడా ఉండదు. దీంతో మున్నూరు కాపులు చాలామంది రెడ్డి అని పేరు వెనకాల తగిలించుకున్నారు. తాజాగా జరిగిన సర్వేలో రెడ్డి అనే పేరు చివరి అక్షరాన్నిచూసి వాళ్ళందరినీ సర్వేయర్లు ఓసి జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. రెడ్డి అని పేరుచివర్లో తగిలించుకున్న వారంతా మున్నూరు కాపులే అయి ఉండడంతో వారి జనాభా తగ్గిపోయింది. కానీ సాంకేతికంగా పేరు చివర రెడ్డి ఉన్న వాళ్లంతా బీసీ సర్టిఫికెట్ పొంది ఉన్న మున్నూరు కాపు సామాజిక వర్గం. సర్వే చేసేందుకు వెళ్లిన సర్వేయర్లకు ఈ విషయం పూర్తిస్థాయిలో తెలియకపోవడంతో వారిని ఓసిక్యాటగిరీలో చేర్చారు. ఇందువల్లనే తెలంగాణలో బీసీ జనాభా తగ్గి ఓసి జనాభా పెరిగినట్లుగా కనిపిస్తుంది అనేది ఒక ప్రచారం. అసలు మొత్తం జనాభా తగ్గింది అనేది మరో ఆరోపణ. ఇందులో కూడా ఓటర్ లిస్టును ఇప్పుడున్న కులగణ సర్వేతో పోల్చిచూడడం వల్ల వస్తున్న ఇబ్బంది అని కొంత మంది అధి కారులు చెబుతున్నారు. ఇక బీసీల్లో బీసీ ఏ, బీసీ బి, బీసీడి లు మాత్రమే హిందూ బీసీలు. బీసీ సి వర్గంలో ఎస్సీ సామాజిక వర్గంలోని ప్రజలెవరైనా క్రైస్తవ మతంలోకి వెళ్తే వారు బీసీ సి కింద పరిగణింపబడతారు. బీసీ ఈలోముస్లిం, మైనార్టీల్లో సామాజిక, ఆర్థిక వెనకబాటు ఉన్నవారు వస్తారు. దాదాపుగా బీసీ ఏలో 68 కులాలు, బీసీ బిలో 28 కులాలు, బీసీ సీలో ఒకటి, బీసీ డిలో 51 కులాలున్నాయి. ముస్లిం మైనార్టీలకు సంబంధించి బీసీలైన బీసీ ఈ వర్గంలో 14 కులాలు ఉన్నాయి. మొత్తంగా బీసీ సామాజిక వర్గంలో 162 కులాలు ఉన్నాయి. ఇప్పుడు పదేళ్ల తర్వాత 2024లో జరిగిన కులగణన సర్వేలో పాల్గొన్న మొత్తం జనాభా 3.54 కోట్లు అయితే సర్వేకు దూరంగా ఉన్న జనాభా దాదాపు 16 లక్షలని ప్రభుత్వం తెలిపింది. అంటే మొత్తం జనాభా 3.70 కోట్లు. 2011 జనగణనలో తెలంగాణ జనాభా 3.51 కోట్లు. 2014 నాటికి సమగ్ర సర్వేలో పెరిగిన జనాభా 3.63 కోట్లు అంటే దాదాపు మూడు ఏండ్లలో 12 లక్షలు పెరిగింది. అంటే ఏడాదికి సగటున 4 లక్షల జనాభా పెరిగింది. ఈ సగటును పరిగణనలోకి తీసుకున్నా 2014 నుండి 2024 వరకు జనాభా దాదాపు 35 40 లక్షలు పెరగాలంటే 4 కోట్లకు పైగా ఉండాలి. కానీ లక్షల్లో జనాభా తక్కువగా నమోదైంది. అంటే సర్వేలో పాల్గొన్నది 97 శాతం కాదు. అంత కంటే తక్కువే. దాదాపు 56 మంది ప్రజలు సర్వేకు దూరంగా ఉండి ఉంటారు. ఇదే సమయంలో రాష్ట్రంలో గతంతో పోలిస్తే బీసీ జనాభా పెరిగిందని కులగణన సర్వేపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో 51.09 గా నమోదైన బీసీ జనాభా శాతం ఇప్పుడు 56.33కు పెరిగినట్లు లెక్కలు చెప్పారు. అలాగే షెడ్యూల్డ్ జనాభా 9.8నుండి 10.45కు, ఇతర కులాల జనాభా 21.55 నుండి 15.79 కు తగ్గిందని తేల్చారు. ఏది ఏమైనా ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇచ్చే వరకూ బీసీ జనాభాపై ఆందోళన తగ్గే అవకాశం కనిపించడం లేదు. ●

# 'కల్లల' దారిలో..

రాష్ట్రం
పంజాబ్

ఎ.వి.వి ప్రసాద్

జీవితం కొత్త బంగారు లోకంలా మారుతుందని కన్న కలలు ఒక్కక్షణంలో పగిలిపోయాయి. ఏదో విధంగా అమెరికా చేరితే అక్కడ కనీసం ఏ హోటల్ లోనో, ఫాంహౌస్‌లోనైనా పనిదొరకకపోతుందా! అనే ఆశతో అడ్డదారులగుండా వెళ్లి హాయిగా బతకొచ్చనుకొన్న చాలా మంది చేతులకు బేడీలు, కాళ్లకు సంకెళ్లు వేయించుకొని 'ప్రత్యేక సైనిక విమానం'లో తిరిగి వచ్చారు. వాళ్లని అలా తోసేసింది అమెరికాప్రభుత్వం. ట్రంప్‌తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకొన్న అనేకానేక 'విపరీత చర్యల'లో ఇది ఒకటి. అన్ని అనుమతులు, అధికార పత్రాలతో వెళ్లి ఉద్యోగాలు సంపాదించుకొని ఇక అక్కడ స్థిరపడతామనుకొన్న వారికి కూడా ఆందోళనకర పరిస్థితి ఏర్పడుతున్నప్పుడు అడ్డదారిలో, అక్రమంగా అమెరికా చేరుకొన్న వారి పరిస్థితి ఎలా ఉంటుంది? నయవంచన చేసే ఏజెంట్లకు 20 నుంచి 80లక్షల దాకా సమర్పించుకొని అక్రమంగా అమెరికా చేరిన భారతీయులు దాదాపు 18 వేల మంది ఉన్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. వారందరిని వెనక్కి పంపడం కోసం అమెరికా ప్రభుత్వం కంకణం కట్టుకొంది.అలాగే మరికొన్ని దేశాల నుంచి అక్రమంగా వలసవచ్చిన వారిని కూడా. అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించడానికి అడ్డదారులు చూపిన ఏజెంట్లు దాదాపు 12వేల కోట్లు జేబులో వేసుకొన్నట్లు తెలుస్తోంది. ఒక్క పంజాబ్‌లోనే ఎనిమిదివేల మంది యువకులు దాదాపు నాలుగువేల కోట్ల రూపాయలు పోగొట్టుకున్నట్లు సమాచారం. గత బుధవారం (5,ఫిబ్రవరి) అమృత్‌సర్‌లో వాలిన అమెరికా 'లోహ విహంగం' లోంచి 104మంది అక్రమవలసదారులు వెర్రిముఖాలు వేసుకొని దిగారు.వారిలోచాలా మంది చేతులకు, కాళ్లకు సంకెళ్లు కనిపించాయి. విమానంలో కదలడానికి కూడా అవకాశం లేకుండా వారిని కూర్చోబెట్టారుట. అమెరికా దృష్టిలో వారు తప్పుచేసినవారైతే కావచ్చు! కానీ వాళ్ల మనుషులే కదా! అమృత్‌సర్‌లో దిగిన 'సి-17' ఒక సైనిక విమానం. ఆ విమానంలో సంకెళ్లు వేసి పంపించిందంటే 'బందీ'లుగా వారిని పరిగణించిందని అర్థం. అంటే బందీలకు ఎలాంటి 'శిక్ష'లు వేస్తారో వారు కూడా అవన్నీ అనుభవించివచ్చారన్నమాట. కొన్ని లక్షలు పోగొట్టుకుని అక్కడికి వెళ్లడమేకాక, ఎంతో దీనావస్థలోఅక్కడి నుంచి వచ్చారంటే వారి జీవితం ఎంత దుర్భరంగా మారిందో చెప్పడానికి ఇంకేం కావాలి! 15 లక్షల మంది ఇతర దేశాల వారిని ఇలాపంపించి వేయడానికి అమెరికా రూపొందించిన వ్యూహంలో ఇదొక అంకం మాత్రమే. అమెరికాలో అక్రమవలసదారులు ఎంతమంది ఉన్నారనే అంశంపై రకరకాల లెక్కలు చెబుతున్నారు. రోజుకోకథ చెబుతున్నారు. మొత్తం అక్రమ వలస దారులు 7.25లక్షలని మరోలెక్క. దాని ప్రకారంభారతీయుల సంఖ్యకూడా పెరుగుతుంది. రానున్న రోజుల్లో అటువంటి 'విమానాలు' మరికొన్ని మన ఎయిర్ పోర్టుల్లో దిగవచ్చు.మొన్న అమృత్ సర్‌కు వచ్చిన విమానం లో పంజాబ్‌కు చెందిన వారు 30మంది



సైనిక విమానం

ఉండగా,హర్యానా-33, గుజరాత్-33,మరికొన్ని రాష్ట్రాల వారుఉన్నారు. వారిలో కొందరు మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. నిజానికి ఇది మొదటిసారికాదు. అక్రమ వలసదారులంటూ ముద్రవేసి గతంలో కూడా వందల సంఖ్యలో భారతీయుల్ని వెనక్కిపంపిన సందర్భాలున్నాయి. గత అక్టోబర్‌లో 100 మంది అమెరికా నుండి తిరిగొచ్చారు. అంతకుముందు 2023 అక్టోబర్ నుంచి గత సెప్టెంబర్ దాకా 1100మందిఅక్రమ వలసదారులు వెనక్కి వచ్చారంటే నిత్యం ఎంత మంది అక్కడికి అక్రమంగా చేరుతున్నారో అర్థం చేసుకోవచ్చు. దీనంతటికి ప్రధాన కారణం దళారులు. వారు చెప్పేమాటలు నమ్మే అమాయకులు. ఉన్న కాస్త ఇల్లు, కొద్దిపాటి పొలం అయిన కాడికి అమ్మేసి, దళారుల మాటలు నమ్మి వారి వెనుక అమెరికా వెళ్తున్నవారే ఎక్కువ.కొడుకులు అమెరికావెళ్తే బాగా డబ్బుసంపాదించి తమ కష్టాలు తీరుస్తారనే గంపెడాశతో ఉన్న ఆస్తులన్నీ కుదువబెట్టి పంపించే తల్లిదండ్రులే ఎక్కువ మంది. టెన్త్ పాసవ్వగానే చాలా మంది ఈ ఏజెంట్ల చేతిలో పడుతు న్నారు. పేదరికంలో మగ్గుతున్నవారిని దళారులు తేలికగా ఆకర్షించి రకరకాల మార్గాల ద్వారా అమెరికా చేరుస్తున్నారు.వారిదగ్గర ఎటువంటి అనుమతులు, అధికార పత్రాలు ఉండవు. వాటి గురించి తెలియనివారే వారిలోఎక్కువ.రకరకాల అడవి మార్గాల ద్వారా ప్రయాణించి వారందరిని తీసుకువెళ్తుంటారు. కొంత మంది డ్రగ్స్, దోపిడీ ముఠాలలో చేరి ఆ వక్రమార్గం కూడా పడుతుంటారు. ముఖ్యంగా పనామా, గ్వాటెమాలా, కోస్టారికా వంటి దేశాల నుంచి అమెరికాకు అక్రమంగా చేర్చడానికి ఏజెంట్లు ప్రయత్నిస్తుండగా, మార్గమధ్యంలో వారిలో కొందరు యువకులను డ్రగ్స్ ముఠాలు ఆకర్షించి తమతో చేర్చుకుంటాయి.ఎంతో ప్రతికూల వాతావరణం ఎదురైనా ఎలాగోలా అమెరికా చేరుతామనే ఆశవారిని ముందుకు నడిపిస్తూఉంటుంది. తీరాఅక్కడికి చేరాక ఏజెంట్లు వదిలే యడంతో దిక్కుతోచని పరిస్థితిలోపడి బిచ్చమెత్తుకునేస్థాయికి చేరుకుంటారు. కొందరు అలవాటైనదోపిడీలు, అక్రమపనులకు పాల్పడుతూ పోలీసులకు దొరికిపోయి జైళ్లపాలవుతుంటారు. ఉన్నతవిద్య కోసం కెనడా, అమెరికా వెళ్లినదాదాపు 20వేలమంది భారతీయ విద్యార్థులు అక్కడ కళాశాలల్లో చేరలేదని ఇటీవల ఓ నివేదిక వెల్లడించింది. మరి వారంతా ఏమయినట్లు? పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్నామంటూ చెప్పేకొందరు నేరస్తులుగా మారినట్లు వార్తలు వినిపిస్తుంటాయి. ఇటువంటి విచారకర ఘటనలు అనేకానేకం.అమెరికాను ఒక భూతల స్వర్గంగా భావించేవారు ఉన్నంతవరకు ఇలాంటి ఘోరమైనపరిస్థితులే ఏర్పడుతుంటాయి.సగటు భారతీయుడు అమెరికా కలలుకంటూ కూర్చుంటే ముందు ముందు ఇంకా ఘోరమైన ఉదంతాలు వినవలసి వస్తుందేమో! సురక్షితమైన వలసలను ప్రోత్సహించేలా కేంద్రం పటిష్టమైన చట్టం రూపొందిస్తే కొన్నివేలమంది భారతీయులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పుడున్న చట్టాలను చాలా మెరుగుపరచవలసి ఉంది. ●

# ప్రధానికి ఎన్నికల పరీక్ష

దేశం
కొసావో

గన్ని మోహన్

ఆగ్నేయ యూరోప్‌లోని చిన్న దేశం ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిద్ధం అవుతోంది. నాలుగేళ్ల క్రితం అద్వితీయ మెజార్టీతో గెలిచిన ప్రస్తుత ప్రధాని ఆల్బిన్ కుర్తి మళ్లీ తన అదృష్టం పరీక్షించుకోనున్నాడు. ఎన్నికల బరిలో మరో ఇద్దరుముగ్గురు నిలిచినా ప్రధానంగా కుర్తిపేరే ఎక్కువ వినిపిస్తోంది. పాలనాపరంగా సంస్కరణలు తీసుకురావడంతోను పొరుగుననే ఉన్న సెర్బియాతో ఉన్న వివాదాలను పరిష్కరించుకునే దిశగా ఆయన వేసిన అడుగులు అక్కడి ప్రజలను ఆకర్షించాయి. తొమ్మిదో తేదీ జరిగే ఎన్నికలు ఆ దేశ సార్వభౌమత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. 2008లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్న తర్వాత ప్రపంచ దేశాలు ప్రత్యేకించి ఐక్యరాజ్యసమితి కూడా గుర్తించిన ఈ దేశాన్ని సెర్బియా మాత్రం గుర్తించలేదు. ఎందుకంటే మెజార్టీ ప్రాంతాలన్నీ సెర్బియా భాష మాట్లాడే ప్రజానీకమే ఎక్కువ నివసిస్తుంటారు. యూరోప్ కూటమిలో ఎగువ మధ్యతరగతి కేటగిరీ దేశంగా గుర్తించినాకొసావో ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం అత్యంత పేద దేశంగానే కొనసాగుతోంది. మొత్తం 26రాజకీయ పార్టీలు ఒక స్వతంత్ర అభ్యర్థి తమతమ అభ్యర్థులను ఎన్నికల్లో పోటీకి దించాయి. మొత్తం 120 మందిని పార్లమెంటుకు ఎన్నుకోవడం ఆపై మెజార్టీ సాధించిన పార్టీకి అధికార పగ్గాలు కట్టబెట్టడం రివాజుగానే వస్తోంది. సెర్బ్ మైనార్టీలకు పది, మరో పది ఇతర మైనార్టీలకు స్థానాలు రిజర్వుచేసారు. కొసావోకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పూర్తికాలం పనిచేసిన పార్టీగా అల్బిన్ కుర్తి పార్టీకి పేరుంది. అందువల్లనే ఈసారికూడా పాలనా పగ్గాలుచేపట్టే దిశగా ఆయన వ్యూహాలు అమలు చేస్తున్నారు. అల్బేనియా, మాంటెనెగ్రో, సెర్బియా, ఉత్తర మెసిడోనియా దేశాలు సరిహద్దులుగా ఉన్న ఈ చిన్నదేశంలో ఈ సరిహద్దు దేశాల ప్రభావం కూడా ఎక్కువగానేకనిపిస్తుంది. 18 లక్షల జనాభా ఉన్న ఈ దేశ జిడిపి 9.4 బిలియన్ డాలర్లుగా ఉంది. యూరో కరెన్సీనే వినియోగిస్తున్న ఈదేశం స్వతంత్రంగా ఆవిర్భవించిన తర్వాత ఇప్పుడు ఐరోపా కూటమిలో సభ్యత్వం తీసుకోవాలని నిర్ణయించుకుంది. దేశంలో రాజకీయ అనిశ్చితిని పారద్రోలి ఏకపార్టీ పాలననే తీసుకురావాలన్న లక్ష్యంతో కుర్తి ఎన్నికల బరిలో నిలిచారు. అల్బేనియా వేర్పాటువాదులు, సెర్బియా ప్రభుత్వదళాల మధ్యఏడాది కాలంపాటు జరిగిన యుద్ధం తర్వాత జరుగుతున్న పార్లమెంటు ఎన్నికలుకావడంతో ఇప్పుడు ఇరుగుపొరుగు దేశాలకు సైతంవీటిపై ఆసక్తి పెరిగింది. వామపక్ష వెటెవెండోస్తే పార్టీ అధినేతగా కుర్తీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక ఇతరత్రా డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ కొసావో పిడికే దేశంలోని అత్యంత పురాతన పార్టీ లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ కొసావో ఎల్డీకే ఈ రెండూ కూడాకుర్తీ వామపక్ష పార్టీకి గట్టిపోటీఇస్తున్నాయి. వీటిలో పిడికే పార్టీనాయకులకు యుద్ధ నేరాలకు పాల్పడినట్లు అంతర్జాతీయ న్యాయ స్థానంలో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఇక



అల్బిన్‌కుర్తీ

మరోపార్టీ ఎల్డీకే నేత ఇబ్రహీం రుగోవా 2006 లో మరణించిన తర్వాత ఆపార్టీకి ప్రాభవం తగ్గిపోయింది.పింఛన్లు పెంచుతామని, విద్య,ఆరోగ్య సేవలు సమూలంగా ప్రక్షాళనచేసి మరింతచేరువ చేస్తామని ఉద్యోగుల జీతభత్యాలు కూడా పెంచుతామని వాగ్దానాలు చేస్తున్నాయి. అయితే ఇందుకు నిధులు ఎలా సమకూరుస్తారు. ఎక్కడినుంచి తెస్తారు అన్న వివరాలేమీ లేకపోయినా కొసావోలో మెరుగైన జీవితాన్ని ఇస్తామని మాత్రం అటు పిడికే, ఇటుఎల్డీకే పార్టీలు ముమ్మర ప్రచారంతో దూసుకువస్తున్నాయి. దేశంలోని ప్రతినగరంలోను,ప్రతి కుటుంబంలోను తమ పార్టీకి మెరుగైన మద్దతు కనిపిస్తోందని భావిస్తున్నా చివరినిమిషంలో కుర్తికే ఎక్కువ అవకాశాలుంటాయని సర్వేలు చెపుతున్నాయి. విదేశీ సాయంపై ఎక్కువ ఆధారపడిన ఈ దేశానికి ఇప్పుడు ట్రంప్ రద్దుచేస్తానని చెపుతున్న యుఎస్ ఎయిడ్ సంస్థ నుంచి 200 కోట్ల డాలర్లవరకూ పెట్టుబడులసాయంఅందింది. అయితే కుర్తీ మాత్రం సెర్బియన్ దినార్ కరెన్సీ వినియోగంపై నిషేధం ప్రకటించారు. దీనితో ఐరోపాకూటమి రెండేళ్ల క్రితం కొన్ని ప్రాజెక్టులకు నిధులు కూడా నిలిపివేసింది. తాత్కాలికఆంక్షలు, చర్యలను పక్కనపెట్టి ఎన్నికలపై దృష్టికేంద్రీకరించిన కుర్తీ భవిష్యత్తు ధోరణి ఎలా ఉంటుందన్న దానిపై సెర్బ్ మైనార్టీలు ఎక్కువ ఆసక్తిచూపుతున్నారు. ఉత్తరప్రాంత సెర్బ్‌మైనార్టీల పట్ల అనుసరించే వైఖరిని స్పష్టం చేయాలంటూ అమెరికా, యూరోపియన్‌కూటమి ఒత్తిడితెస్తున్నాయి. ఈయూతో భాగస్వామ్యం పునరుద్ధరించుకోడానికి కొత్తప్రభుత్వం నిర్మాణా త్మక చర్యలు చేపట్టాల్సి ఉంటుందని ఆ దిశగానేవచ్చే ప్రభుత్వానికి మద్దతు కూడాఉంటుందని ఐరోపా కూటమి తెగేసి చెప్పింది. సెర్బియాతో సత్సంబంధాలు నెలకొల్పేందుకు రెండుదేశాల మధ్య సాధారణ స్థితిరావాలని అటు ఐక్యరాజ్యసమితితోపాటు యూరోపియన్ యూనియన్, అమెరికా దేశాలు అభిలషిస్తున్నాయి. షరతుల్లో భాగంగా సెర్బ్‌జనాభా మెజార్టీ ఉన్న మున్సిపాలిటీలకు ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన తెరపైకివస్తోంది. ముందు సెర్బియా తమదేశాన్ని గుర్తించినట్లు అధికారిక ప్రకటన చేసిన తర్వాతనే ఎలాంటి చర్చలైనా అనిప్రధాని కుర్తీ తెగేసి చెపుతున్నారు. ఈతరుణంలో జరు గుతున్న ఎన్నికలు ప్రపంచ దేశాలను ఆకర్షిస్తు న్నాయి. అంతేకాకుండా ఈ ఎన్నికలను పరిశీ లించేందుకు యూరోపియన్ యూనియన్ నుంచి 100 మంది పరిశీలకుల బృందం, యూరోప్ మండలినుంచి 18 మంది, అంతర్జాతీయంగా ప్రపంచస్థాయి సంస్థలనుంచి మరికొందరితో కూడిన ప్రతినిధుల బృందం తొమ్మిదోతేదీ జరిగే ఎన్నికలను పరిశీలించి నివేదికలు ఇస్తుంది. ఆ తర్వాతనే ఎన్నుకునే ప్రభుత్వాన్ని, దేశాన్ని యూరోపియన్ యూని యన్ ఐక్యరాజ్యసమితిలు ప్రత్యేక గుర్తింపు నివ్వడంతోపాటు సభ్యత్వం ఇస్తాయని తెలుస్తోంది. అందువల్లనే ఇప్పుడు కొసావోకు జరిగే ఈపార్లమెంటు ఎన్నికలు అక్కడిప్రజలకు అధికార పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకం అయ్యాయి. ●

# ప్లాస్టిక్ విష వలయంలో ప్రపంచం..



సుంకవల్లి సత్తిరాజు

పెరుగుతున్న ప్లాస్టిక్ వాడకం ప్రపంచం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల్లో ఒకటి. ప్లాస్టిక్ వాడకం అత్యంత ప్రమాదకరమైన సమస్యగా మారిన నేపథ్యంలో పర్యావరణానికి పెను ప్రమాదం ఏర్పడింది. ప్రకృతి, పర్యావరణం, వాతావరణ మార్పులు,కాలుష్యం, భూతాపం వంటి సమస్యలపై దశాబ్దాల తరబడి అనేక అంతర్జాతీయ సంస్థలు పోరాడుతూనే ఉన్నాయి. కాని వీటిన్నింటినీ తలదన్నే విధంగా జనవాహినిలోకి నిశ్శబ్దంగా చొచ్చుకొచ్చిన ప్లాస్టిక్ భూతం తన పంజా విసిరి, సకల జీవరాశుల మనుగడపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నది. పర్యావరణ సమస్యలకు, వాతావరణంలో అవాంఛనీయమైన మార్పులకు ప్లాస్టిక్ వాడకం కారణం కాబోతున్న విషయం ప్లాస్టిక్ ఉత్పత్తులు ప్రారంభమైన తొలిదశలో అంతగా ఎవరూ పట్టించుకోలేదు. కాని రానురాను ప్లాస్టిక్ వాడకం" ఇంతింతై వటుడింతై..."అన్న మాదిరిగా పెరిగి పెద్దదై మానవాళితోపాటు, ఇతర జీవరాశుల మనుగడను మట్టుబెట్టడానికి సంసిద్ధంగా ఉంది. ఇంతటి ప్రధానమైన సమస్యను ఈనాటికీ ప్రపంచం సరిగా గుర్తించకుండా నాన్పుడిధోరణి అనుసరించడం భవిష్యత్తును విస్మరించడమే కాగలదు. ప్లాస్టిక్ వలన జీవవైవిధ్యం దెబ్బతింటున్నది. పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్లాస్టిక్ వలన ఏర్పడే గ్రీన్ హౌస్ ఉద్గారాల వలన వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి.భూతాపంలో కూడా ప్లాస్టిక్ ప్రధాన భూమిక పోషించడం ఆందోళనకరం. సముద్రాల్లో సుమారు 200 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలున్నట్టు కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. ఏటా సముద్ర జలాల్లో కోటి టన్నుల ప్లాస్టిక్ కలుస్తుందని ఒక అంచనా. ఇలా ఉండగా కొన్నిసర్వేల ప్రకారం సముద్రాల్లో 5 ట్రిలియన్లకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలున్నాయని, ఈ సంవత్సరం ఈ పరిమాణం మూడు రెట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. మనం వినియోగించి అవతలపారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు వివిధ మార్గాల్లో తిరిగి తిరిగి మన దగ్గరకే చేరుతున్నాయి. మైక్రోప్లాస్టిక్, నానోప్లాస్టిక్ రూపాల్లో మనం తినే ఆహారంలో కలిసి మన ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తున్నది. సముద్రాల జలాల్లో కలుస్తున్న ప్లాస్టిక్ వలన సముద్ర జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.దట్టమైన మంచులో కూడా అత్యంత సూక్ష్మమైన ప్లాస్టిక్ పదార్థాలను కనుగొన్నట్టు శాస్త్రవేత్తలు కనుగొన్నారు.సముద్ర జీవుల ఉదరాల్లో ప్లాస్టిక్ ఉన్నట్టు తెలిసింది. మిలియన్ల సంఖ్యలో సముద్ర జీవులు ప్లాస్టిక్ వ్యర్థాల వలన మరణిస్తున్నట్టు తెలిసింది. జల జీవులను ఆహారంగా తినడం వలన మానవాళి అనేక ఆరోగ్యం పరమైన దుష్పరిణామాలను ఎదుర్కోవడం జరుగుతున్నది. చైనా,థాయిలాండ్, ఇండోనేషియా వంటి దేశాలు అత్యధికంగా ప్లాస్టిక్‌ను సముద్ర జలాల్లోకి విడుదల చేస్తున్నాయి.సముద్ర వ్యర్థాల్లో 85 శాతం భాగాన్ని ప్లాస్టిక్ ఆక్రమించింది. ప్లాస్టిక్ వలన ఏర్పడుతున్న అనర్థాలు తెలిసికూడా అనేక దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తిని, వినియోగాన్ని, ఎగుమతులను విరివిగా పెంచేశాయి. ఆసియా ప్లాస్టిక్ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంది.చైనా, ఇండో నేషియా, జపాన్ మెక్సికో, వియత్నాం వంటిదేశాలు ప్లాస్టిక్ ను అధికంగా వినియోగిస్తున్నాయి. చైనా, ఉత్తర అమెరికా దేశాలు ప్లాస్టిక్‌ఉత్పత్తిలో ముందంజలో ఉన్నాయి. ఇండియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, రష్యా తదితర దేశాలు కూడా ప్లాస్టిక్ ఉత్పత్తిలో ముందుకు దూసుకుపోతున్నాయి. 2025 నాటికి సముద్రాల్లో కలిసే ప్లాస్టిక్ వ్యర్థాలు 250 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకునే అవకాశముంది. ఒక వైపు ప్లాస్టిక్‌ను వాడకూడదని ప్రభుత్వాలు నియంత్రణ పెడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లను వాడితే జరిమానాలు విధిస్తామని ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వాలేప్లాస్టిక్ ఉత్పత్తులకు అనుమతులు మంజూరు చేస్తున్నాయి. ఎగుమతులు చేస్తున్నాయి.ప్లాస్టిక్ వినియోగించని ప్రభుత్వ కార్యాలయాలంటూ ఉన్నాయా? ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో



పౌరసరఫరాల శాఖలు ప్రజాపంపిణీ వ్యవస్థలో వివిధరకాల వస్తువులకు ప్లాస్టిక్ సంచులనే వినియోగించడం హాస్యాస్పదం. ప్రజలను ప్లాస్టిక్ వాడొద్దని చెబుతూనే ప్రభుత్వాలే ప్లాస్టిక్‌ను వినియోగించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. పర్యావరణంపై పలు అంశాలు తీవ్రప్రభావంచూపుతున్నాయి. ఒకవైపు కాలుష్యం, మరో వైపు చెట్లనునరికి పచ్చదనం లేకుండా చేయడం, ఇంకోవైపు పారిశ్రామిక వ్యర్థాలు పంట పొలాల్లో పురుగు మందులను విచక్షణా రహితంగా వినియోగించడం వలన ప్రకృతిలో ఏర్పడుతున్న ప్రమాదకరమైన మార్పులు తీవ్రమైన కలతకు గురిచేస్తున్నాయి. ప్రకృతి రచయితగా, ప్రపంచ పర్యావరణ ఉద్యమంలో అమెరికాకు చెందిన రాచెల్ లూయిస్ కార్సన్ ప్రసిద్ధి గాంచిన విషయం లోకవిదితమే.జీవావరణం, పర్యావరణం, సముద్రాలను కాలుష్యం నుండి రక్షించడానికి ఉద్యమించిన కార్సన్ తరహాలోనే సుమారు అర్థశతాబ్దం క్రితం అప్పటి అమెరికా సెనేటర్ "గేలార్డ్ ఆంటోన్ నెల్సన్" పర్యావరణ పరిరక్షణ గురించి, మనం నివసించే భూమి గురించి, మానవ నిర్లక్ష్యం వలన రాబోయే విపత్తుల గురించి ఈ ప్రపంచాన్ని ముందే హెచ్చరించాడు. అతని ఆలోచనలకు, ఉద్యమాలకు ప్రజల్లో మంచి స్పందన లభించింది. గేలార్డ్ నెల్సన్ కోట్లాదిమంది అమెరికన్లతో భారీ పర్యావరణ ఉద్యమాన్ని నిర్మించాడు. మనం నివసించేభూమిని కాపాడుకోవాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ప్రజల్లో అవగాహన కలిగించాడు. పర్యావరణ కార్యశీలతలో కదం తొక్కిన కెరటంగా" గేలార్డ్ నెల్సన్" పేరొందాడు. ప్రస్తుత ఆధునిక యుగంలో ఇలాంటి ఉద్యమాలు ఎంతో అవసరం. ముఖ్యంగా ప్లాస్టిక్ వస్తువులు హోరెత్తుతున్న నేటి కాలంలో రాబోయే విపత్కర పరిణామాల గురించి అట్టడుగు స్థాయి వరకు అవగాహన అవసరం. 2050 నాటికి సముద్రాల్లో నివసించే జీవజాలం కంటే ప్లాస్టిక్ వ్యర్థాలే అధికంగా ఉంటాయని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రపంచంలో సముద్ర కాలుష్యంలో 80శాతం వ్యవసాయ వ్యర్థాలు, పురుగు మందుల అవశేషాల వలన ఏర్పడుతున్నది.దాదాపు వెయ్యిరకాల సముద్ర జీవజాతులు ప్లాస్టిక్ వలన ప్రభావితం అవుతున్నాయి. ప్రపంచంలో సగానికి పైగా జీవజాలం అనుకూల పరిస్థితుల్లో ఈ శతాబ్దాంతానికి అంతరించిపోయే అవకాశముంది. ప్రపంచంలో 60 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలకు సుమారు 12 దేశాలు కారణమవుతున్నాయని కొన్ని సర్వేల వాదన. చైనా, అమెరికా, భారత్, బ్రెజిల్, మెక్సికో దేశాలు అత్యధిక ప్లాస్టిక్ వ్యర్థాలకు కారణంగా పేర్కొంటున్నారు. కోకోకోలా,పెప్సీ వంటి ఉత్పత్తుల వలన ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. చైనా బంగారంలోనే కాదు ప్లాస్టిక్ తయారీలో కూడా ప్రథమ స్థానంలోఉంది. ప్రపంచంలో అత్యధిక ప్లాస్టిక్ తయారీ చేస్తూ కేవలం 17శాతం మాత్రమే రీసైక్లింగ్ చేస్తున్న దేశంగా చైనా పేర్కొనబడుతున్నది. సమస్యను సృష్టించడం సులభం. సమస్యను పరిష్కరించడం చాలాకష్టం. మనకు తెలియకుండానే మనం సమస్యల వలయంలో కూరుకుపో యాం. వీటి పరిష్కారం చేతగాక దాదాపుగా చేతులెత్తేశాం. అయినా పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ, ప్రజలకు అవగాహన పేరుతో తూతూ మంత్రంగా ఏవేవో కార్యక్రమాల ను నిర్వహిస్తూ, ఏదో జరిగిపోవాలని, సమస్యలు పరిష్కా రమైపోవాలనిఆశిస్తున్నాం. ఆధునికంగా జీవించాలనే పేరుతో లేనిపోని అలవాట్లను మనజీవితానికి అన్వయింప చేసుకున్నాం. ప్రకృతిని విధ్వంసం చేసుకున్నాం.పర్యావరణాన్ని చేజేతులా నాశనం చేసుకున్నాం. కాలుష్యాన్ని కొని తెచ్చు కున్నాం. మానవ స్వార్థం జీవవైవిధ్యాన్ని దెబ్బతీసింది. అందమైన ప్రకృతిని అంధవికారంగా మార్చి,వాతావరణాన్ని విష వాయువులతో ప్లాస్టిక్ వ్యర్థాలతో నింపి, మనం నివ సించే భూగ్రహాన్ని మానవాళి అస్థిత్వానికి అననుకూలంగా మార్చేశాం. భూతల ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతు న్నాయి. గ్లోబల్ వార్మింగ్ ఒక క్లిష్టమైన సమస్యగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో భూఉష్ణోగ్రతలు తగ్గించడానికి కుదిరిన పారిస్ ఒప్పందం నుండిఇటీవల అధికార పగ్గాలు చేపట్టిన ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం తప్పుకోవడం బాధ్యతా రాహిత్యం. మానవ అవసరాల కోసం సృష్టించుకున్న అనేక విధానాలు మానవ విధ్వంసానికి దారితీస్తున్నాయి. ప్లాస్టిక్ వినియోగం నిత్యజీవితంలో పెనవేసుకుపోయింది. వినియోగం ఇలాగే కొనసాగితే భూగోళం ప్లాస్టిక్ నిలయంగా మారి, అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయి.ప్లాస్టిక్ విషవలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్న ప్రపంచాన్నికాపాడాలి. ●

## కోటప్పకొండలో పర్యటించిన ఇన్‌ఛార్జిమంత్రి, ఎమ్మెల్యేలు





**నరసరావుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, ప్రత్తిపాటి పుల్లారావులు శనివారం పర్యటించారు. ఘాట్‌రోడ్డులోనూ, పర్యాటక కేంద్రంలోనూ వారు అక్కడ ఉన్న ఏర్పాట్లను పరిశీలించారు. కాలిందిమడుగులో పూర్తిస్థాయిలో నీరు నింపాలని, బోటు షికారుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదే విధంగా అక్వేరియం, నెమళ్ల పార్కు, కుందేళ్ళ పార్కు, టాయ్‌ట్రైన్, వివిధ రకాల పక్షులకు సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ సిబ్బందికి సూచనలు చేశారు. ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు మార్జిన్‌లలో బరమ్స్ నింపాలన్నారు. అదే విధంగా వాహనాలకు ఇబ్బందిగా ఉండే మార్గంలో చెట్లకు సంబంధించి ట్రీ కటింగ్ చేయాలన్నారు. ఘాట్‌రోడ్డు మార్గమధ్యలో ఉన్నటువంటి బ్రహ్మ, విష్ణు, ముగ్గురు అమ్మలు, పార్కులను జాతరకు సిద్ధం చేయాలన్నారు. కొండపై ఉన్నటువంటి విఘ్నేశ్వరస్వామి, స్వాగత ద్వారాలతో పాటు త్రికోటేశ్వరస్వామి ఆలయానికి పూర్తిస్థాయిలో రంగులను వేయాలని ఇన్‌ఛార్జిమంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు తెలియజేశారు. భక్తులకు స్వామివారి దర్శనానికి సంబంధించి క్యాలైన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. దర్శనానికి సంబంధించిన వివిధ కేటగిరిల క్యాలైన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు సంబంధించిన అంశాలను పోలీస్ అధికారులతో చర్చించారు. తిరునాళ్ళను విజయవంతం చేయాలని అధికారులకు ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవి ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖరరావు, తెలుగుదేశంపార్టీ నాయకులు కపలవాయి విజయ్‌కుమార్, వాసిరెడ్డి రవి తదితరులు ఉన్నారు.

# అమరావతి వార్త

## పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయండి : అదనపు ఎస్పీ సుప్రజ



**గుంటూరు తూర్పు, కార్పోరేషన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** న్యాయస్థానాలలో పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని జిల్లా అదనపు ఎస్పీ కె.సుప్రజ ఆదేశాలిచ్చారు. గుంటూరు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించి అధికారులు సమన్వయం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ అమలుపై శ్రద్ధ వహించాలన్నారు. ముద్దాయిలను కోర్టులో హాజరుపరచాలన్నారు. హత్యా యత్నం, ఫోక్సో, అత్యాచార కేసుల్లో విచారణ వేగవంతం చేయాలన్నారు. న్యాయస్థానాల కేసులలో చార్జిషీట్ దాఖలు, కేసుల విచారణకు అవసరమైన పత్రాలను కోర్టుకు అందించడం, సాంకేతికపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు ఎస్పీ సుప్రజ ఆదేశాలిచ్చారు. సమావేశంలో డిఎస్పీలు అజీజ్, శివాజీరాజు, డిఎస్పీ భానోదయ, సి.ఐ. నరసింహారావు పాల్గొన్నారు.

## దాతల లక్ష్యాలను నీరుకారుస్తున్న ప్రభుత్వాలు

- -నిరుపయోగంగా దేవాలయాల ఆస్థులు
- -పట్టించుకోని అధికారులు
- -దేవాలయాల అభివృద్ధి ప్రశ్నార్థకం
- -వచ్చిన ఆదాయం జీతాలకే పరిమితం

**పొన్నూరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** నాడు దాతలు గుడికి, బడికి ప్రాధాన్యత ఇచ్చి దేవాలయం..విద్యాలయం..రెండూ పవిత్రమైన ఆలయాలనే భావనతో మణులు, మాన్యాలు ఇచ్చి వాటిని కాపాడుకొంటూ, వాటి ద్వారా సాధించాల్సిన లక్ష్యాలను సాధించే విధంగా కార్యక్రమాలను రూపొందించారు. ఆధ్యాత్మిక చింతనకు దేవాలయాలు, మానవ మనుగడకు విద్యాలయాలను నెలకొల్పారు. వీటి నిర్వహణకు వందలాది ఎకరాల భూములను ఇవ్వడం జరిగింది. భగవంతుడికి సక్రమమైన మార్గంలో పూజలు జరిగితే లోకమంతా సుభిక్షంగా ఉంటుందన్నది దాతల ఆలోచన. దేవాలయాల నిర్వహణకు అర్చకులను ఏర్పాటు చేసి వారికి కొన్ని ఎకరాల భూములను అప్పగించడం జరిగింది. ఆ భూముల ద్వారా వచ్చిన ఆదాయంతో అర్చకులు తమ జీవితాలను కొనసాగించాల్సి ఉంది. స్వర్ణపురి పట్టణంలో అనువంశిక ధర్మకర్తలు శ్రీ రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు బహద్దర్ మన్నెసుల్తాన్ హయాంలో శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావనారాయణస్వామి దేవాలయం విరాజిల్లుతూ ఉంది. స్వర్ణపురి పట్టణంలో సంస్కృత, తెలుగు భాషాభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి 1950వ సంవత్సరంలో శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాలను, 1953వ సంవత్సరంలో శ్రీ భావనారాయణస్వామి ఓరియంటల్ పాఠశాలను నెలకొల్పారు. ఈ రెండు విద్యా సంస్థల వల్ల ఎంతో మంది పేద విద్యార్థులు విద్యాభ్యాసం చేశారు. ఈ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులందరూ దేశ విదేశాలలో కూడా స్థిరపడినటువంటి సందర్భాలున్నాయి. 1950వ సంత్సరంలో ఏర్పాటైన సంస్కృత కళాశాలలో రాష్ట్రం నలుమూలల నుంచి ఎంతో మంది పేద విద్యార్థులు వచ్చి విద్యాభ్యాసం కొనసాగించారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా, ప్రొఫెసర్లుగా, వివిధ విశ్వవిద్యాలయాల్లో మంచి మంచి స్థానాలను అలంకరించి కళాశాల కీర్తి ప్రతిష్టలను పెంచారు. అయితే ఆ తర్వాత కాలంలో ప్రభుత్వాలు తీసుకొన్న అనాలోచిత నిర్ణయాలతో తెలుగుభాష పూర్తిగా కనుమరుగైందనే చెప్పాలి. ఈ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు రిటైర్ అయితే ఆ తర్వాత ప్రభుత్వాలు ఆయా పోస్టులను భర్తి చేయకపోవడంతోపాటు తెలుగు భాషకు ఆదరణ తగ్గించే విధంగా ప్రభుత్వాలు ఆలోచించడంతో ఒక్క పొన్నూరులోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా సంస్కృత కళాశాలలు, ఓరియంటల్ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారింది. తొలుత దాతల కనుసన్నల్లో పూజాది కార్యక్రమాలు, సంస్థల నిర్వహణ జరిగినప్పటికీ ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు వ్యవస్థలను నిర్వీర్యం చేసేవిధంగా వ్యవహరించారు. అందులో భాగంగా శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాలలో అధ్యాపకులు రిటైర్ అయితే కొత్త వారిని నియమించకపోవడంతో అప్పటి ప్రభుత్వ హయాంలో (2016)లో సంస్కృత కళాశాల మూత పడింది. ఈ కళాశాలకు సంబంధించిన రికార్డు మొత్తం ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితుల్లో పూర్వ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



కళాశాల ఫ్లోరింగ్ కుంగి పగుళ్ళిచ్చిన దృశ్యం

స్టడీ సర్టిఫికెట్, కాండక్ట్ సర్టిఫికెట్ కోసమే, కాకుండా ఉద్యోగం వస్తే వెరిఫికేషన్ కోసం ఎక్కడి వెళ్ళాలో కూడా తెలియని పరిస్థితుల్లో పూర్వ విద్యార్థులున్నారు. ఇక పోతే ఓరియంటల్ పాఠశాల గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎయిడెడ్ పాఠశాలలను విలీనం చేసే ప్రక్రియలో భాగంగా ఈ పాఠశాలను ఎత్తివేయడం జరిగింది. అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ పాఠశాల, కళాశాలకు సంబంధించిన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటి ఆలనా పాలనా ఎవరూ పట్టించుకోకపోవడంతో కళాశాల భవనం అంతా కుంగిపోయి, పగుళ్ళిచ్చింది. ఈ భవనాలు పెద్ద పెద్ద విష సర్పాలకు నిలయాలుగా మారాయి. ఈ భవనాలలో పాములు కుసాలు విడిచి దర్శనమిస్తున్నాయి. ఇక విద్యాసంస్థల ఆటస్థలం ఖాళీగా ఉండడంతో పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి యువకులు వచ్చి ఇక్కడే వివిధ రకాల ఆటలు ఆడుతున్నారు. ఈ సందర్భంలో కూడా భవనాలకు సంబంధించిన తలుపులు, తదితర వస్తువులు పాడయిపోతున్నాయి. ఇక భవనాలు ఖాళీగా ఉండడంతో రాత్రిపూట, సెలవు దినాల్లో యువత మద్యం, మత్తు పదార్థాలు కూడా స్వీకరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు ఈ విద్యా సంస్థల భవనాలను అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచినప్పటికీ కొన్ని రాజకీయ కారణాలతో ఆగిపోయింది. దీంతో వచ్చే ఆదాయానికి కూడా గండి పడ్డట్లు అయింది. దేవాలయం కార్యనిర్వహణాధికారి కార్యాలయం శిధిలావస్థకు చేరడంతో పాత భవనాన్ని పూర్తిగా తొలగించారు. నూతన భవన నిర్మాణానికి సీజీఎఫ్ నిధులు రూ.30లక్షలు మంజూరు అయ్యాయి. ఇక దేవాలయం మ్యాచింగ్ గ్రాంటు కింద రూ.15లక్షలు చెల్లిస్తే సీజీఎఫ్ నిధులతో భవన నిర్మాణం చేపట్టవచ్చు. అందుకు గత ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య శంఖుస్థాపన కూడా చేశారు. అయితే శంఖుస్థాపనకు మాత్రమే పరిమితమై ఉంది. ఈ శంఖుస్థాపన కూడా



పాఠశాల, కళాశాల భవన సముదాయం

ఎమ్మెల్యే హడావిడిగా చేయడంతోపాటు, లెట్రిన్ గుంతలో శంఖుస్థాపన చేయడం వల్లే పనులు ఆగిపోయాయనే అపవాదు కూడా ప్రజల్లో ఉంది. అసలు ఈ దేవాలయానికి సీజీఎఫ్ నిధులు మంజూరు కావడమే గగనమని, అయితే అప్పటి అసిస్టెంట్ కమిషనర్ ఆర్.రవణమ్మ ఏదోవిధంగా దేవాదాయశాఖాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించినట్లు పలువురు ఉద్యోగులు చెప్తున్నారు. ఇకపోతే దేవాలయం, పరిసరాల చుట్టూ ఉండే ప్రహరీగోడలు కూడా శిధిలావస్థకు చేరడంతో ఎప్పుడు పడిపోతాయోననే ఆందోళన ఇటు భక్తుల్లోనూ, అటు ఉద్యోగుల్లో కూడా ఉంది. దేవాలయం చుట్టూ ప్రహరీగోడ లేకపోతే అక్రమణలకు గురయితే ఇబ్బందులు పడాల్సివస్తుందని పలువురు భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణాన్ని త్వరగా చేపట్టడంతోపాటు, కళాశాల, పాఠశాల భవనాలను అద్దెకి ఇచ్చినట్లయితే తద్వారా వచ్చే ఆదాయంతో దేవాలయాలను అభివృద్ధిచేసుకోవచ్చని పలువురు అంటున్నారు. ప్రభుత్వం త్వరలో ఏదో ఒక నిర్ణయం తీసుకొని మంచి చేయాలని ఆశిద్దాం.

## అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత



**గుంటూరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** ఆదివారం నాడు "కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ గుంటూరు" మరియు"ది రాజోల్ తాలూకా తెలగా అఫిషియల్ అసోసి యేషన్ మరియు రాజోలు "వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలులో భాగంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 242 మంది పేద విద్యార్థులకు పది లక్షల ముప్పయి మూడువేల రూపాయలు ఉపకార వేతనాలు గా పంపిణీ చేయనున్నారు. ఇందులో అయిదు లక్షల ఇరవై అయిదు వేల రూపాయలు తులసి సీడ్స్ వారు "కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ " ద్వారా 104 మంది పేద విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం మంగేన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో ఉదయం8 గంటలకు ప్రారంభమోతుంది. అదే రోజు ఆదివారం నాడు "కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ గుంటూరు" మరియు " శ్రీకృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం పాలకొల్లు " వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలులో భాగంగా చదువు లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 282 మంది పేద విద్యార్థులకు పన్నెండు లక్షల తొంబై వేల రూపాయలు ఉపకార వేతనాలు గా పంపిణీ చేయనున్నారు. ఇందులో ఆరు లక్షల పది వేల రూపాయలు తులసి సీడ్స్ వారు "కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్" ద్వారా 122 మంది పేద విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం పాలకొల్లు లయన్స్ క్లబ్ ఆడిటోరియం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమోతుంది. ఈ కార్యక్రమాలకు గౌరవ అతిథిగా తులసి గ్రూప్ ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యి వితరణ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర తెలియజేశారు

## 19న వాహనాల వేలం

### –ఉప రవాణా కమీషనరు

**గుంటూరు కలెక్టరేట్,ప్రభాతవార్త,ఫిబ్రవరి 8 :** పన్నులు చెల్లించకుండా తిరుగుతూ రవాణా శాఖ అధికారుల దాడుల్లో పట్టుబడి,నిర్భందంలో ఉన్న వాహనాలను ఫిబ్రవరి 19న వేలం నిర్వహించబడుతుందని గుంటూరు ఉప రవాణా కమీషనర్ తెలిపారు. గుంటూరు ఉప రవాణా కమీషనర్ కార్యాలయంలో ఉన్న 31 వాహనాలను (ఎల్‌జివిలు,మోటార్ సైకిల్స్,మోటార్ కార్,మరియు మ్యాక్సి క్యాబ్లు) వేలం ద్వారా విక్రయించబడును.సంబంధిత వాహన యజమానులు పైనాన్షియర్లు తమకు సంబంధించిన వాహనలకు చెల్లించాల్సిన పన్నులు,అపరాధ రుసుము చెల్లించి ఫిబ్రవరి 18వ తేదిలోపు వాహనాలను విడుదల చేసుకోవాల్సిందిగా తెలిపారు.అలా విడుదల చేసుకోని వాహనాలను ఫిబ్రవరి 19వ తేది మధ్యాహ్నం 2.00గంటలకు డిటిఓ కార్యాలయంలో వేలం నిర్వహించబడుతుందని నిరా వ్యాహకులు తెలిపారు.

## నాగార్జునకొండను సందర్శించిన అంతర్జాతీయ బౌద్ధ బిక్షువులు



**విజయపురిసౌత్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధ స్థావరం నాగార్జునకొండను సందర్శించిన అంతర్జాతీయ బౌద్ధ బిక్షువులు అక్కడి కట్టడాలు, శిల్పాలను కొనియాడారని పురావస్తు పరిశోధకుడు, ప్లీజ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో జరిగిన అంతర్జాతీయ త్రిపీటిక పఠనోత్సవంలో మన దేశానికి 27 మంది, శ్రీలంక, మయన్మార్, కంబోడియా, లావోస్, థాయిలాండ్, వియత్నాం వంటి దక్షిణాసియా దేశాల నుంచి 88 మంది బౌద్ధ బిక్షువులు పాల్గొన్నారు. నాగార్జునకొండలోని బౌద్ధ ప్రదర్శనశాల, పునర్నిర్మించిన బౌద్ధ కట్టడాల గురించి ఈమని శివనాగిరెడ్డి వారికి వివరించారు. మ్యూజియంలోని శిల్పాల గురించి మ్యూజియం అధికారి కమలహాసన్ వివరించారు. ఆచార్య నాగార్జునుడు నడయాడిన నేలపై తాము కూడా అడుగుపెట్టడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఆచార్య నాగార్జునుని రచనలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధవనం అధికారులు డీఆర్ శ్యాంసుందరరావు, డాక్టర్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్

- -అందరి సమస్యలనూ సావధానంగా ఆలకించిన ఎమ్మెల్యే నసీర్
- -నేనున్నానంటూ ప్రతి ఒక్కరికీ భరోసా
- -వందకు పైగా అర్జీలు సమర్పించిన ప్రజలు



**గుంటూరు తూర్పు, కార్పోరేషన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మారింది. ఏళ్ళ తరబడి అధికారుల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగినా కొలిక్కిరాని సమస్యలకు ఒక సమాధానం దొరికింది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ ప్రజల గుండెకు భరోసా ఇచ్చింది. అధైర్యపడొద్దు అండగా ఉంటామంటూ ఎమ్మెల్యే నసీర్ ప్రతి ఒక్కరికీ భుజం తట్టి గుండెధైర్యమిచ్చారు. ప్రజా దర్బార్ కు వచ్చిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యే ఇచ్చిన కొండంత హామీతో ఆనందంగా తిరిగి వెళ్ళారు. ప్రజా దర్బార్‌లో సుమారు వంద మందికి పైగా తమ సమస్యలను నివేదించారు. అయ్యా గత ప్రభుత్వంలో అన్యాయంగా పెన్షన్లు, రేషన్‌కార్డు తీసేశారు. మళ్ళీ ఇప్పించండయ్యా అంటూ ఒకరు...మా కాలనీలో రోడ్లు లేవయ్యా...మీరే పట్టించుకోవాలి అంటూ మరొకరు.. నిలువ నీడ లేక అద్దె ఇళ్ళల్లో అల్లాడుతున్నాం. ఆదుకోండయ్య అంటూ మరొకరు ఇలా సుమారు వంద మందికి పైగా అర్జీలు అందజేశారు. వీటన్నింటినీ ఎమ్మెల్యే నసీర్ సావధానంగా ఆలకించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పేదల కోసమే పని చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కొద్ది నెలల్లోనే అభివృద్ధి పరుగులు పెడుతోందని తెలిపారు. ఇటు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూనే మరో వైపు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ వెల్లడించారు.

## అనధికార కట్టడాల నిర్మాణం జరగకుండా ప్లానింగ్ కార్యదర్శులు పటిష్టంగా పర్యవేక్షణ చేయాలి : కమిషనరు



**గుంటూరు, కార్పోరేషన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** నగరంలో వార్డు సచివాలయాల వారీగా అనధికార కట్టడాల నిర్మాణం జరగకుండా ప్లానింగ్ కార్యదర్శులు పటిష్టంగా పర్యవేక్షణ చేయాలని, నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై కఠినచర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం కమిషనర్ తమ రోజువారీ పర్యటనలో భాగంగా వికాస్‌నగర్, ఎస్వీఎన్ కాలనీ, కొరిటెపాడు తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించడంతో పాటు అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనధికార కట్టడాలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, క్షేత్రస్థాయిలో ప్లానింగ్ కార్యదర్శులు, టిపిబిఓలు పక్కాగా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి కార్యదర్శి హ్యాండ్ బుక్ లేదా డైరీ మెంటైన్ చేయాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో ప్రతి నిర్మాణం నిబంధనల మేరకే జరగాలని, నిర్మాణం చేసుకునే వారు ప్లాన్ కి దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే నిర్మాణం జరిగిన ప్రతి నిర్మాణంకు ఆస్థి పన్ను విధించేలా అడ్మిన్ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. బహుళ అంతస్తు భవనాలకు కూడా ఓసి వచ్చే వరకు వేచి ఉండకుండా నివాసం ఉండే ప్లాట్‌లకు పన్ను విధించాలని ఆదేశించారు. తమ క్షేత్రస్థాయి పర్యటనల్లో అండర్ అసెస్మెంట్లు, అన్ అసెస్మెంట్లను గుర్తిస్తే సంబంధిత అడ్మిన్ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యటనలో డిఈఈ రమేష్‌బాబు, ఆర్ఓ మదన్‌గోపాల్, ఏసిపి రెహ్మాన్, టిపిఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో 6గురు నిందితుల అరెస్టు

### -50వేల విలువైన 9 కిలోల గంజాయి స్వాధీనం

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** రాష్ట్ర డిజిపి హరీష్ గుప్తా ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ ఏడిసిపి ఏ.శ్రీనివాస రావు అధ్వర్యంలో కమీషనరేట్ పరిధిలో సిటీ టాస్క్‌ఫోర్స్,లా అండ్ ఆర్డర్ పోలీసులు గంజాయి రవాణా,విక్రయం, కొనుగోలు,సరఫరాలకు మాయర మహేష్,కేదారేశ్వరపేటకు చెందిన కాకర్ల చైతన్యలు వేర్వేరు మార్గాల ద్వారా గంజాయికి అలవాటు పడి గంజాయి సేవించే సమయంలో ఒకరి ద్వారా మరొకరు పరిచయమై గంజాయిని ఆంధ్ర,ఒరిస్సా బోర్డర్ ఏరియాల్లో కొనుగోలు చేసి వీరికి కావాల్సింది వాడుకొని మిగిలిన గంజాయిని విజయవాడ




సంబంధించిన సమాచారాన్ని సేకరించడం, గతంలో పలు గంజాయి కేసుల్లో అరెస్ట్ కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వారిపై పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేసారు. ఈ నేపథ్యంలో సిటీ టాస్క్‌ఫోర్స్,లా అండ్ ఆర్డర్ బృందాలకు రాబడిన పక్కా సమాచారం మేరకు సూర్యారావపేట పోలీస్‌స్టేషన్ పరిధి లోని దుర్గాపురంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న 6గురిని అదుపులోకి తీసుకొని విచారించి వారి వద్ద నుండి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ,దుర్గాపురంకు చెందిన పెదసొనగంటి ప్రణీత్,గొల్లపూడి సాయిపురం కాలనీకి చెందిన గంథం జస్వంత్,ప్రసాదంపాడు యాదవుల బజార్‌కు చెందిన కొడాలి ఎమరాల్డ్,విజయవాడ సత్యన్నారాయణపురం, బావాజీపేటకు చెందిన గంగ శ్రీను, రామవరప్పాడుకు చెందిన లోని పలు ప్రాంతాల్లో యువకులకు విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తుండేవారు. ఈ నేపథ్యంలో సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధి లోని దుర్గాపురం ఏరియాలో కొందరు అక్రమంగా గంజాయిని కల్గి ఉన్నారన్న పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, గవర్నర్‌పేట పోలీసులు ఈ ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 9 కిలోల గంజాయిని, వారు ఉపయోగించే బైక్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేయడం జరిగింది. ఈ కేసులో నిందితులైన మరో ముగ్గురు యువకులు పరారీలో ఉన్నారని తెలిపారు. వీరిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన టాస్క్‌ఫోర్స్ సిఐలు శ్రీధర్‌కుమార్,నాగశ్రీనివాస్,ఎస్ఆర్ పేట సిఐ అహ్మద్ ఆలీని వారి సిబ్బందిని అధికారులు అభినందించారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజా గ్రీవెన్స్

### -ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

వత్సవాయి ఫిబ్రవరి 08 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఏర్పడిన ప్రభుత్వం ఇది అని ఇది ముమ్మాటికి ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. వత్సవాయి గ్రామంలోని మోగపర్తి కోటేశ్వరావు ఇంటి ఆవరణలో వత్సవాయి మండలంలోని



అన్ని గ్రామాల ప్రజల నుంచి వినతులు స్వీకరణ కార్యక్రమం ప్రజా గ్రీవెన్స్ శనివారం నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్‌లో లింగాల గ్రామం వద్దగల మునేరు బ్రిడ్జి నూతనంగా నిర్మించాలని కోరారు. త్రాగునీటి సమస్య, పింఛన్లు రేషన్ కార్డులు, ఇళ్ల కోసం, గ్రామాల్లో రోడ్లు కాలవలు నిర్మానానికి అధికంగా అర్జీలు వస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా స్మశాన వాటికలలో డెవలప్మెంట్ కోరారు. ఇంటి బిల్లులు పెండింగ్లో ఉన్నవి వాటిని ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వానికి నిర్లక్ష్య పాలన కారణంగా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి అన్నారు. గ్రామాల్లో తాగునీరు పారిశుద్ధ్యం విద్యుత్ వంటి కనీసం మౌలిక సదుపాయాలు కూడా నోచుకోకపోవడంతో ప్రజలు దుర్భర పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే ప్రాధాన్యత క్రమంల పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు మరియు వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భాజపా చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు ఇచ్చిన తీర్పు ఇది

### - ఓబీసీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షులు తులిమిల్లి రామకృష్ణ యాదవ్



**మంగళ,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** బిజెపి చేసిన అభివృద్ధిని చూసి ఢిల్లీలో ప్రజలు భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టారని ఓబీసీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షులు తులిమిల్లి రామకృష్ణ యాదవ్ అన్నారు. బిజెపి ఢిల్లీలో విజయం సాధించిన సందర్భంగా మంగళగిరిలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద శనివారం నాయకులు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా తులిమిల్లి రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ, 27 సంవత్సరాల తర్వాత బిజెపికి అధికారాన్ని అప్పగించిన ఢిల్లీ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. బిజెపి దేశాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తోందని , ప్రజా సంక్షేమానికి మంచి విధానాలు చేపట్టిందని పేర్కొన్నారు. దేశంలో మూడు వంతుల పాటు బిజెపి అధికారంలోకి రావడానికి ఆయా విధానాలే నిదర్శనమని తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అద్భుతమైన పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నరేంద్ర మోడీ పూర్తిగా సహకరిస్తున్నారని తెలిపారు. ఢిల్లీలో బిజెపి గెలుపు ప్రజా విజయం అని ఆయన స్పష్టం చేశారు.

## సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం




**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం పద్మావతి కళ్యాణ వేదిక మీద శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు,దేవాలయ పాలకవర్గం సంయుక్తాధ్వర్యంలో భాగంగా సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం జరిగింది.మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,అలంకరణలు జరిగాయి.ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి సత్సంగ సభ్యులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.కార్యక్రమంలో సిహెచ్ మస్తానయ్య,బొర్రా ఉమామహేశ్వరరావు,కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,సతీమణి శ్రీరత్న తదితరులు పాల్గొన్నారు.

## కోటప్పకొండను అభివృద్ధి చేస్తున్నాం : ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో అభివృద్ధి పనులు గొప్పగా చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. మహాశివరాత్రి కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి



గొట్టిపాటి రవి, ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, ప్రత్తిపాటి పుల్లారావులు శనివారం పరిశీలించారు. విలేకర్లతో ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు మాట్లాడుతూ వైకాపా హయాంలో కోటప్పకొండపై ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. వైకాపా నాయకులు చేసే విమర్శలు అర్థరహితమన్నారు. కేవలం మాటలతోనే మాయ చేసి ఐదేళ్ళు అధికారంతో కాలం గడిపారని విమర్శించారు. కోటప్పకొండ జాతరకు సి.సి.కెమేరాలతో ప్రతి నిమిషం నిఘా ఉంచుతామన్నారు. తిరునాళ్ళలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ కోడ్ రావడంతో అభివృద్ధి పనులకు బ్రేక్ పడిందన్నారు. భక్తుల మనోభావాలకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. తిరునాళ్ళ విజయవంతమే అధికారులకు, శాసనసభ్యులుగా తమకు బాధ్యత తీసుకుంటున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.

## బుగ్గమల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే యరపతినేని

**పిడుగురాళ్ళ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మాచవరం మండలం మోర్జంపాడులో వేంచేసియున్న శ్రీబుగ్గమల్లేశ్వరస్వామిని శనివారం గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అనంతరం మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే గ్రామంలో శ్రీలక్ష్మి నరసింహస్వామి 69వ కళ్యాణోత్సవం, తిరునాళ్ల సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్లబండలాగుడు పోటీలను ప్రారంభించారు.



అనంతరం కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బూత్ కమిటీల నియామకం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు సీఆర్ రాజన్, నియోజకవర్గ పరిశీలకుడు కల్లం రాజశేఖరరెడ్డి, యువనేత నిఖిల్, కూటమి నేతలు పాల్గొన్నారు.

## ఆలయాల్లో భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు

**వినుకొండ,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** భీష్మ ఏకాదశి పురస్కరించుకొని స్థానిక శ్రీనివాసనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు



రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అచ్యుత కృష్ణ సుబ్బారావు, కోశాధికారి కాళ్ళ రామకోటేశ్వరరావు, గుడిపాటి కోటేశ్వరరావు, సుబ్బారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ ఛైర్మన్ దస్తగిరి,పలువురు కౌన్సిలర్లు తెదేపాలో చేరిక

**వినుకొండ,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** వినుకొండ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి దంపతులు, 9,18,27,30వార్డు కౌన్సిలర్లు వైకాపాను వీడి తెదేపాలో చేశారు. పార్టీలోకి చేరిన వారికి ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెనలు తెదేపా కండువాలు వేసి ఆహ్వానించారు. ప్రజలకు సేవ చేద్దామని రాజకీయాల్లోకి వచ్చిన తనకు వైకాపా నుంచి ఎటువంటి సహకారం లభించలేదన్నారు. ప్రస్తుతం కూటమి పాలనలో సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు నాయకత్వంపై విశ్వాసంతో తెదేపాలో చేరినట్లు దస్తగిరి తెలిపారు. ఈ చేరికలతో కౌన్సిల్‌లో తెదేపా బలం 11కి చేరింది.



## భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం : ఆలయ ఈవో చంద్రశేఖరరావు

**నరసరావుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** కోటప్పకొండ జాతరకు సంబంధించి భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ ఈవో చంద్రశేఖరరావు అన్నారు. శనివారం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకునేందుకు అవసరమైన క్యూలైన్లను సిద్ధం చేస్తున్నట్లు తెలియజేశారు. అదే విధంగా భక్తులకు అవసరమైన మంచినీటి వసతి, క్యూలైన్లు, ప్రసాదాలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. మరో నాలుగైదు రోజుల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు పూర్తవుతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అన్నిశాఖల అధికారులు ఇప్పటికే పలుమార్లు సమీక్షా సమావేశాలను నిర్వహించారని తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు ఘాట్‌రోడ్డులోనూ, మెట్ల మార్గంలోనూ మౌలిక వసతులను కల్పించామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సూచనలతో భక్తుల ఏర్పాట్లకు సంబంధించి ఎక్కడా లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖరరావు తెలిపారు.



## యాదాద్రి నరసింహస్వామి ఆలయంలో అన్నదానం

**గురజాల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో వేంచేసియున్న పల్నాడు యాదాద్రి నరసింహస్వామి ఆలయంలో శనివారం పల్నాడు యాదాద్రి నరసింహ స్వామి సేవా సమితి ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు ప్రతి రోజు మాలదారులకు సద్ది నిర్వహించనున్నారు. అలాగే ప్రతి శనివారం ఆలయానికి విచ్చేసి భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు గురుస్వామి సూరి తెలిపారు. అన్నదానంకు మండలంలోని పాత అంబాపురంకు చెందిన మాజీ సర్పంచ్ పాశం హనిమిరెడ్డి, సీత, అప్పిరెడ్డి, హేమలత, పార్వతి, శ్రీనివాసరెడ్డి, పావని, విశాల్‌రెడ్డిలు సహాయ సహకారాలు అందించారన్నారు.



## భాజపా పిడుగురాళ్ల పట్టణ అధ్యక్షునిగా శ్రీనివాస్ నాయక్

**పిడుగురాళ్ళ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** బీజేపీ పిడుగురాళ్ల పట్టణ అధ్యక్షునిగా కేతావత్ శ్రీనివాస్ నాయక్ ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, మాజీ అధ్యక్షుడు అలోకం సుధాకరబాబు, పార్లమెంట్ ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాసయాదవ్, ఒంగోలు జిల్లా ఇన్‌చార్జి పొనగళ్ల రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేతనబోయిన హనుమంతురావు, గురజాల నియోజకవర్గ కన్వీనర్ ఆరే వెంకటేశ్వర్లు, కోకన్వీనర్ వడ్లమూడి వెంకయ్య, పిడుగురాళ్ల మాజీ అధ్యక్షుడు కట్టమూరు ఉమామహేశ్వరరావు (ఈశ), ఆతుకూరి కాశీ విశ్వనాథం, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు చల్లంచర్ల విజయకుమార్, పిడుగురాళ్ల పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి అత్తులూరి రాము (ఆడిటర్)లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## నిరుపేదల నేత్రాల్లో వెలుగులు నింపేందుకు కంటి శుక్లముల వైద్య శిబిరం : డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్

**గురజాల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** ఎంతోమంది నిరుపేదలు కంటి శుక్లముల సమస్యలతో బాధపడుతూ కంటి చూపు సరిగా లేక ఇబ్బంది పడుతుంటారని, వారి నేత్రాల్లో వెలుగులు నింపేందుకు ఉచితంగా కంటి శుక్లముల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో ఉచిత కటి శుక్లముల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరం పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యాన జరుగుతుందన్నారు. కంటి శుక్లముల సమస్యతో బాధపడుతున్న వారు ఈ శిబిరానికి వచ్చి సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. అత్యవసర మైన వారికి ఉచితంగా కంటి శుక్లముల వైద్యం నిర్వహిస్తారని చెప్పారు. ఎటువంటి వ్యయ, ప్రయాసలకు తావులేకుండా ఉచితంగా అందిస్తున్న ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.



## భాజపా విజయోత్సవ సంబరాలు

**దుర్గి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీ విజయం సాధించటం పట్ల ఆ పార్టీ శ్రేణులు శనివారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. 27 సంవత్సరాల అనంతరం ఢిల్లీ గడ్డపై తమ పార్టీ ఘన విజయం సాధించి అధికారాన్ని చేపట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ దుర్గి బస్టాండ్ సెంటర్‌లో భాణాసంచా పేల్చారు. కూటమి నాయకులు ఆనందోత్సవాలతో మిఠాయిలను పంచుకున్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు వెలిదండి శ్రీనివాసరావు, గంజర్ల లక్ష్మీ, నాగెండ్ల మరియదాసు,టిడిపి నాయకులు పగడాల చెన్నకేశవరావు, సింగు నాగేశ్వరరావు, సూరె కృష్ణ, జనసేన నాయకులు పులి హరి, రుద్రాల రవి, కప్పెర పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా భావన విద్యాసంస్థల వార్షికోత్సవం


**నరసరావుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** భావన విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి



ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు హాజరయ్యారు. కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్లు మైనీడి శ్రీనివాసరావు, ఒద్దుల సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భావన విద్యాసంస్థల విద్యార్థుల విజయాలను కొనియాడారు. ఎన్నో సంవత్సరాలుగా సమాజానికి ఉత్తమ విద్యార్థులను భావన విద్యాసంస్థ అందిస్తుందన్నారు. డైరెక్టర్లు మైనీడి శ్రీనివాసరావు, ఒద్దుల సుబ్బారెడ్డి, రామచంద్రా రెడ్డిలను అభినందించారు. విద్యార్థులు తల్లి దండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని పిలుపు నిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టి ప్రతిభ కలిగినవారికి ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ఆటలోనైనా, చదువులోనైనా గెలిచినా, ఓడినా, తక్కువ మార్కులు వచ్చినా ఒకే రకంగా స్వీకరించాల న్నారు. జీవితంలోనూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆటలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన సుభాని

**చిలకలూరిపేటటౌన్, ఫిబ్రవరి8, ప్రభాతవార్త:** శ్రీకాకుళం పట్టణంలో 3రోజులపాటు జరిగిన అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర మహసభలలో పట్టణానికి చెందిన షేక్ సుభాని అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర సహయ కార్యదర్శిగా ఎన్నికైనట్లు శనివారం సుభాని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు సుభానిని అభినందించారు. ఎన్నో విద్యార్థి ఉద్యమాలలో పాల్గొన్న సుభాని ఈ పదవికి ఎంపిక కావడం పట్ల కమ్యూనిస్ట్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



## ఢిల్లీలో భాజపా ఘనవిజయం పట్ల హర్షం

### -పరాంకుశం శ్రీనివాసరావు

**చిలకలూరిపేట,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** దేశరాజధాని ఢిల్లీ రాష్ట్రానికి జరిగిన ఎన్నికలలో భారతీయ జనతాపార్టీ ఘనవిజయం సాధించడం పట్ల బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరాంకుశం శ్రీనివాసరావు తన హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ అనూహ్యమైన విజయాన్ని అందించిన ఢిల్లీ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలకు, ప్రధాని నరేంద్రమోడీ బలమైన నాయకత్వం, సుపరిపాలనపై ప్రజలకు ఉన్న అచంచలమైన విశ్వాసానికి ఈ ఫలితాలే నిదర్శనమని అన్నారు. 48శాతం ఓట్లతో 48 స్థానాలకు అందించారని అన్నారు. ఈ విజయంతో దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాల సంఖ్య 20కి పెరిగిందని అన్నారు. ఆప్ చాపకింద నీరులా సాగించిన అవినీతి సామ్రాజ్యాన్ని ఢిల్లీ ప్రజలు గుర్తించి ఆ పార్టీకి బుద్ధి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ మాజీ అధ్యక్షులు పోట్రు పూర్ణచంద్రరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రాంగణ ఎంపికల్లో 54మంది ఆర్‌వీఆర్ జేసి కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

**గుంటూరు విద్య,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** ప్రముఖ కంపెనీల ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చాటుతూ ఇప్పటికే 612మంది తమ కళాశాల విద్యార్థులు 2024-25వ వార్షిక విద్య సంవత్సరానికి అధికప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు పొందారని,మరికొన్ని కంపెనీల నుండి నియామక పత్రాలు రానున్నాయని,ఇది తమ కళాశాల అందిస్తున్న నాణ్యమైన విద్యాబోధనకు నిదర్శనమని ఆర్‌వీఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్,డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు.కళాశాల్లో నిర్వహించన క్యాప్జెమినీ ప్రాంగణ ఎంపికల్లో వివిధ విభాగాల నుంచి ఉద్యోగాలు సాధించిన 54మంది విద్యార్థులను శనివారం కళాశాల సిబ్బంది అభినందించారు.విద్యార్థులకు కంపెనీ ఉచిత శిక్షణను అందిస్తూ,ప్రతిభ ఆధారంగా రూ.9.5లక్షల ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు కల్పిస్తుండడం ఆనందదాయకమని కళాశాల సెక్రటరీ,కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ,ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్,కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర,కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు,వివిధ శాఖల విభాగాధిపతులు,కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేసమెంట్ ఆఫీసర్స్ సిహెచ్ శ్రీనివాసరావు,డాక్టర్ కె.సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

## నేత్రపర్వంగా శ్రీపద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణం

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** స్థానిక బ్రాడీపేటలోని ఓంకార క్షేత్రం నందు కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకారక్షేత్రంలో



కార్యదర్శి నంబూరు వేంకట శ్రీమన్నారాయణ మూర్తి మరియు సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 91వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం 95వ సంఘ వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీగాయత్రీమాత,శ్రీ భువనేశ్వరీ అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామివార్ల కళ్యాణాల్లో భాగంగా శ్రీపద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణం ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ కనులపండువగా నిర్వహించారు. కళ్యాణం, ప్రత్యేకంగా ముత్యాల తలంబ్రాలు,విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.భక్తి సంగీతలో భాగాంగా కర్లపాలెం సూర్యనారాయణ బృందం అనేక భక్తి కీర్తనలను ఆలాపించారు.మంచి కంటి వెంకట సత్యవతి ప్రతిరోజు నిర్వహిస్తున్న శ్రీమద్రామయణ ప్రవచనంలో అరణ్యకాండ రెండో భాగంలోని విశేషాలను వివరించారు.ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ శనివారం రామ సహిత సత్యనారాయణ స్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలుపుతూ భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## గ్లోబల్ ఐకాన్ అవార్డు గ్రహీత ఠాగూర్ ప్రదీప్‌ను అభినందంచిన వర్శిటి ఇన్‌చార్జీ విసి కె గంగాధర రావు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** సెంట్రల్ విజిలెన్స్ కమీషన్‌లో అదనపు డైరెక్టర్ ప్రస్తుత డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్,కార్పొరేట్ అండ్ సెక్యూరిటీస్ లా బ్రాంచి



ఫైనల్ ఇయర్ విద్యార్థి ఎస్.ఠాగూర్ ప్రదీప్ శ్రీలంక అధ్యక్షుడి నుండి గ్లోబల్ ఐకాన్ అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా వర్శిటి ఇన్‌చార్జి విసి కె.గంగాధర రావు అభినందించారు. ప్రదీప్ ఐక్యరాజ్య సమితిలో పనిచేస్తూ స్వేచ్ఛా ఒప్పందాలపై విధాన రూపకల్పన చేస్తూ మిత్ర దేశాల వాణిజ్య పెరుగుదలకు విశేష కృషి సల్పారు.ఈ ప్రక్రియలో ఎఫ్.టి.ఎ.ద్వారా ప్రభుత్వ సేకరణతోపాటు పెట్టుబడి దారుల ప్రయోజనాలను కాపాడటంలో ఠాగూర్ ప్రదీప్ విశేషకృషి ఉంది.ఆ క్రమంలోనే శ్రీలంక దేశ ఆర్థికాభివృద్ధికి ఐక్యరాజ్య సమితి తరుపున ఆయన సలహాలతో ఎదుగుతున్న శ్రీలంక ఈ సందర్భంగా గ్లోబల్ ఐకాన్ అవార్డులను ప్రకటించి ఆదేశ అధ్యక్షుని ద్వారా అందజేసింది.ఠాగూర్ ప్రదీప్ గతంలో ఆదాయపు పన్నుశాఖ, ఇంటలిజెన్స్ బ్యూరో వంటి ప్రభుత్వ ఏజెన్సీలో పనిచేసి ప్రస్తుతం సెంట్రల్ విజిలెన్స్ కమీషన్‌లో అదనపు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు .ఠాగూర్‌కు అవార్డుతో పాటు గతంలో దర్యాప్తు సంస్థలకోసం పనిచేసినప్పుడు అసాధారణ ఆపరేషన్స్ అవార్డు,దర్యాప్తు సంస్థల కోసం పనిచేసినప్పుడు ప్రెసిడెంట్స్ స్పెషల్ ప్రశంసా పతకం లాంటి అత్యున్నత అవార్డులతోపాటు మరెన్నో రివార్డులు కూడా దక్కాయి.హెచ్‌ఓడి ప్రొఫెసర్ ఎల్.జయశ్రీ, ఫ్యాకల్టీ మెంబర్స్ డాక్టర్ నూతక్కి సతీష్, డాక్టర్ పి.వెంకటరమణ,డాక్టర్ వై.ఎస్.వి.కిషోర్,డాక్టర్ చంద్రశేఖర్,డాక్టర్ చెన్నం సురేష్,పరుచూరు కుమారి,డాక్టర్ కె.శివరామ్, చెన్నారావు తదితరులు అభినందనలు తెలిపారు.

## వేద పాఠశాలలో శ్రీగిరి జోహోయాకిన్ ప్రథమ వర్ధంతి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** పట్టణంలోని వేద పాఠశాల మాజీ డైరెక్టర్ శ్రీగిరి జోహోయాకిన్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పెర్సి స్వరూప మాట్లాడుతూ ఆయన పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి, అకుంఠిత దీక్ష, ఆత్మవిశ్వాసం మా మనసులలో ఎల్లప్పుడు నిలిచిపోతుందని అన్నారు. ఆయన నిరాడంబర జీవితం, నిరుపేద పిల్లల కోసం ఆయన పడిన తపన వర్ణించడం అనితర సాధ్యము మరియు ఆదర్శనీయమని అన్నారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సత్యదీప్తి మాట్లాడుతూ నిరాడంబర జీవితం, పేద ప్రజల అభివృద్ధినే లక్ష్యంగా చేసుకొని ఆయన నిరంతరం కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సునీత, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మీ, కో ఆర్డినేటర్ రోహిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## నేడు నందికుంట విఘ్నేశ్వర స్వామి తిరునాళ్ల వార్షికోత్సవం

**నాదెండ్ల,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** మండలంలోని గణపవరం, నాదెండ్ల రహదారి మార్గంలో వేంచేసియున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి వారి తిరునాళ్ల వార్షికోత్సవం ఆదివారం జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక హోమాలు, పూజలు, అభిషేకాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమం, కోలాట ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించవలసినదిగా నిర్వాహకులు కోరారు.

## ఆలయాల్లో భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు

**నూజెండ్ల,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** భీష్మ ఏకాదశి పురస్కరించుకొని మండలకేంద్రమైన నూజెండ్ల గ్రామంలో ఉన్నటువంటి శ్రీ లక్ష్మీచెన్నకేశవ, శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. విష్ణుసహస్ర పారాయణం, హనుమాన్‌చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు కోసూరి రామమోహనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



## స్థూపం సెంటర్‌లో భాజపా గెలుపు సంబరాలు

**వినుకొండ,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా పట్టణంలోని స్థూపం సెంటర్ వద్ద ఆ పార్టీ నాయకులు సంబరాలు చేశారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ నాయకులు రమేష్ మాట్లాడుతూ ఢిల్లీలో బీజేపీ అధికారం చేపట్టడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ విజయం బీజేపీని విమర్శించిన వారికి చెంపపెట్టువంటిదని చెప్పారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేసి హోరెత్తించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కార దిశగా అధికారులు పని చేయండి : ఎంపిపి

**పెదకూరపాడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి బెల్లంకొండ మీరయ్య పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా అధికారులు పని చేయాలని ఎంపిపి సూచించారు. పలు అభివృద్ధి అంశాలపై మచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పునీత తామాస్ తిరునాళ్ళ మహోత్సవం

**అమరావతి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** మండలంలోని అత్తలూరు గ్రామంలో పునీత తామాస్ తిరునాళ్ళ మహోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతగురువులు పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ సతీమణి భాష్యం లావణ్యకు ఆశీర్వచనాలు అందించారు. నియోజకవర్గం నుంచి తిరునాళ్ళ తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఢిల్లీ గెలుపు పై అమరావతిలో భారతీయ జనతాపార్టీ శ్రేణులు హర్షం

**అమరావతి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** ఢిల్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ గెలుపు సాధించడం పట్ల అమరావతిలో భాజపా శ్రేణులు



శనివారం హర్షం వ్యక్తం చేశారు. సబ్కా సాత్ సబ్కా వికాస్ అనే నినాదంతో భారతదేశంలో అప్రతిహాసంగా దూసుకుపోతున్న భారతీయ జనతాపార్టీకి ఎదురులేదని ఢిల్లీ ఎన్నికలు ఋజువు చేశాయి. నరేంద్రమోడీ నాయకత్వాన్ని దేశ ప్రజలు ఎంతగా కోరుకుంటున్నారో రోజురోజుకు పెరుగుతున్న భారతీయ జనతాపార్టీ విజయాలే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మద్ది దాత్రి నారాయణ, నేరెళ్ళ హనుమంతరావు, గోగినేని వెంకటరమణ, బసవయ్య, శ్రీనివాసరెడ్డి, నారదాసు నరసింహారావు, వందేటి నాగమల్లేశ్వర రావు, మాజీ మండల అధ్యక్షులు మేకల వెంకటేశ్వరరావు, జి.వెంకటరామిరెడ్డి, మద్ది నగేష్, గాజుల నరేంద్ర, పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాతృభూమిని మరువరాదు

### -విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కాట్రగడ్డ

**పొన్నూరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** ఎవరు ఏ స్థాయికి వెళ్ళినా మాతృభూమిని మరువకూడదని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కాట్రగడ్డ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను అమెరికాలో స్థిరపడ్డప్పటికీ మాతృభూమిపై ఉన్న మమకారంతోనే ఇలాంటి ఆత్మీయ సమావేశాలకు హాజరవుతున్నట్లు చెప్పారు. తద్వారా తనకు మానసిక ఆనందం కలుగుతుందన్నారు. తన ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సూరా రామారావు మాట్లాడుతూ ఏ దేశమేగినా...ఎందు కాలిడినా...పొగడరా నీ తల్లి భూమి భారతిని అనే నినాదాన్ని పుణికిపుచ్చుకుని వెంకటేశ్వరరావు ఆత్మీయ సమావేశాలకు హాజరుకావడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సభ్యులు పలువురు వెంకటేశ్వరరావు గురించి ప్రసంగించారు. అనంతరం దుశ్శాలువాతో, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సక్కుర్తి ప్రసాదరావు, కార్యదర్శి ఎం.సాంబిరెడ్డి, కోశాధికారి పి.సాంబిరెడ్డి, డిప్యూటీ ప్రెసిడెంట్ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సాయిసాధన చిట్‌ఫండ్‌పై సిబిఐ విచారణ చేయాలి : ఎంఐఎం

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** పట్టణంలోని సాయిసాధన చిట్‌ఫండ్ చీటింగ్‌పై సిబిఐ విచారణ చేయాలని ఎంఐఎం నాయకులు మౌలాలి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ రూ.200 కోట్లకు పైగా ఖాతాదారులను మోసం చేయడం జరిగిందన్నారు. వందలాది మంది మధ్యతరగతి కుటుంబాలు కోట్ల రూపాయలను నష్టపోయి వీధినపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కా ప్రణాళిక ప్రకారమే ఖాతాదారులకు అన్యాయం జరిగిందన్నారు. చిట్‌ఫండ్ కార్యాలయంలో రికార్డులను సైతం తారుమారు చేయడం శోచనీయమన్నారు. అధిక వడ్డీ ఆశ చూపి ప్రజా ధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాలని ఎంఐఎం అధ్యక్షులు మౌలాలి విజ్ఞప్తి చేశారు.



# అభివృద్ధికి పట్టం కట్టిన ఢిల్లీ ప్రజలు

### -బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు రంగవల్లి

**పొన్నూరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** భారతీయ జనతాపార్టీ దేశంలో చేస్తున్న అభివృద్ధిని చూసే ఢిల్లీ ప్రజలు బిజెపికి అత్యధిక మెజార్టీతో పట్టం కట్టారని భారతీయ జనతాపార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు పరాశరం రంగవల్లి అన్నారు. ఢిల్లీలో 27సంవత్సరాల తర్వాత బిజెపికి అవకాశం ఇచ్చారన్నారు. ఢిల్లీ ప్రజలకు బిజెపి తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె చెప్పారు. గత పదేళ్ళుగా బిజెపి అనుసరిస్తున్న విధానాలు, అభివృద్ధిని చూసి ఢిల్లీ ప్రజలు పట్టం కట్టారన్నారు. ఏదైనా ఢిల్లీ ప్రజలు డబుల్ ఇంజన్ సర్కారు కావాలని కోరుకున్నారన్నారు. ఢిల్లీ ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా బిజెపి పాలన సాగిస్తుందన్నారు. ఏది ఏమైనా దేశ ప్రజలంతా బిజెపి, దాని మిత్రపక్షాల పరిపాలననే కోరుకొంటున్నారన్నారు. ఏపిలో కూడా గత ప్రభుత్వ విధ్వంసాన్ని చూసిన ప్రజానీకం కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. దేశంలో, రాష్ట్రాలలో సుపరిపాలన అందించే సత్తా ఒక్క బిజెపికి మాత్రమే ఉందని ప్రజానీకం నమ్ముతున్నారన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలను ఓటు బ్యాంకుగా వాడుకొని వదిలేశాయన్నారు. బిజెపి మాత్రం అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ ముందుకు సాగుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి నాయకత్వంలో చేపట్టిన సంస్కరణలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయన్నారు. సమర్ధవంతమైన పాలన, ప్రజలకు మెరుగైన రక్షణ ఒక్క బిజెపితోనే సాధ్యమని ప్రజానీకం నమ్మారన్నారు. రానున్న రోజుల్లో మిగిలి రాష్ట్రాల్లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బిజెపికే పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్దంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పాలన అంతా స్కాముల మయమన్నారు. బిజెపి పరిపాలన ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ఉందన్న విషయాన్ని ప్రజానీకం నమ్మారన్నారు. బిజెపిని గెలిపించిన ఢిల్లీ ప్రజలకు అభినందనలు తెలిపారు.



# రీసెర్చ్ సెంటర్ కన్వీనర్‌గా పిల్లి సుజాత నియామకం

**పొన్నూరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** పట్టణంలోని లుంబినీవనంలో ఉన్న జిల్లా అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ కన్వీనర్‌గా మహిళా మేధావి పిల్లి సుజాతను నియంచినట్లు మహాకవి డాక్టర్ కత్తి పద్మారావు తెలిపారు. స్థానిక రీసెర్చ్ సెంటర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో జాగా లేని జాగా అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు నుంచి వచ్చిన నేలపూరి రత్నాజీ, పిల్లి సుజాత పుస్తకాన్ని ఆవిష్కరించి పుస్తకంలోని సారాంశాన్ని వివరించారు. డాక్టర్ కత్తి పద్మారావు మాట్లాడుతూ గాజాలోని విధ్వంసాన్ని శిశువుల ఆక్రందనలను నేలపూరి రత్నాజీ తన అక్షరాల జ్వాలనాలతో వెలిగించారన్నారు.ఈ పుస్తకంలోని చిత్రాలు కవిత్వం యొక్క హృదయాన్ని ఆవిష్కరించిందన్నారు. మనదేశం-మన రాజ్యాంగం భారతదేశ చరిత్ర నాల్గవ భాగాన్ని ఆవిష్కరించారు. సుజాత మాట్లాడుతూ లుంబినీవనంలో ఉన్న లైబ్రరీలో ఎన్నో మంచి పుస్తకాలు ఉన్నాయన్నారు. ఇంతటి గ్రంథాలయాన్ని తాను ఎక్కడా చూడలేదన్నారు. ఇది ఎంతో మందికి ఉపయుక్తంగా ఉండడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన మహాకవి డాక్టర్ కత్తి పద్మారావుకు కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను పటిష్టం చేయాలి

### -ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల

**పొన్నూరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాల విద్యావస్థను పటిష్టం చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెను న్నపాటి మంజుల అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి మొవ్వా గార్డెన్స్‌లో శనివారం విద్యాసదస్సు జరిగింది. కామ్రేడ్ నూతలపాటి పరమేశ్వరరావు తృతీయ వర్ధంతి సందర్భంగా జరిగిన విద్యాసదస్సులో చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాల వల్ల పాఠశాల విద్యావ్యవస్థ నష్టపోయిందన్నారు. సుమారు పదిలక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రైవేట్ పాఠశాలలకు తరలిపోయారన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి వెళ్ళిన విద్యార్థులను తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు వచ్చేవిధంగా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. విద్యాభివృద్ధికి, ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారానికి ఎపిటిఎఫ్ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎపిటిఎఫ్ ఎప్పుడూ స్పందిస్తూనే ఉంటుందన్నారు. ఇటీవల తెనాలిలో జరిగిన సంఘటనపై తాము స్పందించామనే అందుకే ప్రభుత్వం వెనక్కు తగ్గిందన్నారు. సెలవులు అనేది ఉపాధ్యాయుల హక్కని చెప్పారు. కొంత మంది అధికారులు ఉపాధ్యాయులకు ఉన్న హక్కులను, బాధ్యతలను తెలియకుండా ప్రభుత్వ పెద్దలను తప్పుదారి పట్టించడం భావ్యం కాదన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎపిటిఎఫ్ ఎప్పుడూ వెనుకడుగు వేయదన్నారు. అదేసమయంలో ఉపాధ్యాయుల సమస్యలను కూడా పరిష్కరిస్తూ వారికి మద్దగా నిలుసు ్తందన్నారు. పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యావిధానంపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం మానుకోవాలన్నారు. ప్రజలకు, సమాజ శ్రేయస్సుకు అవసరమైన విద్యా విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్రికా సంపాదకులు జిలాని మాట్లాడుతూ క్రామేడ్ నూతలపాటి పరమేశ్వరరావు నిబద్దను కొనియాడారు. ప్రతి కార్యకర్త పరమేశ్వరరావును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి చంద్‌బాషా మాట్లాడుతూ విద్యావిధానం మార్చడం ప్రభుత్వం మారినప్పుడల్లా మార్చడం సరియైన విధానం కాదన్నారు.ఈ సందర్భంగా జరిగిన సదస్సుకు అధ్యక్షత వహించిన ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా సాధించుకున్న ఉపాధ్యాయుల సౌలభ్యాలను ఇటు అధికారులు, ప్రభుత్వం హరించడం సరైనది కాదన్నారు. ఇటీవల పదవీవిరమణ చేసిన వారిని ఘనంగా సత్కరించారు. సదస్సులో రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, దావులూరి రాజేంద్రప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఉస్మాన్, రవికుమార్, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సోషలిజం, సీనియర్ నాయకులు హనుమంతరావు, మల్లేశ్వరి, బద్రుద్దీన్, జిల్లా సబ్‌కమిటి సభ్యులు రమేష్, దాసు, మూర్తి, లక్ష్మీనారాయణ పార్వతి, శివరామకృష్ణ, పొన్నూరు జోన్ నాయకులు శివరామకృష్ణ, మురళి, రత్నం, రమేష్, ఖుద్దూస్, రాజా, రాఘవ పాల్గొన్నారు.

# చేబ్రోలు సబ్ రిజిస్ట్రార్‌కు మాతృ వియోగం



**పొన్నూరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** చేబ్రోలు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పట్టణానికి చెందిన గోవర్ధనం రఘునాథ చక్రవర్తి మాతృమూర్తి గోవర్ధనం విజయశ్రీ(73) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పట్టణంలోని నేతాజీనగర్‌కు వచ్చి విజయశ్రీ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, చలమశెట్టి సీతారామయ్య, మాదల వెంకటేశ్వరరావు, పఠాన్ అహమ్మద్‌ఖాన్ తదితరులున్నారు.

# భారతీయ విద్యార్థుల తరలింపుపై మోడి స్పందించాలి

### -కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందే దిలీప్



**పొన్నూరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** ట్రంఫ్ గద్దె నెక్కాక అమెరికాలో జరుగుతున్న పరిస్థితులు, భారతీయ విద్యార్థుల తలింపు శైలిపై ప్రధాని నరే ంద్రమోడి స్పందించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అందే దిలీప్ శని వారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమెరికా వ్యవహార శైలిపై స్పందించక పోతే ప్రభుత్వం యొక్క పిరితనమే అవుతుందన్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండవసారి గెలిచాక తీసుకొంటున్న నిర్ణయాలు సగటు భారతీయ తల్లిదండ్రుల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయ న్నారు. భారతీయ వసల దారులను నిర్ధాక్షిణ్యంగా వెనక్కు పంపుతున్న తీరు దుర్మార్గం గా ఉన్నప్పటికీ ప్రధాని మోడి ఎందకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మోడి బాధ్యతా రాహిత్యం వల్లే భారతీయ విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తం అవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకొని తల్లిదండ్రులలో నెలకొన ఆందోళనలకు స్వస్తి పలకాలన్నారు. గతంలో అమెరికా మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ భారతీయుల పట్ల వ్యవహరిస్తున్న తీరును నాటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ ధైర్యంగా ఎదుర్కొన్న సంఘటనను మోది ఆదర్శంగా తీసుకోవాలని దిలీప్ కోరారు.

# చెర్రి పవర్ టెక్నాలజీ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** పట్టణంలోని మోడరన్ కాంప్లెక్స్ నందు నూతనంగా ఏర్పాటుచేసిన చెర్రి పవర్ టెక్నాలజీను శనివారం మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. అనంతరం చెర్రి టెక్నాలజీ వారు ముద్రించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడితో అందిస్తున్న సోలార్ విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఇ .ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్, డాక్టర్ ముప్పాళ్ల హనుమంతురావు, మెడరన్ సంస్థల చైర్మన్ చేబ్రోలు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విటమిన్ బి లోపం పై జాగ్రత్తగా వుండాలి

**విజయవాడ, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** భారత్‌లో దాదాపు సగం మంది వయోజనులు విటమిన్ బి లోపంతో బాధపడుతున్నారని మిలింద్ ధాటి తెలిపారు. నాడి సంబంధిత సమస్య అయిన పెరిఫెరల్ న్యూరోపతి వల్ల ఈ లోపం కలుగుతుందని, దీనివల్ల నడక, ఇతర శారీరక కార్యకలాపాలపట్ల తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. నాడీ ఆరోగ్యరక్షణకోసం విటమిన్ బి అవసరాన్ని తాము ప్రచారం చేస్తున్నామన్నారు.

# పోలీసు శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుక పల్లెనిద్ర

**బాపట్ల,ఫిబ్రవరి08,ప్రభాతవార్త:** పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ అధికారులు బాపట్ల మండలం నందిరాజు తోట గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ జిల్లా ఎస్పీ తుషార్ డూడి



ఆదేశాలతో జిల్లా పోలీస్ అధికారులు ప్రతి శుక్రవారం రాత్రి జిల్లా పరిధిలో నిర్వహించే పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఫిబ్రవరి 7న శుక్రవారం రాత్రి కూడా నిర్వహించారు.బాపట్ల మండలం నందిరాజు తోట వద్ద గల హైదర్ పేట గ్రామంలో జరిగిన పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, వాటి నుండి బయటపడడానికి అప్రమత్తంగా వ్యవహరించవలసిన తీరు, రోడ్డు భద్రత నియమాలు ఇతర విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ప్రజలలోకి తీసుకు వెళ్లేందుకు, రక్షణ పరంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అసాంఘిక కార్యకలాపాల గురించి ఖచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. ఏదైనా అనుకోని రోడ్డు ప్రమాదంకు సంబంధించిన తలకు, మెడ భాగాలకు గాయాలు కాకుండా హెల్మెట్ రక్షిస్తుందన్నారు. తద్వారా ప్రాణాపాయం నుండి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాల గురించి మోటార్ వాహన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కొంతమంది వ్యక్తులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వాట్సాప్ లో టెలిగ్రాములో వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయడం, ఫోన్ నెంబర్లకు వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పడం వంటివి చేయరాదని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి నగదు పోగొట్టుకున్నట్లయితే వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరానికి గురి అయిన 24 గంటల్లోపు ఫిర్యాదు చేస్తే మీ నుండి సైబర్ నేరగాళ్లు దొంగలించబడిన నగదును మొత్తం ఫ్రీజ్ చేయడానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. సమయం గడిచేకొద్దీ నగదు తిరిగి పొందడం చాలా కష్టంగా మారుతుందని తెలిపారు. కావున సైబర్ నేరగాళ్ళ బుట్టలో పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీతో పాటుగా బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాసులు, స్టేషన్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అవయవదానంతో అమరత్వం



**బాపట్ల,ఫిబ్రవరి08,ప్రభాతవార్త:** అవయవదానంతో అమరత్వం పొందవచ్చునని మనుషులు చిరంజీవులుగ మారవచ్చునని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్ధార్థ అన్నారు.శనివారం అవయవదానంపై ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ప్రచురించిన కరపత్రాలను బాపట్ల ఏరియావైద్యశాల నందు ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవ దానం చేయడం వలన ఎందరో జీవితాలలో వెలుగులు నింపవచ్చునని కనుక అవయవదానంపై అపోహలు వీడి, ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. అవయవ దాతల కోసం దేశవ్యాప్తంగా లక్షలాదిమంది ఎదురుచూస్తుందన్నారు. అవయవ దానం ద్వారా వారందరికీ పునర్జన్మ ప్రసాదించవచ్చన్నారు. మరణం తర్వాత, శరీరదానం వైద్య రంగ పరిశోధనలకు, కొత్త ఆవిష్కరణలకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**బాపట్ల,ఫిబ్రవరి08,ప్రభాతవార్త:** ఏవివి ఉన్నత పాఠశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారము పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు.34 సంవత్సరాల తర్వాత వారంతా ఒకచోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనందంగా గత స్మృతులను గుర్తుచేసుకొని పాఠశాలలో చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. నాటి ఉపాధ్యాయుల వలెనే నేడు మేమంతా ఉన్నత స్థానాల్లో ఉన్నామని పూర్వ విద్యార్థులు తెలిపారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయిని ఉమా సుందరి మాట్లాడుతూ అప్పటి విద్యార్థులు ఉపాధ్యాయులు అంటే భయపడే వారిని, మంచి క్రమశిక్షణతో ఉండే వారిని నేటి విద్యార్థులలో ఆ క్రమశిక్షణ లోపించిందన్నారు.అందరూ సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ప్రతి ఏడాదికోసారి కలుసుకోవాలని నిర్ణయించారు.

# ఎన్ఎస్‌పి కాలువ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శనివారం ఎన్ఎస్‌పి కాలువకు సంబంధించి



జరుగుతున్న పనులను పరిశీలించారు. ఇస్సపాలెం నుండి గుంటూరు బైపాస్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో కాలువలో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. కూలీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాలువలలో తూటికాడ, నాచు వంటివి పెద్ద ఎత్తున చేరడంతో నీరు పారని పరిస్థితి నెలకొందన్నారు. కాలువ చివరి భూములకు నీరు చేరకపోవడంతో పంటలు సైతం ఎండిపోతున్నాయని తెలియజేశారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు ఉపాధిహామీ పథకంలో జెంగిల్ క్లియరెన్స్ నిర్వహించడంతో పాటు నాచు, పిచ్చి మొక్కలను తొలగించడం వలన నీరు కిందకు వెళ్తుందన్నారు. ఉపాధిహామీ పనుల్లో ఉన్నటువంటి కూలీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

# వేలూరులో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



**చిలకలూరిపేట, ఫిబ్రవరి8, ప్రభాతవార్త:** మండలంలోని వేలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి శంఖు,చక్ర నామాలు, పాదాలు ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొని అక్కడ జరిగిన పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండ్రగుంట రామకృష్ణ, వి సాంబయ్య, పావులూరి వెంకటేశ్వర్లు, కట్టా నాగేశ్వరరావు, హనుమయ్య, సింగ్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కెఎల్‌యు విద్యార్థి బృందానికి హ్యుందాయ్ టెక్నోవేషన్ ప్రథమ బహుమతి

**తాడేపల్లి,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ట్రిపుల్ ఈ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థుల బృందానికి హ్యుందాయ్ టెక్నోవేషన్ 2024 ఆలిండియా టెక్నికల్ వర్చువల్ సింపోజియంలో మొదటి బహుమతి సాధించినట్లు ఇన్‌చార్జి విసి డాక్టర్ కె.రాజశేఖరరావు




తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అగ్రశ్రేణికి చెందిన వివిధ ఇంజనీరింగ్ విద్యాసంస్థలకు పోటీగా,ఈ బృందం తమ వినూత్న ప్రాజెక్టును ఈవిలలో రాబోయే తరానికి చెందిన మానిటరింగ్‌కోసం స్మార్ట్ ఇంటర్‌ఫేస్‌తో పరిశ్రమ నిపుణులను ఆకట్టుకుందన్నారు.ప్రారంభ స్క్రీనింగ్ రౌండ్‌లో పరిశోధన భావనలు, సారాంశాల సమర్పణ,టెక్నికల్ ప్రజంటేషన్ రౌండ్‌లో 8నుంచి 10నిమిషాల పాటు ప్రాజెక్టు ప్రదర్శన అనంతరం,హు ్యందాయ్ నిపుణుల ప్యానల్‌తో 5నిమిషాల ప్రశ్నోత్తరాల కార్యక్రమం జరిగిందన్నారు.తుది మూల్యాంకనలో భాగంగా ప్రాజెక్టు యొక్క పరిశ్రమ ఔచిత్యం,వాస్తవ ప్రపంచ అమలు కోసం సంభావ్యత యొక్క అంచనా అధ్యాపకుల మెంటర్ డాక్టర్ కళ్యాణ్ దూసర్లపూడి మార్గదర్శకత్వంలో కె.మురళీమనోజ్,ఓ.గౌతమ్ ల బృందం ఈ-బైక్ మెయిన్ యూజర్ ఇంటర్‌ఫెస్ డిస్‌ప్లేను అభివృద్ధి చేసిందన్నారు.వినియోగదారుల భద్రత, వినియోగాన్ని మెరుగుపరచడానికి స్మార్ట్ ఫీచర్‌లను ఏకీకృతం చేసినట్లు తెలిపారు.కెఎల్ ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ పాండియన్ మాట్లాడుతూ తమ విద్యారు ్థలు రూపొందించిన ప్రాజెక్టు టెక్నాలజీ ద్వారా వాహనం గుంతలను ముందుగానే గుర్తిండచంతోపాటు నిజ సమయంలో రోడ్డు ప్రమాదాల గురించి వాహన చోదకులను హెచ్చరిస్తుందన్నారు.విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత పరిష్కారాల వైపు నడిపించడంలో కీలకపాత్ర పోషించిన స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాద్,కెఎల్ ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ పాండియన్ నిరంతర సాంకేతిక మద్దతు మరియు ప్రోత్సాహం ద్వారా విద్యార్థుల అత్యుత్తమ పనితీరు సాధ్యమైందన్నారు.కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి విసి డాక్టర్ కె.రాజశేఖరరావు,ప్రొఫెసర్ విసి డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్,కెఎల్ ట్రిపుల్‌ఈ విభాగాధిపతి డాక్టర్ పాండియన్, ఆచార్యులు డాక్టర్ కళ్యాణ్ దూసర ్లపూడి, తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరియాలి

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిధిలోని గొడవర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామివారి దేవాలయం పున:ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరియాలన్నారు. గ్రామస్తులంతా ఐకమత్యంతో ఇలాంటి దేవాలయాలు నిర్మాణం చేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. లోక కళ్యాణార్థం దేవాలయాల నిర్మాణం, యజ్ఞయాగాదులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో, అష్టైశ్వ ర్యాలతో, పాడిపంటలతో తులతూగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. తొలుత ఎమ్మెల్యే ధూళిపాళ్ళకు దేవాలయం అర్చకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వేలూరు గ్రామంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేటరూరల్,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** మండలంలోని వేలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి శంఖు,చక్ర నామాలు, పాదాలు ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్,టిడిపి నాయకులు జవ్వాజి మదనమోహన్, బండారుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

# కర్లపాలెం మండలంలో 8 ప్రాథమిక పాఠశాలలు విలీనం

**కర్లపాలెం,ఫిబ్రవరి08,ప్రభాతవార్త:** కర్లపాలెం మండలంలో హాజరు శాతం తక్కువగా ఉన్న ఎనిమిది పాఠశాలలను పక్క గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కలుపుతూ ఇప్పటికే విద్యాశాఖ అధికారులు పై అధికారులకు నివేదిక ఇచ్చారు. గతంలో కర్లపాలెం మండలంలో మొత్తం ఐదు క్లస్టర్లు ఉండేది. వీటిని ప్రస్తుతం మూడు క్లస్టర్లుగా విభజించారు. ఈ మూడు క్లస్టర్ల పరిధిలో మొత్తం ఎనిమిది పాఠశాలల్లో ఉన్న మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను పక్క గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో కలుపుతూ విద్యాశాఖ అధికారులు నివేదిక తయారు చేశారు. దీని ప్రకారం లంకపల్లి, కట్టావాద, శీలంవారిపాలెం, కస్తూరిబా నగర్, వెన్నెలకంటి నగర్, యాజలి ఎస్సీ పల్లె, మామిడాల పాలెం, బంగారు రెడ్డిపాలెం పాఠశాలలను పక్క గ్రామాల్లో విలీనం చేస్తూ అధికారులు ఇప్పటికే ఓ నివేదికను తయారు చేశారు. దానిని పై అధికారులకు పంపించారు. దీంతో ఆయా గ్రామాల్లో మూడు నాలుగు ఐదు తరగతుల ను పక్క గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో విలీనం చేస్తూ త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

# 300 మందికి అన్నదానం



**కారంపూడి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** కారంపూడి పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం అన్నప్రసాద కమిటీ పర్యవేక్షణలో కజ్జం గురవయ్య జ్ఞాపకార్థం శనివారం వారి కుటుంబీకులు 300 మందికి అన్నదానం చేశారు. దాతలు కజ్జం సీతరావమ్మ, కజ్జం ఆంజనేయులు, రామలక్ష్మి, కజ్జం చిన్న ఆంజనేయులు, అరుణ, కజ్జం హనుమంతరావు, రాధిక, బొగ్గవరపు హరిబాబు, అంజనీకుమారిలు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కజ్జం నాగభూషణం, కోటమ్మ, లఘువరపు రాజ్యలక్ష్మి, కమిటీ కన్వీనరు భవిరిశెట్టి రామారావు, భవిరిశెట్టి గురవయ్య, కమిటీ సభ్యులు చిన్ని లక్ష్మి, భవిరిశెట్టి సీతామహాలక్ష్మి, పల్లా పద్మ, సూరే ధనలక్ష్మి, ఊటుకూరి వాణి, గుండా మహేశ్వరి, బొగ్గవరపు పార్వతి, తవిడిశెట్టి స్వప్న, ఊటుకూరి వెంకాయమ్మ, బచ్చు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నేడు సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు



**కారంపూడి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** కారంపూడి ఆర్యవైశ్య వీధిలోని శ్రీషిరిడి సాయి సత్యసాయి బాబా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటాన్ని పల్లకీసేవ ఉదయం 7.30 గంటలకు జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కమిటీ తెలిపింది.

# కాపురానికి రావడం లేదని భార్య పై భర్త బ్లేడుతో దాడి

**మాచర్ల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** పుట్టింటి నుంచి భార్య కాపురానికి రావడం లేదన్న కోపంతో భర్త బ్లేడుతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మాచర్ల పట్టణంలోని చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన షేక్ రియాజ్ పూలవ్యాపారం చేసేవాడు. భార్య భర్తల మధ్య మనస్పర్థలతో నూర్జహాన్ పుట్టింట్లో ఉంటోంది. ఎన్నిసార్లు పిలిచినా కాపురానికి రావడం లేదనే కోపంతో మద్యం తాగి ఆ మత్తులో ఆమెపై బ్లేడుతో దాడి చేశాడు. గొంతు, ముఖంపై గాయాలపాలైంది. కుటుంబ సభ్యులు మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిచి చికిత్స అందిస్తున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# పెట్రోలు బంకులను తనిఖీ చేసిన రెవెన్యూ అధికారులు




**మాచర్ల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని పెట్రోలు బంకులను తహశీల్దారు కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోలు బంకుల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, గాలి నింపే మిషన్ల పనితీరును పరిశీలించారు. బంకుల తనిఖీ నివేదికను తహశీల్దారుకు అందజేయనున్నట్లు ఆర్ఐ తెలిపారు.

# దాల్‌మిల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే జూలకంటి

**మాచర్ల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** నాణ్యతా ప్రమాణాలతో కూడిన సరకులను ఉత్పత్తి చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల మండల పరిధిలోని రాయవరం జంక్షన్ సమీపంలో నూతనంగా నిర్మించిన దాల్‌మిల్లును ఆయన ప్రారంభించారు. నూతన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ సమస్య తీరుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

# సొటుపల్లి ముసలయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** మండలంలోని వేలూరు గ్రామానికి చెందిన సొటుపల్లి ముసలయ్య ఇటీవల మరణించారు. శనివారం ముసలయ్య ఆదరణ కూడిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని ముసలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్,టిడిపి నాయకులు జవ్వాజి మదనమోహన్, బండారుపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ జనతాపార్టీ విజయానికి చంద్రబాబునాయుడు ప్రచారమే కీలకం : కత్తెర సురేష్‌కుమార్

**గుంటూరు తూర్పు, కార్పోరేషన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** ఢిల్లీలో భారతీయ జనతాపార్టీ విజయం వెనుక విజన్ ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రచారమే కీలకపాత్ర పోషించిందని రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రచారంలో అక్కడ విజయబావుటా ఎగరవేసిందని చెప్పారు. కూటమి నాయకులు చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌ల ప్రభావంతో మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో విజయాన్ని సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ఢిల్లీలోని చాదర్ విశ్వాసనగర్ సంఘం విహార్ సువద్ర నియోజకవర్గాల్లో ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రచారం చేశారని తెలిపారు. ఆయన



ప్రచారం అక్కడి తెలుగు వారిపై ప్రభావం చూపిందన్నారు. బిజెపి వలన లభించే సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారని అదే విధంగా ఆప్ పార్టీ వల్ల జరిగిన నష్టాన్ని తెలిపరాని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాలకు ఆకర్షితులైన ప్రజలు బిజెపికి ఓటు వేశారని ఆయన ఈ గెలుపులో కీలకపాత్ర పోషించారని చెప్పారు. దీనిని బట్టి విజన్ ఉన్న నాయకుల్ని ప్రజలు గుర్తుంచుకుంటారని కత్తెర సురేష్‌కుమార్ తెలిపారు.

## ఫారెస్ట్ విభాగాన్ని సందర్శించిన లక్నో శాస్త్రవేత్త

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** వర్సిటీలో వృక్ష,సూక్ష్మజీవ శాస్త్ర విభాగంలోని ఫారెస్ట్రీ విభాగాన్ని లక్నోలోని బీర్బల్ సహాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోలీ



సైన్స్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఏ.భట్టాచార్య సందర్శించారు.ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున అధ్యక్షతన గెస్ట్ లెక్చర్ జరిగింది.ఈ సందర్భంగా భట్టాచార్య మాట్లాడుతూ పర్యావరణంలోని మార్పులు, మొక్కల పెరుగుదల కలప నాణ్యతలపై కలిగించే ప్రభాకం గురించి వివరించారు.గెస్ట్ లెక్చర్‌లో ఆయన మాట్లాడుతూ వృక్షవలయం అధ్యాయనం చేయడం ద్వారా పురాతన కాల వాతావరణ పరిస్థితులు ప్రత్యేకించి ఉష్ణోగ్రతలు,మొక్కల పెరుగుదలను కలప నాణ్యతను ఎలా క్షిణింప చేస్తాయో వివరించారు.డెండ్రో క్రోనాలజీలో విస్తృత పరిశోధన, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు గురించి వివరించారు. అలాగే ఇప్పటివరకు చేసిన పరిశోధనలు ఉత్తర భారతదేశానికి మాత్రమే పరిమిత మైన పని దక్షిణ భారతదేశంలో కేవలం టేకు మీద మాత్రమే అధ్యాయనం జరిగిందన్నారు. దక్షిణ భారతదేశంలో డెడ్రోక్రోనాలజి పరిశోధనల్లో ఉన్న విస్తృత అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు.ఆచార్య మల్లికార్జున మాటాడుతూ భారతదేశంలోనే మొదటి సారిగా వృక్ష వలయం పై అధ్యాయనం చేసిన వ్యక్తిగా భట్టాచార్య ప్రముఖులుగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు ఆచార్య ఎస్ఎం ఖాశీం, డాక్టర్ వైఆర్‌కెఆర్ తిరుపతిరావు, డాక్టర్ కె.బాబు, డాక్టర్ కె.నాగరాజు,డాక్టర్ ఆర్.విజయ్ కుమార్, డాక్టర్ ఎన్.మిథున్,డాక్టర్ బాలరాజు, పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట విలియంపేట వాసులకు తీరిన మంచినీటి సరఫరా కష్టాలు

### -వాగ్దానం నెరవేర్చిన ఎంఎల్ఏ రాజగోపాల్

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట పట్టణంలోని ముక్త్యాల రోడ్ మార్గంలోగల షెడ్యూల్డ్ కులాలు నివశించే విలియంపేటలో మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోతుండటంతో నివాశిత ప్రాంతవాసులు చాలా కాలంగా అల్లాడుతున్నారు. ఈ సమస్యలపై వార్డు కౌన్సిలర్ నకిరికంటి వెంకట్ ఎంఎల్ఏ శ్రీరాం



రాజగోపాల్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఎంఎల్ఏ రాజగోపాల్ వెంటనే స్పందించి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాధికారులతో సంప్రదించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, యువనేత శ్రీరాం ధనుంజయ కూడా డిఇతో సమస్య పరిష్కార విధానం గురించి చర్చించి ఎంఎల్ఏ రాజగోపాల్‌కు పరిస్థితిని క్షుణ్ణంగా వివరించారు. యుద్ధప్రాతిపదికన సాంకేతికపరమైన విధానాలతో విలియంపేట వాసులకు శాశ్వతప్రాతిపదికన మంచినీటి సరఫరా చెయ్యాలని రాజగోపాల్ అధికారులను ఆదేశించారు. మూడు రోజులపాటు పరిశ్రమించిన ఇంజనీరింగ్ సిబ్బంది శనివారం మంచినీటి సరఫరా చేశారు. రాజగోపాల్ వార్డులో పర్యటించి మంచినీటి సరఫరా కొనసాగింపును పరిశీలించి ఆ ప్రాంత వాసులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈసందర్భంగా నివాశిత మహిళలు రాజగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## సీనియర్ జర్నలిస్ట్ సుబ్బారావు ని సత్కరించిన తెలుగుదేశం నాయకులు

**పెదకాకాని,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:** తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్రప్రధానకార్యదర్శి గా ఎంపికైన సీనియర్ జర్నలిస్ట్ బోడపాటి సుబ్బారావుని పెదకాకాని తెలుగుదేశం నాయకుల ఆధ్వర్యంలోశనివారం సత్కరించటం జరిగినది.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగామండల సీనియర్ నాయకులు మండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయిన మాట్లాడుతూ ఇలాంటి పదవులు మరెన్నోఅధిరోహించాలని సమాజం కోసం నైతిక విలువలను కాపాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి,అభివృద్ధికి అండగా ఉండి సమాజానికి న్యాయం జరిగించాలని కోరుకుంటూ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాననితెలిపారు.ఈకార్యక్రమంలో బురదగుంట కాళిదాసు,మంచాల రాజు,కనపర్తి ప్రభుదాసు,పిల్లి చంద్ర సతీష్,జొన్నకూటి అనిల్,పిల్లి నారాయణ,కనపర్తి రాజు,లింగుంట అశోక్,మండే వరుణ్‌రావు పలువురునాయకులు పాల్గొని జర్నలిస్ట్ సుబ్బారావుకి శుభాకాంక్షలు తెలియజేశారు.



## అధ్భుతమైన న్యాయగ్రంథాల రచయిత పెండ్యాల సత్యనారాయణ

**గుంటూరు కల్చరల్, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** ప్రముఖ న్యాయశాస్త్ర గ్రంధ రచయిత,వామపక్ష అభిమాని పెండ్యాల సత్యనారాయణ మృతి అభ్యుదయ వాదులకు,ప్రజాతంత్ర వాదులకు, న్యాయగ్రంధాల చదువరులకు న్యాయ వాదులకు తీరని లోటని అవగాహన సంస్థ నివాళులర్పిస్తుంది.అత్యంత క్లిష్టమైన న్యాయశాస్త్ర గ్రంధాలను సరళతరమైన వాడుకభాషలోనికి వ్యాఖ్యాన సహితంగా అనువదించిన ఘనత పెండ్యాల సత్యనారాయణ దేనని అవగాహన సంస్థ నివాళులర్పిస్తుంది. అవగాహన సంస్థ కార్యకలాపాల్లో పాల్గొంటూ సూచనలు సలహాలు ఇచ్చేవారని రాజ్యాంగం మీద పెండ్యాల అవగాహనలో ఇచ్చిన ప్రసంగం సభ్యులందరికీ ఎప్పటికీ గుర్తిండి పోతుందని సంస్థ నివాళులర్పిస్తుంది.

## ఈనెల 16వరకు ఇండియా ఆర్ట్ ఫెయిర్

**గుంటూరు విద్య,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** ఏపి,తెలంగాణ నుండి ఇద్దరు సస్టైనబిలిటి ఛాంపియన్లు సమిష్టి వాతావరణ చర్యను ప్రేరేపించడానికి సైన్స్,కళను కలిసే మొట్టమొదటి వేదికైన సస్టైనా ఇండియా 2025లో ప్రధాన ఆకర్షణగా నిలిచారు.ఇండియా ఆర్ట్ ఫెయిర్ సందర్భంగా ఫిబ్రవరి 2-16వరకు న్యూఢిల్లీలోని స్టిర్ ఆర్ట్ గ్యాలరీలో జరుగుతున్న ఈ ప్రదర్శనను "విత్ ఈచ్ సీడ్ వి సింగ్" అనే పేరుతో నిర్వహిస్తున్నారు.విజయనగరానికి చెందిన చిరుధాన్యాల రైతు,మహిళా సాధికారత నాయకురాలు సరస్వతి మల్లు వలస మరియు హైదరాబాద్‌నుండి డిజైనర్ మరియు పత్తి సస్టైనబిలిటి ప్రచారకుడు పోలుదాస్ నాగేంద్ర సతీష్ పాల్గొంటున్నారు.సాంప్రదాయం మరియు ఆవిష్కరణల్లో లోతుగా పాతుకుపోయిన వారి పని,ఆంధ్ర మరియు తెలంగాణలు పర్యావరణ అనుకూల వ్యవసాయం లలో ఎలా ముందుండగలదో ప్రదర్శిస్తుంది.

## వైభవంగా శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివార్ల కళ్యాణం

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 8,(ప్రభాతవార్త :** పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేదోక్తంగా స్థానిక బ్రాడీపేటలోని ఓంకార క్షేత్రంలో కుర్తాళం శ్రీ సిద్దేశ్వర పీఠ పాలిత ఓంకారక్షేత్రంలో నిర్వహించారు.స్వామివార్ల కళ్యాణాల్లో భాగంగా శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి కళ్యాణం వేదమంత్రాల నడుమ నేత్రపర్వంగా నిర్వహించారు. కళ్యాణం, మహోత్సవాలు తలంబ్రాలు విశేషపూజలు,మంత్రపుష్పం అనంతరం అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. మంచికంటి వెంకట సత్యవతి ప్రతిరోజు నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణ ప్రవచనంలో కిష్కింధాకాండలోని అనేక విషయాలను వివరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి నంబూరు వెంకట శ్రీమన్నారాయణ మూర్తి మరియు సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 91వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం 95వ సంఘ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం భీష్మ ఏకాదశి సందర్భంగా శ్రీఓంకారేశ్వరస్వామి మహాన్యాస సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఆదివారం గోదాదేవి సమేత రంగనాయకస్వామి వార్లకు మరియు సువర్చలా సమేత ఆంజనేయస్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలుపుతూ భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



## 10నుంచి ప్రతిష్టాత్మక ఐఏ అండ్ ఏడి సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ 2025

**గుంటూరు కల్కటరేట్,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏసిఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈనెల 10నుంచి 13వ తేది వరకు 4రోజులు ఐఏ అండ్ ఏడి సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ 2025 పోటీలు జరగనున్నాయి.విజయవాడలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) కార్యాలయం నేతృత్వంలో తొలిసారి సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ అంగరంగ వైభవంగా నిర్వహించబడుతుంది. ఈ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్‌లో దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,కర్నాటక,తమిళనాడు,కేరళ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న జట్లు పాల్గొని తలపడనున్నాయి. తొలిసారిగా ఈ క్రీడలను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తుండడం గర్వించదగ్గ విషయం. అఖిలిండియా క్రికెట్ టోర్నమెంట్ కు అర్హత పొందేందుకు ఈ టోర్నమెంట్ ఉపయోగపడనుందని ఆడిట్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులు జాతీయస్థాయిలో వారి రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని పొందుతారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవం 10ఫిబ్రవరి, 2025న ఉదయం 8గంటలకు జరుగుతుంది. ఫిబ్రవరి 13 మధ్యాహ్నం 1.30గంటలకు ముగింపు వేడుకతో టోర్నమెంట్ ముగుస్తుంది. క్రీడాభిమానం ఉన్న ప్రతిఒక్కరూ సంబంధిత మ్యాచ్‌లు వీక్షించే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ప్రారంభమైన శ్రీపంచముఖ ఆంజనేయస్వామి బ్రహోత్సవాలు

**తెనాలి, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త) :** దక్షిణాపదంలో నాలుగు ధ్వజస్థంబాలతో మహా మహిమాన్విత దేవాలయంగా విరాజిల్లుతున్న శ్రీసువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి వార్షిక బ్రహోత్సవములు శనివారం ఘనంగా ప్రారంభమైనాయి. స్థానిక షరాఫ్ బజారులో వేంచేసియున్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారు శనివారం బ్రహోత్సవాలు ప్రారంభ సందర్భంగా పెండ్లి కుమారుడుగా భక్తులచే పూజలందుకున్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణ లో ఆలయ వంశపారంపర్య అర్చక స్వామి రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆర్వి కిరణ్, ఆర్.సురేష్‌లు పూజా విధులకు సహకరించరు. వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే బ్రహోత్సవాలలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తనా సేవా సమితి, సంకర్తీనా సమితి మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీహనుమాన్ చాలీసా, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణా కార్యక్రమాలు, ఉత్సవాల విశిష్టతను పెంచాయి. కాగా రాత్రి 7గంటలకు విష్వక్సేన పూజ, అంకురారోపణ ధ్వజారోహణ పూజా విధులలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు యస్.బి.శివ, శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, జంధ్యం రామారావు, మదుపల్లి చంద్రశేఖర్, సంకీర్తన ట్రస్ట్ ముఖ్యులు మూర్తి, అనురాధ, తదితర భక్తులు పాల్గొన్నారు.



## వ్యాసభగవానుడు లోకానికి అందించిన మహోత్తర కావ్యం భారతం

### -పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు

**గుంటూరు కల్చరల్ ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** తాను పొందిన అనుభూతిని లోకానికి అందించాలని సత్‌సంకల్పంతో మహాభారత కావ్యాన్ని వ్యాసభగవానుడు రచించారని ప్రముఖ సాహితీవేత్త పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని శ్రీరామ సత్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం మహాభారత యుద్ధంలో భగవానుని పాత్ర అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది.పద్మశ్రీ డాక్టర్ గరికపాటి ప్రవచనం చేస్తూ వ్యాసభగవానుడి జీవితం మనకు ఆదర్శమన్నారు. భారతంపై ప్రవచనం చేసే ముందు వ్యాసభగవానుని అనుమతి పొందడం క్షేమకరమన్నారు.ఏ పురాణాలు ఉన్నా వాటిలోని సారాంశాన్ని జీవితానికి అన్వయించుకోవడం ఉత్తమమన్నారు.కష్టాలు పడ్డవారికి సుఖాలు ప్రాప్తిస్తాయని చెప్పిన మహోత్తర కావ్యం భారతమేనన్నారు.శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం మన ఆధ్యాత్మిక సమానత్వమన్నారు.అన్ని కులాలు సమానమేనని లోకానికి తెలిపేది సత్యనారాయణ స్వామి కథేనన్నారు.మహాభారత యుద్ధం సభాపర్వంలోనే ప్రారంభమైందన్నారు.కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## గుణదల మేరీమాత ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** నేటి నుండి ఈ నెల 12 వరకు విజయవాడ లోని గుణదల మేరీమాత ఉత్సవాల సందర్భంగా భక్తులకు విజయవాడ నగర ప్రజలకు,విజయవాడ మీదుగా ప్రయాణించే ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా ఏలూరు రోడ్డుపై ఆర్టీసి,సిటీ బస్సులు,ఇతర వాహనాల రాకపోకల మళ్లింపులు,మేరీ మాత ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల వివరాలు తెలుసుకొని,వాటిపై అవగాహన పెంచుకొని పోలీసులకు సహకరించాలని విజయవాడ సిపి రాజశేఖరబాబు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8వ తేది రాత్రి నుండి ఈ నెల 12వ తేది వరకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ నుండి గన్నవరం,ఆటోనగర్ వైపుకు ఏలూరు రోడ్డు మీదుగా వెళ్ళే ఆర్టీసి బస్సులు పండిట్ నెహ్రూ బస్టాండ్,పిసిఆర్ జంక్షన్,ఆర్‌టిసి వై జంక్షన్,స్వర్ణ హోటల్ జంక్షన్,అప్సరా జంక్షన్,విజయా టాకీసు,దీప్తి జంక్షన్,చుట్టుగుంట సెంటర్,కుడి వైపుకు విశాలాంధ్ర రోడ్డు లోకి తిరిగి-మెట్రో జంక్షన్,నైస్ బార్ జంక్షన్,డెంటల్ ఆస్పత్రి రోడ్,మహానాడు జంక్షన్ మీదుగా రామవరప్పాడు,ఆటోనగర్ వైపుకు వెళ్ళాలని తెలిపారు.

## భీష్మ ఏకాదశి వేళ వైకుంఠపురంలో పోటెత్తిన భక్తజనం

**తెనాలి, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త) :** భక్తులు కోర్కెలు తీర్చే కొంగుబంగారమై శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధానంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. డెల్టా ప్రాంతంలో ద్వితీయ తిరుపతిగా బాసిల్లుతున్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం వైకుంఠపురం నందు భీష్మ ఏకాదశి పర్వదిన ప్రాధాన్యత క్రమంలో భక్తులు అశేష సంఖ్యలో పాల్గొని తమ అభీష్టం మేరకు అర్తిమీర పూజలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధికి శనివారం భక్తులు విశేషంగా రావడం ఓ ఆనవాయితీగా అందున భీష్మ ఏకాదశి పర్వదినం కూడా కలిసి రావడంతో తెనాలి పట్టణ పరిసర గ్రామాల భక్తులు ఆలయ ప్రాంగణానికి భారీగా చేరుకొని శ్రీలక్ష్మీ పద్మావతి సమేతుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో అనుమప మీడియాకు వివరించారు. భీష్మ ఏకాదశి ప్రాధాన్యతను ఆలయ అర్చక స్వాములు వివరించారు. ఇదిలా ఉండగా ఆలయంలో భక్తులు ప్రత్యేక కళ్యాణపూజలలో పాల్గొన్నారు. శ్రీ సుబ్రహ్మణ్యస్వామి సన్నిధానంలో ప్రదక్షిణలు చేస్తూ తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో ఆలయ ప్రాంగణంలో క్యూ లైన్లలో భక్తులు బారులు తీరారు. ప్రసాద వితరణతో పాటుగా, భక్తులకు అన్న ప్రసాదాన్ని కూడా పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కార్యాలయ సిబ్బంది పర్యవేక్షించారు.



## ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు డాక్టర్ కాసరనేని పురస్కారం

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కెఆర్‌కె ఈవెంట్స్ నిర్వహణలో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి ఆధ్వర్యంలో 13వ నాటకోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమైనాయి. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సభకు సంస్థ చైర్మన్ డాక్టర్ యర్రా నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.అతిథులుగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ,డాక్టర్ పాతూరి కిరణ్‌చౌదరి,ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఘంటా పున్నారావు,పొన్నూరు కళాపరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఆకుల సాంబశివరావు,కళా సమితి సభ్యుడు యర్రా ఈశ్వరరావు,సంస్థ కన్వీనర్ సదాశివరావు ఆత్మీయ పురస్కారంతో ఘనంగా సత్కరించారు.డాక్టర్ యర్రా నాగేశ్వరరావుచే పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్స్ పంపిణీ జరిగింది.సభానంతరం శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ కాకినాడ వారు మార్కొండ దుర్గాప్రసాద్ రచనకు చట్రా విజయలక్ష్మీ మహేష్‌దర్శకత్వం వహించిన "దేవుడు కనిపించాడు" నాటిక ప్రేక్షకులనూ ఆకట్టుకున్నారు.కార్యక్రమాన్ని తదితరులు పర్యవేక్షించారు.



## అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వహించాలి : డిసిపి గౌతమి పాలి

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** నేటి నుండి జరుగనున్న మేరీ మాత ఉత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎంతో అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వహించాలని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు సిబ్బందికి సూచనలిస్తూ విధులు నిర్వహించాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా నడుకుంటూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా అవసరమైన సహాయసహకారాలు అందించాలని డిసిపి గౌతమి పాలి పేర్కొన్నారు. నేటి నుండి మూడు రోజుల పాటు నగరంలో అత్యంత వైభవంగా జరుగనున్న గుణదల మేరీమాత ఉత్సవాల సందర్భంగా టెంపుల్,పరిసర ప్రాంతాల్లో శాంతిభద్రతలపరంగా,ట్రాఫిక్ పరంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా 17 మంది డిఎస్పీలు,44 మంది సిఐలతో కలిపి సుమారు 1050 మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసామని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు.ఆయన ఆదేశాల మేరకు డిసిపి గౌతమి పాలి గుణదల సమీపంలోని బిషప్ గ్రాసిస్ స్కూల్ గ్రౌండ్ క్లాసిక్ స్కూల్ గ్రౌండ్‌లో బందోబస్తు నిమిత్తం వచ్చిన అధికారులకు,సిబ్బందికి తగు సూచనలు చేస్తూ దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుండి అత్యంత వైభవంగా ప్రారంభం కానున్న గుణదల మేరీ మాత ఉత్సవాల సందర్భంగా అన్ని శాఖలను సమన్వయం చేసుకొని పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసామన్నారు. టెంపుల్,పరిసర ప్రాంతాల్లో సిసి కెమేరాలు,డ్రోన్లతో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసామన్నాఉ. పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎంతో అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వహించాలన్నారు.సమావేశంలో ట్రైనీ ఐపిఎస్ మనీషా,ఏడిసిపిలు,ఏసిపిలు,సిఐలు,ఎస్ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.



## పోస్టల్‌శాఖ సేవలకు క్షేత్రస్థాయి ప్రచారం అనివార్యం

### -ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె ప్రకాష్

**తెనాలి, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త) :** ప్రజాక్షేత్రంలో విస్తృత ప్రచారం ద్వారా తపాలాశాఖలో అందించే సేవలను పట్టణ ప్రాంతాలతో పాటుగా గ్రామస్థాయిలో కూడా



ఇంటింటికి చేర్చాలని ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయాన్ని శనివారం ఏపీ సర్కిల్ చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ తమ సిబ్బందితో శాఖపరమైన తనిఖీలు నిర్వహించారు. పోస్ట్ ఆఫీస్ ద్వారా రోజువారీగా ప్రజలకు అందుతున్న సేవల వివరాలను కూలంకషంగా పరిశీలించారు. హెడ్ పోస్ట్ ఆఫీస్‌లోని ప్రతి విభాగం అధికారి పనితీరుపై ఆరా తీశారు. శాఖపరమైన ఫైళ్ళను పరిశీలించారు. అనంతరం కె.ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లోని దేశ ప్రధాని నరేంద్రమోదీ, ఇండియా పోస్టను దేశంలో ప్రధాన లాజిస్టిక్ ప్లేయర్గా గుర్తించారని, ఈ కామర్స్ రాకతో ఇండియా పోస్టు యొక్క ప్రాముఖ్యత పెరిగిందన్నారు. దేశంలోని పట్టణాలతో పాటుగా, గ్రామీణ ప్రాంతాలకు సైతం పోస్టల్ ద్వారా పార్శిల్స్ పంపబడుతున్నాయన్నారు. పోస్టల్ కార్యకలాపాల ప్రక్రియ క్రమబద్ధీకరించడానికి, భద్రతను మెరుగుపరచడానికి, సేవా విధానములో నాణ్యత ప్రమాణాలను మెరుగు పర్చడానికి అనేక కొత్త లక్షణాలతో 2.0పరిచయం చేస్తుందన్నారు. అదే విధంగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంటికి పోస్టల్ శాఖ ద్వారా అందించే సేవల వివరాలు విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉందన్నారు. ప్రధానంగా మధ్య తరగతి కుటుంబాల్లో ఆడ పిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రయోజనకరమైన పథకంగా విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరాన్ని ప్రకాష్ వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్ మాస్టర్ ఇ.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పై ప్రజలకు అవగాహన

**కంచికచర్ల ఫిబ్రవరి 08 ప్రభాతవార్త:** సమాజంలో నానాటికి పెరుగుతున్న సైబర్ నేరాలపట్ల ప్రజలు అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని నందిగామ రూరల్ సీఐ డి.చవాన్ తెలిపారు. స్టేట్ బ్యాంకు జోనల్ మేనేజర్ మనీష్ కుమార్ సింగ్, రీజినల్ మేనేజర్ బట్టు నవీన్ బాబుల ఆదేశాల మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కంచికచర్ల బజార్ బ్రాంచ్ మేనేజర్



మామిడాల సురేంద్ర ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విభూతి బ్రదర్స్ కళాజాత ద్వారా ప్రజలు అవగాహన కార్యక్రమంను శుక్రవారం కంచికచర్ల బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ చవాన్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఈజీ మనీ పేరుతో కినిపంచే యాప్‌లు, లోన్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు వివిధ యాప్‌ల ద్వారా సంప్రదించి, బ్యాంక్ అకౌంట్ నుండి నగదును గ్రహించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ ఎం.సురేంద్ర మాట్లాడుతూ బ్యాంకులో కేవైసీ చేయించాలంటూ ఫోన్ చేసి కొందరు బెదిరిస్తారని కస్టమ్స్ వద్ద చట్ట విరుద్ధమైన పార్సెల్ చిక్కుకుపోయింది జరిమానా కట్టాలంటూ వస్తున్న కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. లాటరీ తగిలిందంటూ బ్యాంకు ఖాతా వివరాలు , ఓటీపీలు అడుగుతారని కుటుంబ సభ్యులు అరెస్టయ్యారంటూ విడిపించడానికి డబ్బులు కావాలంటూ బెదిరిస్తారని, తదితర సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కంచికచర్ల ఎస్సై బోనగిరి రాజు మాట్లాడుతూ కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి తాము పోలీసు అధికారులమని విచారించాలని బెదిరించి డబ్బు కాజేస్తారని అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇటువంటి విపత్కర పరిస్థితులలో నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 టోల్ ఫ్రీ నెంబర్‌లో సంప్రదించి తగు రక్షణ పొందాలని కోరారు. అత్యంత ఉల్లాసభరితంగా కొనసాగిన ఈ కళాజాతాలో గ్రామపెద్దలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలకు విలువలేదు చట్టం అంటే గౌరవం లేదు

### -మరణమృదంగం మోగిస్తున్న హైవే రోడ్ డివైడర్‌ను తిరిగి ఓపెన్‌చేసిన హైవే అథార్టీ

### -స్పందించని పోలీసు యంత్రాంగం

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి -65పై జగ్గయ్యపేట పట్టణ శివారులోని ఆటోనగర్ వద్ద అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న ప్రమాదకర రోడ్డు డివైడర్ ప్రాంతాన్ని మూసివేయాలని ప్రజలు చేసిన ఆందోళన, స్పందించి డివైడర్‌ను మూసివేయించిన శాసనసభ్యుల మర్యాద మంటగలిసి పోయింది. హైవేపై అతివేగంగా ప్రయాణించే వాహనాల గురించి తెలిసీ రోడ్డు డివైడర్ వద్ద గల మార్గంలో బైక్స్, ఆటోలు, కార్లు మలుపుతిప్పుకునే ఈప్రాంతంలో ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో దాదాపు 21 మంది మృత్యువాతపడినట్లు సామాజిక మాధ్యమాలు కోడైకూస్తున్నాయి. పోలీసు అధికారులకు కూడా ఈ ప్రమాదాల వైనం గురించి తెలిసినా స్వతంత్ర నిర్ణయాధికారం అమలు చేయలేని స్థితిలో ఉన్నారు. సమీపంలోగల ఫుడ్‌ప్లాజా వ్యాపారాలకు అనుగుణంగా ఇక్కడ రోడ్డు డివైడర్‌ను తెరిచి రోడ్డు క్రాసింగ్‌కు వీలు కల్పించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఒకపక్క రోడ్డు భద్రతా జాతీయ మాసోత్సవాలు జరుగుతుండగా మరోపక్క కోరి ప్రమాదాలను కొనితెచ్చుకునే చందాన హైవేపై రోడ్డు డివైడర్ క్రాసింగ్‌ను శనివారం హైవే అథార్టీ రీ-ఓపెనింగ్ చేసినట్లు సిటిజనులు భగ్గుమంటున్నారు. పోలీసు యంత్రాంగం మౌనం వహించింది. ప్రజల ఆందోళన, గగ్గోలు అంతా ఆవిరైపోయిందని, తిరిగి ఎన్ని ప్రాణాలను బలితీసుకుంటారో అంటూ పలువురు సామాజిక వేత్తలు, విద్యావంతులు విచారం వ్యక్తంచేస్తున్నారు. మరి ప్రభుత్వ యంత్రాంగం, పరిపాలకులు, పోలీసులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సివుంది మరి ! ప్రజల ప్రాణాలకు విలువ ఉంటుందా, స్వీయ ప్రయోజనాల కోసం ప్రాకులాడుతూనే ఉంటారా అనేది తేలాల్సివుంది !?



## ఖాదర్‌వలీ బాబా 66వ ఉర్సు మహోత్సవానికి నిజాంబాబా మహా సూఫీ తీర్థయాత్ర

**అమరావతి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** విజయనగరం బాబా ఖాదర్ షా ఖాదర్ ఔలియా వారి 66వ ఉర్స్ మహా సూఫీయాత్ర వేమూరు నియోజకవర్గం జంపని ఎఎబిఎస్‌టి దర్బార్ నుండి ఎఎబిఎస్‌టిఎ దర్బార్ నిర్వాహకులు సజ్జాద అల్ ఖాదరియా అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామిషా తార్ ఖాదరీ (అతా నిజాంబాబా) శుక్రవారం జంపని నుండి విజయవాడ మైలవరం చీమలపాడు మీదుగా రెండు బస్సుల్లో కార్లలో పెద్ద సంఖ్యలో 3రోజుల పాటు జరిగే ఉర్సు గంధ మహోత్సవానికి బయలుదేరి వెళ్లారు. ఆషిఖ్ ఏ రసూల్ బాలీఫయే ఖాదర్ ఔలియాపీర్ ఓ ముర్షిద్ హుజూర్ హజరత్ సూఫీ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బొగ్దాది బాబా చీమలపాడు వారి దివ్య ఆశీస్సులతో 66వ ఉర్సు మహా సూఫీ తీర్థయాత్ర నిర్వహిస్తున్నట్లు అతానిజాంబ తెలిపారు. ఎ కొండూరు మండలం చీమలపాడు అతావుల్లా బాబా దర్బార్‌లో దర్గాను సందర్శించి అక్కడ ప్రత్యేక చాదర్ పూలు ఈతర్ సమర్పించి దువా జరిపి బాబా వారి దువా జరిపి బాబా వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని అమ్మ ఖమ్రున్నీసా సమాధి వద్ద ప్రత్యేక దువా జరిపినట్లు నిజాంబాబా తెలిపారు. జంపని షరీఫ్ దర్గా నుండి కులమతాలకతీతంగా నిజాంబాబా లంగర్ షరీఫ్ (అన్నసమారాధన) నిర్వహించారు. నిజాంబాబా తండ్రి ఎస్‌కె కాలేషా వలి మామ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ విద్యా మేళాకు విశేష స్పందన

**విజయవాడ, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** ఐడిపి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన అంతర్జాతీయ విద్యామేళా కు విశేష స్పందన లభించింది. ఆస్ట్రేలియా, కెనడాలో ఉన్నత విద్యనభ్యసించాలనుకున్న విద్యార్థులకు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో ఇరవైకి పైగా విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొని 350 పైగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సలహాలు మార్గదర్శకాలు తెలిపారు. కోర్సుల ఎంపిక విద్యారుణాలు, వీసా ప్రక్రియ, ఉద్యోగావకాశాలపై సమగ్ర సమాచారాన్ని అందించినట్లు ఐడిపి ఎడ్యుకేషన్ రీజనల్ డైరెక్టర్ పీయూష్‌కుమార్ తెలిపారు.

9-2Pg5exH.qxd:9-2Pg5exH.qxd 01/01/01 7:17 AM Page 1



# ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ బహుమానం!

## 7.4 బిలియన్ డాలర్ల ఆయుధాల విక్రయానికి ఆమోదం



**వాషింగ్టన్, ఫిబ్రవరి 8:** ఇజ్రాయెల్, గాజా యుద్ధం తాజా పరిస్థితిపై చర్చించడానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే టెల్‌అవీవ్‌కు అమెరికా భారీ గిఫ్ట్‌ను ప్రకటించింది. అగ్రరాజ్యం తయారుచేసిన 7.4 బిలియన్ డాలర్ల విలువైన బాంబులు, క్షిపణులను ఇజ్రాయెల్‌కు విక్రయించేందుకు ఆమోదం తెలిపింది. అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కో ఆపరేషన్ ఏజెన్సీ (డిఎస్‌సిఎ) ఈ విషయాన్ని ఓ ప్రకటనలో పేర్కొంది. 600 మిలియన్ డాలర్ల హెల్‌ఫైర్ క్షిపణులతోపాటు 6.75 బిలియన్ డాలర్ల బాంబులు, మార్గదర్శక కిట్‌లు విక్రయించేందుకు నిర్ణయించినట్లు తెలిపింది. 'ఇజ్రాయెల్ ప్రస్తుత, భవిష్యత్తు బెదరింపులను ఎదుర్కొనేందుకు, దాని మాతృభూమి రక్షణ బలోపేతానికి ఇది ఉపయోగపడుతుంది. సరిహద్దులు, కీలకమైన మౌలిక సదుపాయాల రక్షణకు ఐడిఎఫ్ సామర్థ్యాన్ని ఇది మెరుగుపరుస్తుంది' అని డిఎస్‌సిఎ పేర్కొంది. ప్రస్తుతం నెతన్యాహు అమెరికాలో పర్యటిస్తున్న క్రమంలోనే ఇంత మొత్తంలో ఆయుధాల విక్రయానికి ఆమోదం రావడం గమనార్హం.

ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య కాల్పుల విరమణకు ముందు రఫాలో పౌరుల భద్రత, వారికి మానవీయ సాయంపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే ఇజ్రాయెల్‌కు అందాల్సిన కీలక ఆయుధాల షిప్‌మెంట్‌ను అప్పటి అధ్యక్షుడు జో బైడెన్ నిలిపివేశారు. అయితే, తాజాగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే ట్రంప్ ఆ దేశానికి ఆయుధాలను ఇచ్చేందుకు ఆమోదం తెలపడం గమనార్హం.

2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్ హమాస్ మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 1200 మందికిపైగా ఇజ్రాయెల్ పౌరులు చనిపోగా, 250 మందిని హమాస్ మిలిటెంట్లు బందీలుగా చేసుకున్నారు. దీంతో హమాస్‌పై ఇజ్రాయెల్ భీకరంగా విరుచుకుపడింది. హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియా, అక్టోబరు 7 నాటి ఘటనకు సూత్రధారి యహ్యా సిన్వార్‌తోపాటు కీలక నేతలను హతమార్చింది. టెల్‌అవీవ్ దాడుల్లో గాజాలో 46,000 మందికిపైగానే పాలస్తీనీయులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తిత్వంతో పాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.

# టిక్కెట్లు దక్కని వారు ఫిరాయించి పగ తీర్చుకున్నారు!

## ఆ 8 స్థానాలు బిజెపికి ఎలా దక్కాయంటే..



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశరాజధాని ఢిల్లీలో దాదాపు 26 యేళ్ల తర్వాత బిజెపి అధికార పీఠం దక్కించుకుంది. పదేళ్లుగా అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిపక్షానికి పరిమి తమైంది. ఈ ఎన్నికల్లో బిజెపి నాయకత్వం తోపాటు కార్యకర్తలు కూడా చెమటోడ్చి పని చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీలోని విభేదాలు కూడా రచ్చకెక్కి ఓటమికి కారణమయ్యాయి. గతేడాది ఆప్ ఎంపి స్వాతిమలివాల్ చేసిన ఆరోపణలు తీవ్ర సంచలనం రేకెత్తించాయి. అలాగే ఆప్ నుంచి బిజెపిలోకి ఫిరాయించిన 8 మంది ఎమ్మెల్యేలు కూడా బిజెపి విజయానికి కూడా పనిచేశారు. దీంతో ఆ మొత్తం 8 నియోజక వర్గాల్లోనూ బిజెపి అభ్యర్థులే గెలుపొందారు. ఢిల్లీలో పాలం, త్రిలోక్‌పురి, మదిపుర్, కస్తూర్బా నగర్, ఉత్తమ్‌నగర్, బిజ్వాసన్, మెహ్రౌలీ, ఆదర్శ్‌నగర్ అసెంబ్లీ స్థానాలను 2020 ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ గెలుచుకుంది. అయితే తాజా ఎన్నికల్లో ఆప్ పార్టీ అధినాయ కత్వం ఈ 8 నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చింది. మొత్తం 8మంది సిట్టింగ్ ఎమ్మెల్యే లను పక్కన పెట్టింది. దీంతో ఆ ఎనిమిది మంది ఆప్ పార్టీకి రాజీనామా చేసి చేసి బిజెపిలో చేరిపోయారు. బిజెపి వారిలో ఒక్కరికి కూడా సీటు ఇవ్వలేదు. కానీ, వారి సేవలను వినియోగించుకుంది. దీంతో తాజా ఎన్నికల్లో ఆ 8నియోజక వర్గాల్లోనూ బిజెపి జయకేతనం ఎగురవేసింది. అలా 2020లో ఆప్ పార్టీకి కంచుకోటగా నిలిచిన ఆ 8నియోజకవర్గాలు తాజా ఎన్నికల్లో బిజెపి చెంతకు చేరాయి. తాజా ఎన్నికల్లో న్యూఢిల్లీ సీటు నుంచి పోటీ చేసిన కేజ్రీవాల్ కూడా ఓడిపోయారు. అలాగే డిప్యూటీ సిఎం మనీష్ సిసోసియాతో పాటు పలువురు కీలక నేతలు కూడాఓటమి పాలయ్యారు. పదేళ్ల అధికారంలో కొనసాగిన ఆప్ పార్టీలో అంతర్గత విభేదాలు కూడా బిజెపి ఘన విజయానికి తోడ్పాటునందించాయి.



# 'యమునా' శాపమే ఆప్‌ను ఓడించింది

## బిజెపి ఎంపి మనోజ్‌తివారి విమర్శ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఎన్నికల ఫలితాల్లో బిజెపి దూసుకుపోతోంది. ఆధిక్యాల్లో మ్యాజిక్ ఫిగర్ దాటి జోరు ప్రదర్శిస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సిఎం మనీష్‌సిసోడియా పరాజయం పాలయ్యారు. వెనుకంజలో ఉన్న ఆప్‌పై కాషాయపార్టీ విమర్శలు గుప్పిస్తోంది. యమునా నది శాపం తగలడంవల్లే వారు ఓడిపోయారంటూ వ్యాఖ్యానించింది. ఢిల్లీలో బిజెపి విజయం ఖరారైంది. త్వరలో రాజధానిలో మా ప్రభుత్వం కొలువుదీరనుంది. కేజ్రీవాల్ ప్రజలకు తీరని ద్రోహం చేశారు. మంచినీటికి బదులుగా మద్యం పంపిణీ చేశారు. యమునా నది శాపం వారికి తగిలింది. కాంట్రాక్టు కార్మికులు, ఉపాధ్యాయులు జీవితాలను అతలాకుతలం చేశారు. బస్సు డ్రైవర్లను తొలగించి వారి పెన్షన్‌ను నిలిపివేశారు. ఆయుష్మాన్ భారత్ ప్రయోజనాలను ప్రజలకు అందనివ్వకుండా అడ్డుపడ్డారు.

బిజెపి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాయక తొలి కేబినెట్ సమావేశంలో ఆరోగ్య పథకాల అమలుపై దృష్టిసారిస్తుంది అని బిజెపి ఎంపి మనోజ్ తివారి పేర్కొన్నారు. మా పార్టీ యమునా నదిని పరిశుభ్రంగా మారు స్తుంది. ప్రజలు ఎప్పుడు కావాలంటే అప్పుడు నదీ తీరాలకు వెళ్లేలా సౌకర్యాలు కల్పిస్తుంది. నీటిలో మునిగేలా శుభ్రపరుస్తాం. ఢిల్లీ సిఎం అభ్యర్థి అంశంపై బిజెపి అతి త్వరలో నిర్ణయం తీసుకుంటుంది. 20 ఏళ్ల పాటు ప్రభుత్వాన్ని నడిపించే సామర్థ్యం ఉన్న వ్యక్తినే నియమించే అవకాశం ఉంటుంది.

ఇక కేజ్రీవాల్ పంజాబ్‌కు పారిపోక తప్పదు అని ఎద్దేవా చేశారు. న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థి పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ చేతిలో ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ పరాజయం పాలయ్యారు. జంగ్‌పురలో మనీష్‌సిసోడియా ఓడిపోయారు. ఈ స్థానంలో బిజెపి అభ్యర్థి తర్వేందర్‌సింగ్ గెలి చారు. మరోవైపు, కాషాయ పార్టీ అభ్యర్థి రమేష్ బిధూరిపై స్వల్ప తేడాతో సిఎం అతిశీ విజయం సాధించింది. ముందునుంచి వెనుకంజలో కొనసాగిన అతిశీ చివరి రౌండ్‌లో పుంజుకున్నారు.

# జోబైడెన్‌కు దేశరహస్య సమాచారం తెలుసుకునే అనుమతి రద్దు

## యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం



**వాషింగ్టన్, ఫిబ్రవరి 8:** అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ దేశ రహస్య సమాచారం తెలుసుకోవాల్సిన అవసరం లేదని ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయా అనుమతులను రద్దు చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ట్రూత్ సోషల్ వేదికగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 'ప్రస్తుతం జో బైడెన్ రహస్య సమాచారం పొందాల్సిన అవసరం లేదు. అందువల్ల మేము వెంటనే ఆయన భద్రతా అనుమతులను రద్దు చేస్తున్నాం. ఆయన రోజువారీ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్‌లను నిలిపివేస్తున్నాం. 2021లో నాకు ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ నుంచి జాతీయ భద్రతా సమాచారం తెలుసుకోవడాన్ని నిలిపివేశారు. దానికి ప్రతిగానే నేను ఈ చర్యలు తీసుకుంటున్నా. అంతేకాక.. ఆయన పేలవమైన జ్ఞాపకశక్తితో బాధ పడుతున్నట్లు తెలుస్తోంది. అందువల్ల దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారం విషయంలో జాగ్రత్తలు వహించాలని నిర్ణయించుకున్నా. నేను ఎల్లప్పుడూ జాతీయ భద్రతను రక్షిస్తా' అని ట్రంప్ రాసుకొచ్చారు. కాగా, ట్రంప్ నిర్ణయంపై బైడెన్ ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా సంప్రదాయం ప్రకారం అక్కడి మాజీ అధ్యక్షులకు జాతీయ భద్రతకు సంబంధించిన రహస్య సమాచారం తెలుసుకునే అధికారం ఉంటుంది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌పై జోబైడెన్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన గెలుపునకు వ్యతిరేకంగా ట్రంప్ మద్దతుదారులు 2021 జనవరి 6న క్యాపిటల్ భవనంపై దాడి చేశారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌నకు అప్పటివరకు ఉన్న ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ అనుమతులను బైడెన్ తొలగించారు. దీనికి ప్రతీకారంగానే ట్రంప్ తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

# విసిగిపోయిన ఢిల్లీ జనం మార్పునకు ఓటేశారు

## కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ప్రియాంకగాంధీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించింది. ఆప్ భారీ ఓటమిని చవిచూసింది. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ప్రియాంకాగాంధీ స్పందించారు. ఢిల్లీ ప్రజలు పదేళ్లుగా ఒకే ప్రభుత్వాన్ని చూసి విసిగిపోయారని, అందుకే మార్పు కోసం ఓటేశారని వ్యాఖ్యానించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్న విషయం ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సమావేశాల సందర్భంగానే తేలిపోయిందని ఆమె చెప్పారు.

'స్థానిక పరిస్థితులతో ప్రజలు విసిగిపోయారు. వారు మార్పును కోరుకున్నారు. మార్పు కోసమే ఓటేశారని అనుకుంటున్నా. ఈ ఎన్నికల్లో గెలిచిన అందరికీ నా శుభాకాంక్షలు. మిగిలిన వారు మరింతగా శ్రమించాలని ఈ ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. నేతలు స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలపై స్పందించాలి' అని కేరళ పర్యటనలో ఉన్న ప్రియాంకగాంధీ సూచించారు.

కాగా, ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకుగాను బిజెపి 48 స్థానాల్లో గెలిచింది. అధికారపార్టీ కేవలం 22 స్థానాలకు పరిమితమైంది. ఇక కాంగ్రెస్ పార్టీ వరుసగా మూడోసారి కూడా ఒక్క ఎమ్మెల్యే సీటైనా గెలుచుకోలేకపోయింది. ఎన్నికల్లో గెలిచిన బిజెపి న్యూఢిల్లీలో కేజ్రీవాల‌్‌ను ఓడించిన పర్వేష్‌వర్మకు సిఎం పదవి కట్టబెట్టే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# ఓడినా బిజెపిపై మా పోరాటం కొనసాగిస్తాం

## కల్కాజీ ఎమ్మెల్యే, మాజీ సిఎం అతిశి మర్లేనాసింగ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కల్కాజీ స్థానంనుంచి బిజెపి ఎంపి రమేష్ బిదూరిపై విజయంసాధించిన సీఎం అతిశి మొర్లేనా తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను గెలిచినప్పటికీ సంబరాలుచేసుకునే తరుణం ఇది కాదని, ఎన్నికల ఫలితాలు తమ పార్టీకి గట్టి ఎదురు దెబ్బలేనని ప్రజల తీర్పును గౌరవిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో తాను కల్కాజీనుంచి గెలిచానని కానీ వేడుకలు చేసుకునే సమయం కాదని, నాపై విశ్వాసం ఉంచి గెలిపించిన కల్కాజీ ప్రజలకు ధన్యవాదాలనిఎన్నికల ఫలితాలు ఆప్‌కు గట్టి షాక్ అని ప్రజల తీర్పును తలవంచాల్సిందేనని అతిశి వ్యాఖ్యలుచేసారు. బిజెపిపై మా పోరాటం ఆగదని ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. బిజెపి సీనియర్ నాయకుడు రమేష్ బిదూరిపై ఆమె 3521 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇదేస్థానంనుంచి కాంగ్రెస్ తరపున అల్కాలాంబ పోటీచేసారు. గతంలో 2020లో జరిగిన ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి అతిశిమర్లేనాసింగ్ 52శాతం ఓట్లతో ప్రజల మద్దతును పొందారు.

# మిల్కిపూర్‌లో బిజెపి విజయం

**లక్నో, ఫిబ్రవరి 8:** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యజిల్లా మిల్కిపూర్ ఉప ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించింది. సమాజ్‌వాదీపార్టీ పై జరిగిన పోరులో బిజెపని అభ్యర్థి చంద్రభాన్ పాశ్వాన్ గెలిచారు. ఎస్పీ అభ్యర్థి అజిత్‌ప్రసాద్‌ను 60వేల ఓట్లతేడాతో ఓడించారు. 2027లో జరగనున్న ఉత్యర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు మిల్కిపూర్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఫలితాలు కేవలం ట్రైలర్ అని డిప్యూటిసిఎం కేశవ్‌ప్రసాద్ మౌర్య అన్నారు.

ఇది కేవలంట్రైలర్ మొత్తం చిత్రం 2027లో విడుదలవుతుందని సమాజ్ వాదీపార్టీ జీరో అవుతుం దని ఆయన అన్నారు. ప్రతి ష్టాత్మక రామాలయాన్ని నిర్మించిన అయోధ్య జిల్లాలోని ఫైజాబాద్ లోక్‌సభ స్థానంలో సమాజ్‌వాదిపార్టీ అభ్య ర్థి అవధేష్‌ప్రసాద్ బిజెపి అభ్యర్థిపై విజయం సాదించారు. పార్లమెంట్‌కు ఆయన



ఎంపిక కావడంతో ఎస్సీలకు రిజర్వు చేసిన అయోధ్య జిల్లాలోని మిల్కిపూర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం అయింది. ఆధిపత్య పాసీ వర్గానికి చెందిన అవధేష్ కుమారుడు అజిత్ ప్రసాద్‌ను ఎస్పీ పోటీకి దించింది. అయితే ఇరు పార్టీల మధ్య జరిగిన ప్రతిష్టాత్మకపోరులో అదేవర్గానికి చెందిన బిజెపి అభ్యర్థి చంద్రభాను పాశ్వాన్ ఘనవిజయం సాధించారు.

# 54వేల ఓట్ల మెజార్టీతో ఈరోడ్ డిఎంకె అభ్యర్థి గెలుపు



**ఈరోడ్, ఫిబ్రవరి 8:** తమిళనాడులోని ఈరోడ్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార డిఎంకె అభ్యర్థి విసి చందిరకుమార్ భారీ విజయం నమోదుచేసారు. ఈరోడ్ ఈస్ట్ స్థానానికి శనివారం ఉప ఎన్నిక పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే ఎన్టీకే అభ్యర్థి ఎంకె సీతాలక్ష్మిని భారీ ఆధిక్యంతో ఓడించారు.

మాజీ ఎమ్మెల్యే కూడా అయిన చంధిరకుమార్ మొద టిరౌండ్‌నుంచే ఆధిక్యంలో నిలిచారు. నియోజక వర్గంలో డిఎంకె ఆధిపత్యాన్ని చాటిచెప్పింది. కనీసం ఎన్నికల్లో సీతాలక్ష్మి తన ధరావత్తు అయినా దక్కించుకుంటుందా అన్న భావన నియోజకవర్గనేతల్లో కనిపించింది. చంధిం కుమార్‌కు లక్షోట్లకుపైగా రాగా సీతాలక్ష్మి కేవలం 23 వేల ఓట్లతోనే వెనకబడిపోయారు.

ఈ ఉప ఎన్నికలు తమిళనాడులో 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు రిఫరెండమ్ వంటివని డిఎంకె నేతలు హర్షం ప్రకటించారు. ఈరోడ్ తూర్పునుంచి 54వేల ఓట్ల ఆధిక్యంతో తమ అభ్యర్థి గెలవడం డిఎంకెపార్టీకిప్రజల్లో ఉన్న ఆదరణను రుజువుచేస్తుందని డిఎంకె అధినేత సీఎం ఎంకె స్టాలిన్ అన్నారు. మొత్తం 46 మంది అభ్యర్థులు పోటీచేసారు.

వీరిలో 44 మంది స్వతంత్ర అభ్యర్థులే ఉన్నారు. ఎన్‌టికె, డిఎంకె ఎఐఎడిఎంకెతోపాటు ఇతర విపక్ష పార్టీల అభ్యర్థులు కూడా పోటీచేసారు.

ఈరోడ్ ఒకప్పటి ప్రముఖ నేత ఈవీ రామస్వామి పెరియార్ సొంత నియోజకవర్గం కావడం గమనార్హం.

# ఇంకా కొట్టుకుంటూనే ఉండండి..

## ఆప్, కాంగ్రెస్‌పార్టీలపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు అనుగుణంగానే ఫలితాల్లో బిజెపి మ్యాజిక్ ఫిగర్‌ను దాటి దూసుకుపతోంది. అధికార ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ పార్టీలు వెనుకంజలో ఉన్నాయి. దీనిపై జమ్మకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ ఆప్, కాంగ్రెస్‌లకు చురకలు అంటించారు. ఢిల్లీలో బలం ఉన్న ఆప్‌కు కాంగ్రెస్ సహకరించలేదని, అందువల్లే ఎన్నికల ఫలితాల్లో వెనుకబడిపోతున్నారని మండిపడ్డారు. ఇంకా మీలో మీరే కొట్టుకుంటూ ఉండండి అంటూ వారి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికల విషయంలో ఇండియా కూటమిలో భాగమైన కాంగ్రెస్, ఆప్ పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. దాంతో ఇరుపార్టీలు వేరువేరుగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించాయి. అంతేకాకుండా ఎన్నికల ప్రచారాల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆప్‌పై పలు ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా కూటమికి ప్రాముఖ్యం తగ్గిపోయిందంటూ ఆప్ సహా కూటమి నేతలు అసహనం వ్యక్తం చేశారు. దీనివల్ల ఆగ్రహానికి గురైన ఒమర్‌అబ్దుల్లా కలసికట్టుగా లేకపోతే కూటమికి ముగింపు పలకాలంటూ వ్యాఖ్యానించారు. కేంద్రంలోని ఎన్డీయే సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి. ఎన్నికల సమయంలో స్థానిక పార్టీలు బలంగా ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ పోటీ చేయకుండా వారికే అవకాశం ఇవ్వాలనే ఒప్పందంతో ఏర్పడింది. కాగా ఆప్ అధికారంలో ఉన్న ఢిల్లీలో తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అప్పటికే జరిగిన లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర , హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయాన్ని ఎదుర్కోవడంతో ఆప్ అందుకు అంగీకరించలేదు. దీంతో రెండు కూటమి పార్టీలు ఒంటరి పోరుకు సిద్ధమయ్యాయి.

# హ్యాట్రిక్ సున్నాలతో తుడిచిపెట్టుకుపోయిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడోసారి కూడా కాంగ్రెస్ ఒక్కస్థానం కూడా సాధించలేకపోయింది. ఒకప్పుడు హ్యాట్రిక్ విజయంతో ఢిల్లీ పీఠాన్ని పాలించిన హస్తంపార్టీ ఇపుడు కనీసం ఒక్కస్థానం కూడా గెలవలేని స్థితిలో నిలిచిపోయింది. ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత బిజెపి విజయం సాధించింది. 1998లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మొదటిసారి అధికారంచేపట్టింది. అప్పటినుంచి ప్రతి ఎన్నికల్లోను ఆ పార్టీ విజయం సాధించింది. సీఎంగా షీలాదీక్షిత్ నేతృత్వంలో ఆపార్టీ హస్తినలో తిరుగులేని శక్తిగా మారింది. 2003, 2008 ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. ఆ సమయంలో కేంద్రంలో యుపిఎ ప్రభుత్వం ఉండటం ఢిల్లీ రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్‌పార్టీ హవా చూపించింది. ఆమ్ ఆద్మీపార్టీ రాకతోనే కాంగ్రెస్‌కు కష్టకాలం ప్రారంభం అయింది. 2013 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఉన్న ఓటుబ్యాంకు చాలావరకూ ఆప్‌కు వెళ్లిపోయింది. దీనితో ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎనిమిది స్థానాలతోనే సరిపెట్టుకుంది. 2015 ఎన్నికల్లో ఉన్న సీట్లుకూడా కోల్పోయింది. సున్నాకే పరిమితం అయింది. 2015, 2020 ఎన్నికల్లోను కాంగ్రెస్ ఓటర్లు కాంనరగెస్‌చేతిలో ఒక్కస్థానం కూడా గెలిపించి ఇవ్వ లేదు. ఉన్న ఓటు బ్యాంకు కూడా ఎగిరిపోయింది. ఉత్తరాదిరాష్ట్రాల్లో ఆప్ క్రమేపీ విస్తరించింది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా మారిపోయింది. కాంగ్రెస్ ఓటుబ్యాంకును మొత్తం సాధించుకోవడం కనిపించింది. ఢిల్లీ సహా సరిహద్దురాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ మనుగడ కష్టం కాసాగింది. కాంగ్రెస్ వ్యతిరేక ఓటర్లు, బిజెపి తీరు నచ్చనివారంతా ఆప్‌వైపు మళ్లారు. కాంగ్రెస్ ఓటుబ్యాంకు దారుణంగా పడిపోయింది. అందుకే ఈసారి ఎన్నికల్లో వేరువేరుగా ఇండియా కూటమి తరపున కాకుండా వేరువేరుగా పోటీ చేసాయి. అయినా కూడా తన ఓటు బ్యాంకును కాపాడు కోలేక పోయింది. దీనికితోడు కాంగ్రెస్ కు దేశరాజధానిలో బలమైన నాయకుడేలేడు. షీలాదీక్షిత్ తర్వాత ఆపార్టీకి సరైన నాయకుడు లేకుండాపోయాడు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడం చేయకపోవడం, కేంద్రంలో బిజెపిని ఎదిరించేందుకు ఆప్‌తో చేతులు కలిపిన కాంగ్రెస్ రాష్ట్రంలో ఆపార్టీని దూషించడం ఆపార్టీని ఓటర్లు హర్షించలేకపోయారు.

దీనికితోడు ఇపుడు ప్రభుత్వం ఏంచేస్తోంది, తమ ప్రభుత్వ లక్ష్యాలేమిటి అనేవి స్పష్టంగా చెప్పలేకపోయింది. మహిళలకు ఉచితాలు, 25 లక్షల ఆరోగ్యబీమా ప్రకటించినా ఓటర్లు ఆపార్టీని ఎన్నికల్లో పక్కన పెట్టేసారు.

# భారీ రాకెట్లలో ఉపయోగించే క్రయోజనిక్ ఇంజన్‌కు సరికొత్త పరీక్ష

## మహేంద్రగిరిలో విజయవంతంగా పూర్తి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు


## ఎన్‌జిఎల్‌వి రాకెట్లకు ఇది కీలకం

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అతిపెద్ద రాకెట్లను ప్రయోగించే సమయంలో క్రయోజనిక్ ఇంజన్‌ను సరికొత్తగా ఉపయోగించుకోవడానికి స్థిర పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఎల్‌విఎం3 బాహుబలి రాకెట్లలో మూడవ దశలో సిఇ20 పేరుతో ఈ ఇంజన్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే దీన్ని ప్రజ్వలన చేసిన ఆగిన తర్వాత కూడా మళ్లీ మండుకునే విధంగా సరికొత్త ఇంజన్‌ను రూపుదిద్దారు.

తమిళనాడు లోని మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో హై ఆటిట్యూడ్ టెస్ట్ (హెచ్‌ఎటి) తరహాలో ఈ పరీక్ష నిర్వహించారు. ఇది భవిష్యత్‌లో జరిగే న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జిఎల్‌వి) రాకెట్ల తయారీకి కూడా కీలకం అవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. టర్బో పంపులను ఉపయోగించి ప్రత్యేక ట్యాంకులో నిల్వ చేయబడిన ప్రెషరైజ్డ్ గ్యాస్ (స్టోర్డ్ గ్యాస్ సిస్టం) ఎంతో ఉపయోగపడనుంది. రాకెట్ ప్రయాణిస్తున్నప్పుడే క్రయోజనిక్ ఇంజన్‌ను మళ్లీ పునఃప్రారంభించే కొత్త తరహా ప్రయోగంగా దీన్ని పేర్కొంటున్నారు. గగన్‌యాన్ మిషన్‌కు కూడా 19 టన్నుల నుంచి 22 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వాడే సౌలభ్యం ఉంది.

ఈ విధానాన్ని ఇస్రో అమల్లోకి తీసుకురావడంతో భవిష్యత్ ప్రయోగాలపై మరింత దృష్టి పెట్టినట్లయింది.





పెద్ద రాకెట్లలో ఉపయోగించే సిఇ20 క్రయోజనిక్ ఇంజన్ జ్వలన పరీక్ష
ఇస్రో విజయవంతంగా పరీక్ష పూర్తి చేసిన స్వదేశీ సిఇ20 క్రయోజనిక్ ఇంజన్

9- 02 Pg6exHMNWJQE.qxd:9- 02 Pg6exHMNWJQE.qxd 01/01/01 8:55 AM Page 1



# శ్రీకాళహస్తిలో శివరాత్రి తిరునాళ్లకు ముస్తాబులు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మహాశివరాత్రి తిరునాళ్ళకు ముస్తాబౌతుంది. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల పనులు యుద్ధ ప్రాతిపదికపై సాగుతున్నాయి.ఇప్పటికే దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు పనుల నిర్వహణలో తలమునకలై ఉన్నారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డికు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కొత్త అయినా ఆయన రేయింబవళ్ళు నిద్రాహారాలు మాని పరుగులు తీస్తున్నారు. మరో వైపు కూటమి ప్రభుత్వ శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి ఇది మొదటి శివరాత్రి.దాంతో భారీ ఎత్తున నిర్వహించాలనే అంచనాలతో పరుగులు తీస్తున్నారు.అధికారులను పరుగులు తీయిస్తున్నారు. సకాలంలో పనులు పూర్తి కావాలని ఇంజనీరింగ్ అధికారులు పరుగులు తీస్తున్నారు. భక్తుల బస సదుపాయాలకు, సాంస్కృతిక వేదిక రూపకల్పనతో పాటు పార్కింగ్, కొత్తగా సిసి కెమెరాల ఏర్పాటు, స్వర్ణముఖి నదిలో భక్తులకు స్నానాలు, అలాగే మరుగుదొడ్ల నిర్మాణం వేగంగా చేపట్టారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది పనుల్లో వేగం పెరిగింది. ఇప్పటికే దాదాపు పనులు ఓ కొలిక్కి వచ్చాయని చెప్పవచ్చు. గతంలో పని చేసిన ఇఓల హాయం కన్నా ప్రస్తుత ఇఓ హయాంలో ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది వేగంగా పనుల నిర్వహణలో చొరవ చూపుతున్నారు. ఓ వైపు దాతలతో చర్చించుకుంటూ పనులు చేస్తున్నారు. సిబ్బంది సంఘం ఇచ్చిన మాట ప్రకారం ఎవరి పరిధిలో వారు ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. 13రోజుల పాటు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు చురుగ్గా సన్నాహాలు చేపట్టారు. పట్టణంలోని నాలుగు మాడా వీధుల్లో గల మండపాల వద్ద శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్వామి అమ్మవార్లు ఊరేగించే కృష్ణారెడ్డి మండపం,పెండ్లిమండపం,బేరివారి మండపం వద్ద ఆకట్టుకునే విధంగా పందిళ్ళు వేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే ట్రాఫిక్ సమస్యతో ప్రారంభానికి ముందు ఏర్పాటుకు పోలీసులు సూచించారు.. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి ఎప్పటి కప్పుడు చెల్లింపుల్ని చేస్తూ ఓ వైపు ఫైళ్ళపై సంతకాలు మరో వైపు సమీక్షలు ఇంకొక వైపు అతిథుల్ని ఆహ్వానించే కార్యక్రమాల్లో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డితలమునకలై ఉన్నారు. పరుగులు తీస్తున్నారు. ఇక ఇంజనీరింగ్ విభాగం పనుల్ని ఇఇ మురళీధర్‌రెడ్డి సారథ్యంలో రథాలు, నారదపుష్కరిణిలో తెప్పలకు సంబంధించి పరిశీలన జరుపుతున్నారు. శివరాత్రి అంటే చుట్టుపక్కల గ్రామాలకు పండగ. మరో రెండు రోజుల్లో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి.దాంతో అధికారులు ఎవరి పరిధిలో వారు పరుగులు తీస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.ఓవైపు భారీ ఏర్పాట్లు మరోవైపు నిధుల అందుబాటును పరిగణలోకి తీసుకొని చర్యలు తీసుకుంటున్నారు.ఇప్పటికే విస్తృతంగా సమీక్షలు జరిపి ఏర్పాట్లును పలుమార్లు పునఃసమీక్షించుకున్నారు. ఇద్దరు మంత్రులు ఈ నెల 1న వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లు గురించి చర్చించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కల్గకుండా చర్యలు తీసుకున్నారు.

# రైలు మార్గం పనులు

## - తెలుగు రాష్ట్రాల మీదుగా తిరిగే పలు రైళ్ల రద్దు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో జరుగుతున్న రైలు మార్గం పనుల కారణంగా పలు రైలు సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. సికింద్రాబాద్ రైల్వే డివిజన్,కాజీపేట- విజయవాడ సెక్షన్‌లోని ఖమ్మం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న రైలు మార్గం అనుసంధాన,సాంకేతిక పనుల కారణంగా తెలుగు రాష్ట్రాల మీదుగా విశాఖ పట్నం నుంచి ముంబై ఎల్‌టిటి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను 10నుంచి 20 వరకు, ముంబై ఎల్‌టిటి నుంచి విశాఖ పట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను 12నుంచి 22వ తేదీ వరకు రద్దు చేశారు.

# వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

## బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత

**సచివాలయం. ఫిబ్రవరి 8. ప్రభాతవార్త:** ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వైద్య విద్యార్దులకు అందజేస్తున్నట్లుగా తమకూ స్టయిఫండ్ ఇచ్చేలా కృషి చేయాలని ఏపీ వెటర్నరీ వైద్య విద్యార్దులు, గ్రాడ్యుయెట్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితను కోరారు. శనివారం బీసీ సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులపై సమీక్షించడానికి వచ్చిన మంత్రిని తిరుపతిలోని పద్మావతి గెస్ట్ హౌస్‌లో వెటర్నరీ వైద్య విద్యార్దులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయూష్ వైద్య విద్యార్దులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున స్టయిఫండ్ ఇస్తుందని, వారి మాదిరిగా తమకూ స్టయిఫండ్ వచ్చేలా కృషి చేయాలని, ఈ విషయం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాని మంత్రిని కోరారు. అనంతరం పలు సమస్యల పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధిలో తమ పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.

దీనిపై మంత్రి స్పందిస్తూ వెటర్నరీ వైద్య విద్యార్దుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపీ వెటర్నరీ వైద్య స్టూడెంట్స్, గ్రాడ్యుయెట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పి.నస్వర్‌ఖాన్, కేవీ ధర్మతేజ, ఎం.గుణ కౌశిక్, లోకేష్ సాయి, రమేష్, జితేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో అరటి మొక్కల ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత

# గొందిరెడ్డిపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సమస్యలు పరిష్కరించండి

## - ఎమ్మెల్యే పరిటాల సునీతకు పారిశ్రామిక వేత్తల విజ్ఞప్తి

## - అధికారులతో మాట్లాడి సమస్యల్ని పరిష్కరిస్తానని హామీ

**అనంతపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం జిల్లాలోని రాప్తాడు మండలంలోని గొందిరెడ్డిపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఏపిఐఐసి ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీతకు చిరు పారిశ్రామిక వేత్తలు విజ్ఞప్తి చేశారు. ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ఉన్న ఎలైట్ బయోటెక్నాలజీస్ వారి అరటి మొక్కల ల్యాబ్‌ను ఎమ్మెల్యే సునీత సందర్శించారు. అరటి మొక్కలను తయారు చేసే విధానాన్ని, అది రైతులకు ఏ విధంగా ఉపయోగపడుతుందన్న అంశాల గురించి తెలుసుకున్నారు. ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసుకున్న వాటితో ఇక్కడ అరటి మొక్కలు తయారు చేస్తున్నట్టు ఎలైట్ చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. మొత్తం 8 రకాల అరటి మొక్కలను ఇక్కడ తయారు చేసి 10 నెలలపాటు పెంచుతామని, ఆ తర్వాత నర్సరీలో మూడు నెలలపాటు పెంచి, ఒక సంవత్సరానికి సుమారు 30 లక్షల వరకు అరటి మొక్కలను రైతులకు అందిస్తామని తెలిపారు. అరటి మొక్కలు తయారీ విధానాన్ని ఆమె ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ఉన్న పారిశ్రామిక వేత్తలతో ఆమె సమావేశ మయ్యారు. ప్రస్తుతం ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ఉన్న పరిస ఇథతి గురించి తెలుసుకున్నారు. మొ త్తం 50 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఉండ గా, ఇందులో 26.6 ఎకరాలు వినియో గంలో ఉందన్నారు. 319 ప్లాట్లు వేశారని, 239 ప్లాట్లు వినియోగిస్తున్నట్లు తెలిపారు. 18 యూనిట్లు ఇప్పటికే నడుస్తున్నాయని మరికొన్ని యూనిట్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అయితే ఇక్కడ 30 మంది పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు నడిపేపందుకు రకరకాల సమస్యలు ఉన్నట్లు చెప్పారు. ఇందులో ప్రధానంగా నీరు, విద్యుత్ సమస్యలు ఉన్నట్టు ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పరిశ్రమలకు అవసరమైన నీరును బోర్ల ద్వారా తీసుకుంటున్నామన్నారు. అయితే భూ గర్భ జలాలు తగ్గిపోవడంతో నీటి సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. గొందిరెడ్డి పల్లి చెరువుకు పూర్తి స్థాయిలో నీరు వస్తే భూగర్భ జలాలు పెరగడంతోపాటు పైప్‌లైన్ వేసుకోవచ్చన్నారు. మరోవైపు ప్రస్తుతం ఉన్న విద్యుత్ లైన్ల ద్వారా సరఫరా అయ్యే విద్యుత్ ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. తరచూ పవర్ కట్, లో ఓల్టేజీ సమస్య వస్తోందన్నారు. దీని వలన పరిశ్రమలు పూర్తి స్థాయిలో నడపటం లేదన్నారు. అందుకే ఇక్కడ సబ్ స్టేషన్ నిర్మాణం చేపడితే మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉ ందన్నారు. ఇండస్ట్రీయల్ ఏరియా లోకల్ అథారిటీ( ఐలా) ఆమోదం గత సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉందని, పంచాయితీరాజ్ విభాగంలో ఈ ఫైల్ ఉందని తెలిపారు. దీనిని త్వరగా పూర్తి చేస్తే, మాకు సొంతంగా హక్కులు వస్తాయన్నారు. గతంలో టైటిల్ డీడ్‌ల డిపాజిట్‌పై చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ వెయ్యి రూపాయలు మాత్రమే ఉండేది, కానీ ఇప్పుడు ప్రభుత్వం నుంచి ఆదేశాలు కానీ, జీఓ లేనప్పటికీ, రిజిస్ట్రేషన్ శాఖ అధికంగా ఫీజు వసూళ్లు చేస్తోందన్నారు. దీనిపై స్పష్టమైన ఆదేశాలు వచ్చేలా చూడాలన్నారు. మరోవైపు రామినేపల్లి గ్రామం నుంచి ఇండస్ట్రీయల్ ఎస్టేట్ వరకు 80 అడుగుల అప్రోచ్‌రోడ్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతం ఉన్న రోడ్డు చాలా చిన్నదిగా ఉండటం వలన రవాణాకు ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. వీటన్నింటిపై ఎమ్మెల్యే సునీత సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కొత్తగా మరో ఇండస్ట్రీయల్ పార్కు వచ్చేలా చూస్తామన్నారు. అయితే ఇక్కడ ఏర్పాటు చేస్తున్న యూనిట్స్‌లో స్థానికులకే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

# జగన్ 2.0 వద్దంటూ ప్రజలు ఎదురు దండాలు పెడుతున్నారు

## మంత్రి గొట్టిపాటి రవి కుమార్

**విజయవాడ ఫిబ్రవరి 08 ప్రభాతవార్త ప్రతినిధి:** బడులు, బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంత్రిగొట్టిపాటి రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఐసీయూలో పెట్టిన ఆరోగ్య శ్రీకి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఊపిరి పోసిందని చెప్పారు. జగన్ 1.0కే ప్రజల బెంబేలెత్తి 11 సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. జగన్ 2.0 ఎంత దారుణంగా ఉంటుందో అని ప్రజలు ఆయనకు ఎదురు దండాలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇచ్చిన 11 సీట్లతో అయినా జగన్ రెడ్డి యుద్ధం చేయాలని చెప్పారు. పిరికి వాడిలా అసెంబ్లీలో మైకె ఇవ్వడం లేదని సమయంఇవ్వడం లేదని ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని జగన్ కుంటి సాకులు చెబుతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. 30 ఏళ్లు అధికారం అంటూ కలలు కనడం మానాలని హితవు పలికారు. జగన్ చేసిన ఆర్థిక నేరాలకు 30 సంవత్సరాలు జైలు శిక్ష మాత్రం ఖాయమని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. రక్త సంబంధీకులు, ఆత్మ బంధువులే జగన్ క్యారెక్టర్, క్యాపబులిటీని వేలెత్తి చూపుతున్నారని గుర్తు చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అడ్డంకులు సృష్టించినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి ప్రకటించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు లబ్దిదారులు పాల్గొన్నారు.

# వల్లభనేని వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై 20న హైకోర్టు తీర్పు



**విజయవాడ,ఫిబ్రవరి8,ప్రభాతవార్తప్రతినిధి:**గన్నవరం తెలుగుదేశం పార్టీ ఆఫీసుపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు పెట్టిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వేసిన పిటిషన్‌లో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

ఈ కేసులో ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును ఈ నెల 20న వెలువరిస్తామని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాది వి దేవి సత్యశ్రీ వాదిస్తూ, పిటిషనర్‌పై ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కేసు నమోదు చెల్లదని, కాబట్టి ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. పోలీసుల తరపున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా ప్రతివాదన చేస్తూ, ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కేసు నమోదై నప్పుడు ముందస్తు బెయిల్ హైకోర్టు ఇవ్వడానికి వీల్లేదన్నారు.

ప్రత్యేక కోర్టు ఇచ్చే ఉత్తర్వులపై దాఖలయ్యే అప్పీళ్లపై మాత్రమే హైకోర్టు జోక్యం చేసుకోవచ్చునని చెప్పారు.

# కనకదుర్గ ఆలయంలో వేదోక్తంగా భీష్మ ఏకాదశి పర్వదినాన సూర్యోపాసన

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** దుర్గమ్మ వారి ఆలయంలో మాఘమాసం శుద్ధ ఏకాదశి (భీష ్మ ఏకాదశి) సందర్భంగా వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ సూర్యోపాసన సేవను నిర్వహించారు. ఆదిత్యహృదయం, అరుణ పారాయణ, సూర్యాష్టకం పఠిస్తూ పూజాదికాలు నిర్వహించిన అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగ ఇఓ కె రామచంద్రమోహన్ మాట్లాడుతూ దుర్గమ్మ ఆలయంలో లోకకళ్యాణార్థం మాఘమాసం సందర్భంగా వేదోక్తంగా నిర్వహించే సూర్యోపాసన సేవలో పాల్గొనాలని ఈ సూర్యోపాసన సేవలను ఈనెల 9వ తేదీ ఆదివారం మాఘశుద్ధ ద్వాదశి, 12వ తేదీ మాఘమాస పూర్ణిమ, 16 ఆదివారం, 23వ తేదీ ఆదివారం, 24 సోమవారం బహుళ ఏకాదశి, 26 బుధవారం మాఘబహుళ చతుర్ధశి పర్వదినాల్లో ఉదయం 8 గంటలకు అరుణ పారాయణ, సూర్య నమస్కారాలు, ఆదిత్య హృదయం, సూర్యాష్టకం పఠిస్తూ పండితులు పూజాదికాలు నిర్వహిస్తారని, రు.1000ల ఉభయంతో దంపతులు పూజలో పాల్గొనవచ్చని తెలిపారు.

**- నిత్యాన్నదానానికి లక్ష విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానపథకానికి రు.1లక్ష విరాళాన్ని విజయవాడకు చెందిన కొల్లి వేంకట రమణరావు, విజయలక్ష్మి లు శనివారం డిప్యూటి ఇఓ ఎం రత్నరాజుకు విరాళంగా అందించారు. వారికి దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన తదుపరి దుర్గమ్మవారి మెమంటో, ప్రసాదం, శేషవస్త్రంలను డిప్యూటి ఇఓ ఎం రత్నరాజు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళమిచ్చిన దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# వ్యవసాయాన్ని కీలక ఆర్థిక వనరుగా తీర్చిదిద్దుతాం : సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫి బ్రవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయాన్ని కీలక ఆదాయ వనరుగా, పరిశ్రమగా తీర్చిదిద్దే దిశలో చర్యలు చేపట్టినట్లు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.కీలకంగా ఆర్థికంగా సాగుదారులకు ఆదాయాన్ని అందించే ఉద్యాన పంటల ఆక్వాకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మాగాణి సాగులో ప్రజలు తినే వంగడాల సేద్యం టెక్నాలజీతో సాగు కొత్త పద్ధతులు అనుసరిస్తామన్నారు. ఉద్యాన,వ్యవసాయ. ఆక్వా,పశు సంవర్ధక శాఖలపై సిఎం చంద్రబాబు సమీక్షను నిర్వహించి.పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సీఎం చంద్రబాబు సమీక్షాంశాలను సమాచార పౌరసంబంధాలశాఖ సవివరంగా వెల్లడించింది. రైతులకు ఆదాయం వచ్చే పంటలనే ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి తెలిపారు. అందుకోసం అగ్రివాచ్‌తో ఎప్పటికప్పుడు అధ్యయనం చేయించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని అధికారులను కోరింది. రైతులు ఇష్టానుసారం పంటలు సాగు చేస్తున్నారని, ఈ పాత పద్ధతులు మారాలని సూచించింది. ఉద్యానవన పంటలను, ప్రకృతి సేద్యాన్ని పెంచాలని ఆదేశించింది. వ్యవసాయ, అనుబంధ రంగాల వృద్ధి రేటును తప్పనిసరిగా 20 శాతానికి పెంచాలని, రాబోయే ఐదేళ్లలో వృద్ధి రేటును 30 శాతానికి తీసికెళ్లాలని, అందుకనుగుణంగా ప్రణాళికలు, లక్ష్యాలు నిర్ణయించాలని కోరింది. వ్యవసాయ అనుబంధ రంగాలపై ఒక కార్యచరణతో ముందుకు వెళ్తామన్నారు.ప్రస్తుతం వ్యవసాయ, అనుబంధ రంగాల వృద్ధి రేటు 15.86 శాతంగా ఉందని. ఎట్టి పరిస్థితుల్లో 20 శాతానికి తక్షణం పెంచాలన్నారు. వ్యవసాయ పంటల కంటే హార్టికల్చర్ పంటలపై రైతులకు ఆదాయం రావట్లేదన్నారు. 18 లక్షల హెక్టార్లలో హార్టికల్చర్ వలన స్థూల ఆదాయం 1.52 లక్షల కోట్లు కాగా, వ్యవసాయ పంటలు ఖరీఫ్, రబీ కలుపుకొని 52 లక్షల హెక్టార్ల సాగు ద్వారా 57 వేల కోట్ల ఆదాయం వస్తోంది. అందుకే పామాయిల్, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి వాటిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు.

పామాయిల్ పరిశ్రమలను పిపిపి పద్ధతిలో నెలకొల్పుతామని. తక్షణం 50 వేల ఎకరాల్లో సూక్ష్మ సేద్యాన్ని అదనంగా ప్రవేశపెడతామన్నారు. సబ్సిడీ లిస్తామని చెప్పారు. కుప్పంలో హార్టికల్చర్ పంటలను నిల్వ చేసేందుకు కూలర్లు ఏర్పాటు చేయడంతో. ఆ ప్రయోగం విజయవంతమైం దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం సబ్సిడీ ఇచ్చి ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. అనంతపురంలో పైలెట్ ప్రాజెక్టు కింద హార్టికల్చర్ హబ్‌గా నిర్ణయించాం.. అటువంటి వాటిని రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లాల వారీగా నిర్వహిస్తాం. హార్టికల్చర్ కోసం గ్రామీణ ఉపాధి హామీ నిధుల వాడకాన్ని రూ.200 కోట్ల వరకు పెంచుతాం. పురుగుమందులు, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు ప్రకృతి సేద్యాన్ని పెద్ద ఎత్తున ప్రవేశపెడతాం. అందుకోసం అదనంగా కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఒకప్పుడు ధాన్యం పండించిన రైతులు ధనవంతులుగా ఉండేవారు. ప్రస్తుతం పరిస్థితి రివర్స్ అయింది. హార్టికల్చర్ పంటలు పండించే రైతులు ధనవంతులవుతున్నారు. ఆక్వానూ ప్రోత్సహిస్తాం. తృణ ధాన్యాలను ప్రోత్సహిస్తాం. పిడిఎస్ బియ్యం రీసైక్లింగ్ అవుతోంది. అందుకోసం ప్రజలు ఏ రకాలను ఇష్టపడతారో వాటినే రైతులు పండించేలా చర్యలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ అనుబంధ రంగాల్లో రానున్న ఐదేళ్లలో 30 శాతం వృద్ధి రేటు సాధన లక్ష్యంగా పటిష్టమైన చర్యలను చేపట్టనున్నట్లు తెలిపారు.



# తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలపై బిజెపి మేధోమథనం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## విజయమే లక్ష్యంగా వ్యూహరచన

## ప్రచార కార్యాచరణపై ప్రణాళికలు

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై హర్షం

**హైదరాబాద్ (మెహిదీపట్నం), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు, యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి ఆరోపించారు. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల తరుణంలో బిజెపి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ గోల్కొండ హోటల్‌లో కిషన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, ఎమ్మెల్సీ అభ్య ర్థులు, కీలక నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమా వేశంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ, బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, పార్టీ ఎన్నికల అభ్యర్థులు, ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నారు. మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎన్నికల వ్యూహరచన రూపొందించేలా ప్రచార కార్యాచరణపై సమగ్రంగా చర్చించి కీలక సూచనలు చేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల పక్షాన ఎండగ ెడుతూ, కాంగ్రెస్ సర్కారు మోసాలను ప్రజలకు వివరించేలా ప్రచారాన్ని ఉధృతం చేయడంపై ప్రధానంగా దృష్టి సాధించాలన్నారు. రానున్న రోజుల్లో కర్ణాటక, తెలంగాణలో జరగనున్న ఎన్నికల్లో స్వతంత్రంగా అధికారకంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందన్నారు.

బిజెపి రాష్ట్ర శాఖ తరపున, ప్రజలందరి తరపున ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆప్‌ను ఊడ్చి పారేశాం.. ఢిల్లీ మాదే

## తెలంగాణలోని ఎమ్మెల్సీ సీట్లూ మావే.. మేధావులారా.. ఆలోచించి ఓటేయాలి

## కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** అక్రమ దందాలకు పాల్పడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలు చీపురును ఛీ కొట్టి ఊడ్చిపారేశారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ మాదే.. తెలంగాణసహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలను ఏర్పాటు చేయబోయేది బిజెపియే అన్నారు. ఇక్కడ 3 ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోబోయేది కూడా బిజెపియే అన్న ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ చీపురుతో ఛీ కొట్టారు. చేతిని చిదిమేశారు. కమలాన్ని వికసింపజేశారు. ఢిల్లీ అయినా గల్లీ అయినా బిజెపితోనే మనసంతా, ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీతోనే మేమంతా అని చాటిచెప్పిన ప్రజలకు కృతజ్ఞతలు అని తెలిపారు.

అక్రమ దందాలతో, అక్రమాలతో జైలుకు పోయిన నాయకుడు మాకొద్దు, నీతివంతమైన మోడీ పాలన ఢిల్లీలోనూ రావాలని ప్రజలు ఆకాంక్షించారు.


# కొంపముంచిన బిఆర్‌ఎస్‌తో కేజ్రీవాల్ స్నేహం

## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** కెసిఆర్ సార్థ్యంలోని బిఆర్‌ఎస్ పార్టీతో కేజ్రీవాల్ స్నేహం ఆయన కొంపముంచిందని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమికి భాష్యం చెప్పారు. కెసిఆర్ కుమార్తె కవితతో కేజ్రీ అండ్ కో లిక్కర్ వ్యా పారం ఆరోపణలు ఆయన పతనానికి పునాదులు వేశాయని ఆయన అపహాస్యం చేశారు. అన్నాఅజారే చేపట్టిన అవినీతిరహిత భారతదేశం నినాదాన్నే తన పార్టీ సిద్ధాంతంగా మార్చుకుని రాజకీయాల్లోకి వచ్చిన కేజ్రీవాల్ ఇంతింతై వటుడింతై అన్నట్టుగా, మొదట ఢిల్లీలో అధికారం, తర్వాత పంజాబ్ ను కైవసం చేసుకోవడం ద్వారా దేశ స్థాయిలో తన పేరు మారుమోగేలా చేశారని చరిత్రను టిపిసిసి నెమరేసుకున్నారు. తాజా ఢిల్లీ ఎన్నికల ఫలితాలతో ఆప్ ను కోలుకోలేని దెబ్బ తీశాయని ఎకసెక్కాలు చేశారు. ఈ పరిస్థితికి కేజ్రీవాల్ స్వయంకృతాపరాధమే కారణమని విమర్శించారు. కేజ్రీ పతనానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. అందులో ఒకటి కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ పార్టీతో కేజ్రీవాల్ స్నేహం ఆయన కొంప ముంచిందనే చెప్పాలి. కేసీఆర్ కుమార్తె కవితతో కేజ్రీ అండ్ కో లిక్కర్ వ్యాపారం ఆరోపణలు ఆయన పతనానికి పునాదులు వేశాయి. ఏ అవినీతిరహిత నినాదంతో కేజ్రీవాల్ దేశ స్థాయిలో ఇమేజ్ తెచ్చుకున్నారో దానికి లిక్కర్ స్కాం తూట్లు పొడిచిందని ఆయన పేర్కొన్నారు . ఆప్ కు అప్పటి వరకు ఉన్న క్లీన్ ఇమేజ్‌ను లిక్కర్ స్కాం ఆరోపణలు ఊడ్చిపారేశాయి. అవినీతికి కేజ్రీవాల్ అతీతుడు కాదు అన్న అభిప్రాయం ప్రజల్లో కలగడానికి కేసీఆర్ ఫ్యామిలీ కారణమైందని ఆయన దుయ్యబట్టారు. రెండు దఫాలు ఢిల్లీని ఏలిన కేజ్రీ పాలనలో లిక్కర్‌స్కాం తప్ప మరో అవినీతి ఆరోపణలేదు. కవిత లిక్కర్ వ్యాపార కాంక్ష కేజ్రీ పార్టీ సిద్ధాంతానికే తూట్లు పొడిచిందని అన్నారు. దేశ స్థాయిలో కేజ్రీ ఇమేజ్‌ను ఈ స్కాం పైకి కనిపించనంత కుళ్లబొడిచిందనే చెప్పాలి. ఇక రెండో అంశం కాంగ్రెస్ పార్టీని శత్రువుగా పరిగణించడం తాజా ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీ పతనానికి మరో కారణమైందని అన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు వద్దు అన్న ఆయన నిర్ణయం.

9-2pg7exHMNWJQE.qxd:9-2pg7exHMNWJQE.qxd 01/01/01 9:02 AM Page 1





## మాజీ రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్ జయంతి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 8:** మాజీ రాష్ట్రపతి భారతరత్న జాకీర్ హుస్సేన్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఆ మహనీయుడి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, దేశంలో విద్యారంగం అభివృద్ధికి గొప్ప కృషి చేసిన విద్యావేత్తగా డాక్టర్ జాకీర్ హుస్సేన్ ఎన్నో సేవలు అందించారని ముఖ్యమంత్రి కొనియా డారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కుందూరు రఘువీర్ నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

## భారతీయ జానపదం అరగని, తరగని కళ

### విద్యాశంకర భారతీస్వాముల అనుగ్రహభాషణం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** భారతీయ సనాతనధర్మ జానపదం ఎన్నటికీ అరగని, తరగని కళని, ఎప్పటికీ నవ్యమై భవ్యమై చరించు భవకళ, పరమశివుడు అధిపతి అయిన నటరాజ కళని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పరమపూజ్య పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వాముల అనుగ్రహభాషణ ప్రసంగం ప్రబోధించారు. ధర్మం అభివృద్ధిలోకి రావాలి.. ధర్మాన్ని ఆచరించకపోతే అధర్మంగా ప్రభలి లోకం అల్లకల్లోమై భావితరాలకు కళాసంపదలు అందవన్నారు. జానపద కళకు ప్రాణంపోసినవారు శ్రీ వేంకటేశ్వరస్వామి అన్నారు. మనలో కళాభిమానముంటే ఆ కళాదృష్టితో పరమాత్ముని దర్శించుకోగలమన్నారు. రమణాచారి జన్మదినంతో ప్రజలకు కళలను కళాకారులతో చూపించాలను కళాబుషి, మహర్షి, సమస్తాలు దాగివున్న మానవాకారంలో ఉన్నవారని, జ్ఞానాన్ని మేళవించిన జానపదం ఈనాటి



రమణాచారి దంపతులను సత్కరిస్తున్న విద్యాశంకర భారతీస్వామీజీ

సభా ప్రాంగణమని అభివర్ణించారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థలు సత్కళాభారతి, యువకళావాహిని, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సాంస్కృతికబంధు సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ విద్యాశంకర భారతీస్వాములు విశిష్ట అతిథి తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, గౌరవ అతిథులు రాష్ట్ర కార్మికశాఖ బ్రహ్మం, స్వామివారి ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ సూర్యనారాయణ, నిర్వాహక సంస్థల అధ్యక్షులు సత్కళాభారతి సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో కలిసి డా. కె.వి.రమణాచారి 73వ జన్మదినాన్ని పురస్కరించుకొని దంపతులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సభకుముందు వివిధరీతుల జానపద కళాకారులచే ఆయా కళాప్రదర్శనలతో ఉర్రూతలూగించి ఆనందడోలికల్లో ముంచెత్తివేశారు. డా. మామిడి హరికృష్ణ డా. కె.వి.రమణాచారి జన్మదినం కళాదినం, సాంస్కృతిక పర్వదినం, సాహిత్య ఉత్సవ దినోత్సవం, అపూర్వఘట్టం, యావత్ తెలుగుజాతి చిరపరిచయస్తుడని, సంస్కృతి, సాహిత్యం, కళలన్నా ఎంతో ప్రేమానురాగాలతో ఆయా రంగాలను, కళాకారులను ప్రోత్సహిస్తున్నారని ఆయన జీవన ప్రస్థానాన్ని సవివరంగా విశదీకరించారు. అనంతరం స్వామీజీ ఆశీస్సులతో మామిడి హరికృష్ణ చేతులమీదుగా 500మంది జానపద కళాకారులకు రమణాచారి కార్మిక శాఖతో చేయించిన 2లక్షల ప్రమాద భీమా(ఈశ్వం) కార్డులను అందజేశారు.



## రేవంత్‌ను తెలుగు భాషలో ఉన్న తిట్లన్నీ తిడుతున్నారు: కెటిఆర్


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 8:** మన ఐరన్ లెగ్ రేవంత్ రెడ్డి.. ఢిల్లీ పోయి కాంగ్రెస్ పార్టీకి సున్నా సీట్లు తెప్పించిండని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా చేశారు. శనివారం బిఆర్ఎస్ భవన్ లో జరిగిన సిర్పూర్ కాగజ్ నగర్ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీకి అతిపెద్ద స్టార్ క్యాంపెయినర్లు అంటే.. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి అని సెటైర్ వేశారు. 'రేవంత్ రెడ్డి దుర్మార్గపు పాలనతో పేద ప్రజల మీద పడ్డాడు. తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని రోటిబండ తండాలో 110 ఎకరాల భూమి కావాలని 400 మంది పోలీసులను పంపించాడు. హైదరాబాద్ లోని నాచారంలో చెప్పులు కుట్టుకునే అతని దుకాణం, పాలు అమ్ముకునే ఆమెది చిన్న డబ్బాను కూడా వదలకుండా కూలగొట్టించాడు. రేవంత్ రెడ్డిని తెలుగు భాషలో ఉన్న తిట్లన్ని తిడుతున్నారు. వేరే వారైతే సిగ్గుతో చచ్చిపోయేవారు. రేవంత్ రెడ్డికి సిగ్గు లేదు కాబట్టి బ్రతుకుతున్నాడు' అని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పైన ప్రజలు కోపంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు నాయకులు ప్రజల్లోకి వెళ్తే ప్రజలు కొడతారు... ముఖ్యమంత్రి కూడా పోలీస్ సెక్యూరిటీ లేకుండా బయట తిరిగే అవకాశం లేదు. ప్రజలు తిడుతున్న తిట్లకి రేవంత్ రెడ్డి కాకుండా వేరే వాళ్ళు ఉంటే ఆత్మహత్య చేసుకునేవారు తెలుగు భాషలో ఉన్న అన్ని తిట్లను ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిడుతున్నరుఇంత దుర్మార్గమైన పాలన చేయాల్సిన అవసరం కాంగ్రెసుకు ఏమున్నదో ఆలోచించుకోవాలి. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటల మనుషులె కానీ చేతల ప్రభుత్వం కాదు అని అర్థమైంది. తెలంగాణ నలుమూలలో కాంగ్రెస్ పార్టీకి తీవ్రంగా వ్యతిరేకత నెలకొని ఉందని చెప్పారు. అప్పుడప్పుడు సూర్యుడు కూడా మబ్బుల చాటుకు వెళ్తాడు.. కేసీఆర్ కూడా తప్పకుండా తిరిగి ప్రజల ఆశీర్వాదంతో మళ్ళీ అధికారంలోకి వస్తారని పేర్కొన్నారు. సిర్పూర్ కాగజ్నగర్ తో నాకు వ్యక్తిగతంగా అనుబంధం ఉన్నది. 2006 నుంచి 9 వరకు అక్కడ తెలంగాణ రాష్ట్ర సమితి బలోపేతం పని చేసిన. 2009లో శాసనసభ ఎన్నికల్లో పార్టీ గెలిచింది. రాష్ట్రంలో పది సీట్లు మాత్రమే గెలిచిన సిర్పూర్ కాగజ్‌నగర్‌లో కూడా గులాబీ జెండా ఎగిరిందని తెలిపారు.

# తెలంగాణలో బిఆర్ఎస్ వైఫల్యం వల్లే బిజెపి ఎదుగుదల

## కెటిఆర్ ట్వీట్‌పై విరుచుకుపడిన మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం, సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపి ఎదుగుదలకు బిఆర్ఎస్ వైఫల్యం కారణమని ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎక్స్ వేదికపై ట్వీట్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలలో బిఆర్ఎస్ జీరోకు పడిపోయి బిజెపికి సీట్లు గెలుపొందేలా చేసిందని దీనికి కంగ్రాట్స్ చెప్పాలా అని ఆయన ట్వీట్ చేశారు. కర్ణాటక, తెలంగాణలో ఎలా పుంజుకున్నామో అలాగే దేశవ్యాప్తంగా గెలుస్తామని ధీమాను వ్యక్తంచేశారు. గులాబి పార్టీ కారణంగానే బిజెపి ఎదిగిందని అన్నారు. కెటిఆర్ "బిజెపికి అతిపెద్ద కార్యకర్త రాహుల్‌గాంధీ" అని ట్వీట్ చేయడంతో మంత్రులు కెటిఆర్‌పై విరుచుకుపడ్డారు. పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ ఓటమి కన్నా బిజెపి గెలుపు కెటిఆర్‌కు ఆనందం ఇస్తోందని అన్నారు. కేసుల మాఫీ కోసమే ఇదంతా అనే మాట నిజంకాదా అని ప్రశ్నించారు. దేశాన్ని ఏలుతామని పార్టీ పేరు మార్చుకున్న మీ పార్టీ ఢిల్లీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదని మండిపడ్డారు. బిఆర్ఎస్ బిజెపి పార్టీల బంధం విడదీయరానిదని, అది నిజమని మరోసారి కెటిఆర్ నిరూపించారని పొన్నం తెలియజేశారు. మంత్రి కొండా సురేఖ కూడా కెటిఆర్ వ్యాఖ్యపై తీవ్రంగా స్పందిసూనత "మోడీ అంకుల్ "గెలుపుకు కీలక పాత్ర పోషించినందుకు మీ సోదరనిని అభినందించాలని, ఈ ఫలితాల్ని రూపొందించడంలో ఆమె చేసిన ప్రయత్నాలు స్పష్టంగా ఉన్నాయనిఅని ఆమో పరోక్షంగా లిక్కర్ స్కామ్ ను గుర్తుచేశారు. పార్లమెంట్ఎన్నికల్లో రాజ్యాంగానికి మించినవారు ఎవరు లేరని మోడీకి అర్థమయ్యేలా రాహుల్‌గాంధీ చేశారని ఆమె పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడి పదవి కట్టబెట్టడానికి రాహుల్ నాయకత్వం ఉపయోగ పడిందని అయినా మీ స్వయంకృతాపరాధంతో పార్లమెంట్ ఎన్నికలలో జీరోకు పడిపోయి తుడిచిపెట్టుకొనిపోయిందని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ బలమైన ప్రభావంను విస్మరించ కూడదని ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడా పోటీ చేయడానికి వెనుకాడుతోందని ఈ నష్టం బిఆర్ఎస్ మరో ఎన్నికల పోరులోకి అడుగు పెట్టడానికి ఇష్టపడకుండా పోయిందని గుర్తు చేశారు. నిజంగా అర్హులైన వారిని అభినందించడం మరిచిపోవద్దని నెక్స్ట్‌టైమ్ బెటర్ లక్ కెటిఆర్ అంటూ కొండా సురేఖ వ్యంగంగా వ్యాఖ్యానించారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



శనివారం ములుగు మండలంలోని ఇంచేర్లలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి: మంత్రి సీతక్క

**ములుగు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలందరూ సమన్వయంతో ముందుకుసాగాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచించారు. శనివారం ములుగు మండలంలోని ఇంచేర్లలో జరిగిన ములుగు, వెంకటాపూర్ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్య మంత్రి రేవంతరెడ్డి అభివృద్ధి, సంక్షేమంతో పాటు పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుం దన్నారు. ఆరు గ్యారెంటీలను అమలుచేసి దేశానికే ఆదర్శంగా నిలిచింద న్నారు. రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసింద న్నారు. తాను మంత్రి అయిననాటి నుండి ఇప్పటివరకు ములుగు నియోజకవర్గంలో రూ. 30 కోట్ల సీడీఎఫ్ నిధులతో దళిత, గిరిజన వాడల్లో సిసి రోడ్స్ డ్రైనేజీలు కల్వర్టులు మంజూరు చేయించానన్నారు. అదేవిధంగా ములుగు నూతన బస్‌స్టాండ్ ఏటూరునాగారంలో బస్ డిపోకు నిధులు రూ. 80 కోట్లతో టూరిజం డెవలప్‌మెంట్ పంచాయతీ రాజ్ శాఖ నుండి బిటి రోడ్లకు రూ. 310 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. అలాగే నాయకులకు కార్యకర్తలకు మధ్యలో విభేదాలుంటే తన దృష్టికి తీసుకురావాలని సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల మధ్యలో ఉండాలి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల మధ్యలోకి తీసుకెళ్లాలి మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి కానీ ఎక్కడా మాట్లాడకూడదు పార్టీ కోసం పనిచేసిన వారిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీట్ చేయడం కోసం అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలి పార్టీ కోసం కష్టపడే వారికే స్థానిక సంస్థలలో టికెట్లు ఇవ్వడం జరుగుతుంది అని రాష్ట్రాన్ని 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన పాపాన పోలేదని ఎద్దేవా చేశారు.

# దేశంలో బిజెపి ప్రభంజనం మొదలైంది

## ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** దేశంలో బిజెపి ప్రభంజనం మొదలైందని ఎంపి డికె అరుణ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇజెపి గ్రాండ్ విక్టరీ సాధించిందన్నారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బిజెపికి ఇది చారిత్రకమైన విజయం అన్నారు. పదేళ్ల అవినీతి పాలనకు ఢిల్లీ ప్రజలు చరమగీతం పాడారన్నారు. బిజెపి పాలనపై ఈ దేశ ప్రజలకు మరింత నమ్మకం పెరిగిందనడానికి ఇదే కారణం అన్నారు. ఢిల్లీలో ప్రజలంతా బిజెపికి అండగా నిలిచారన్నారు. అభివృద్ధిని కోరుకుంటూ అవినీతి ఆప్‌ను చీపురుతో ఊడ్చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా గెలుస్తామన్నారు. ఈ దేశంలో మార్పు మొదలైందని, ఢిల్లీ నుంచి గల్లీ దాక మేమే గెలుస్తాం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. దేశంలో ప్రతిపక్ష పార్టీ లా కాంగ్రెస్ పార్టీ వ్యవహించడం లేదన్నారు. కేజ్రీవాల్ చేసిన అవినీతిని ప్రజలు గుర్తించారని, అందుకే ఓటుతో బుద్ధి చెప్పారన్నారు.

### తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమే: బిజెపిఎల్‌పి నేత ఏలేటి

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం పట్ల బిజెపిఎల్‌పినేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశ ప్రజలు మోడీ నాయకత్వాన్ని బలపరిస్తున్నారని, ఈ ఎన్నికలలో స్పష్టం అవుతోందని ఆయన అన్నారు. రోజూ రోజుకు కాంగ్రెస్ పార్టీ కనుమరుగు అవుతుంద న్నారు. గతంలో ఆప్‌పార్టీ తప్పుడు హామీలతో, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనడంతో ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఏ ఒక్క అవినీతి ఆరోపణల లేకుండా, స్వచ్ఛమైన సుపరిపాలన అందిస్తున్న నరేంద్రమోడీని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. గతంలో తెలంగాణలో రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి పట్ల ఆ ప్రభుత్వాన్ని ప్రజలు ఎలా గద్దె దించారో, ప్రస్తుతం ఢిల్లీ ఎన్నికల్లో కూడా ప్రజలు అలాంటి తీర్పే ఇచ్చారని, రాబోవు రోజుల్లో తెలంగాణలో కూడా బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్రంలో కూడా ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని, గత 10 సంవత్సరాల బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ అవినీతి పాలన మాదిరిగానే కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని చీదరించుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో రాబోయేది రామ రాజ్యమే అన్నారు.

# మా సామాజికవర్గం లెక్కలు వాస్తవ విరుద్ధం

## రీసర్వే నిర్వహించి పద్మశాలీల లెక్కలను పక్కాగా తేల్చండి

### ప్రభుత్వానికి రాష్ట్ర సంఘం డిమాండ్



అభివాదం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజ్ కుమార్, బాలరాజు, శ్రీనివాస్, నవీన్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రీ సర్వే నిర్వహించి పద్మశాలీల లెక్కలను పక్కాగా తేల్చాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం చూపిన తమ సామాజిక వర్గ లెక్కలు వాస్తవ విరు ద్ధంగా ఉన్నాయని ఆవే దన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీలు కేవలం 11 లక్షల మా త్రమే ఉన్నారని చెప్పడం విడ్డూరమని మండి పడ్డా రు. గతంలో చేసిన సర్వే లోనే తమ జనాభా 11 లక్షలకుపైగా ఉన్నట్లు తేలిందని, ఈ పదేళ్లలో 30 లక్షలకుపైగా జనాభా పెరిగి ఉంటుందని జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలి పోయిన వారిని కూడా లెక్కిస్తే మరింత పెరుగు తుందన్నారు. రేవంత్ నేతృతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహించామని చెబుతున్న లెక్కలు ఒక సామాజికవర్గానికి తీరని అన్యాయం చేసేలా ఉన్నాయని విమర్శించారు. సర్వే విధానమే గందరగోళంగా సాగిందని, సర్వేకు ఉపయోగించిన పత్రంలో కులగణన చివరి ప్రాధాన్యతలో ఉందని విమర్శించారు. సరి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే రీసర్వే నిర్వహించి తమ సామాజికవర్గ లెక్కలను పక్కాగా తేల్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్, కోశాధికారి నవీన్, గౌరవ అధ్యక్షుడు వేముల బాలరాజు, బుర్రా మల్లేష్, ఉపాధ్యక్షుడు వనమాల శంకర్, సిహెచ్. చంద్రుడు, గుంటి నగేష్, జోగి సూర్యప్రకాష్, పాశిగంటి మల్లేష్, గంజి శ్రీనివాస్, సామల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు విదేశీ విద్యను కాంగ్రెస్ దూరం చేస్తోంది : ఎమ్మెల్సీ కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 8:** కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నిప్పులు చెరిగారు. రాష్ట్రంలోని విద్యార్థులకు పీజ్ రీయింబర్స్‌మెంట్, అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు నిధులు విడుదల చేయకుండా.. పేదలకు విదేశీ విద్యను దూరం చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎంపికై వివిధ దేశాల్లో చదువుకుంటున్న తెలంగాణకు చెందిన విద్యార్థులతో ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్ లో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. దాదాపు 200 మంది విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తుందన్నారు. పేద విద్యార్థులు విదేశాల్లో చదవాలనేది కేసీఆర్ ఆలోచన అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం ఉద్దేశాన్ని తుంగలో తొక్కిందని ఆరోపించారు. పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం ఎందుకు చిన్నచూపు చూస్తోందని నిలదీశారు. స్కాలర్‌షిప్ అందక అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, దానికోసం వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. రెండో విడత నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## సమగ్ర కులగణన నివేదికపై బిసి సంఘాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు

### పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు కేశవరావు, బిసి కమిషన్ ఛైర్మన్, సభ్యులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన నివేదికపై బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం సచివాలయంలో బీసీ సంఘాలతో చర్చలు జరిపారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నేతలు, బీసీ మేధావులతోపాటు ప్రభుత్వ సలహాదారు కేకేశవరావు, బీసీ కమీషన్ ఛైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు, ఎంపి సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, ఎంబిసి కార్పొరేషన్ జ్ఞానేశ్వర్, ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. సమగ్ర కులగనణ రిపోర్టుపై, అలాగే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని బీసీ సంఘాల నేతలు కోరారు. కులగనణ రిపోర్టును సమీక్షించాలని, అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలకి అన్యాయం జరిగిన విషయాలపై అంకెలు, సంకెలను బీసీ సంఘాల నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

## కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి సీనియర్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సస్పెన్షన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 8:** ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ సీనియర్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ షాక్ ఇచ్చింది. ఆయనను పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే కారణంతో, దీంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు పిసిసి క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సుభాష్‌రెడ్డి కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావును, పార్టీని దుర్భాషలాడినట్లు ఫిర్యాదు అందింది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగిన ఓ సమావేశంలో ఆయన దుర్భాషలాడినట్లు వెల్లడి కావడంతో అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. దీనికి సంబంధించి వివరణ ఇవ్వాలంటూ చిన్నారెడ్డి గత యేడాది నోటీసులు జారీ చేశారు. 2024 నవంబరు 21 నాటికి వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. 2024 నవంబరు 20 నాటికి సుభాష్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. అయితే, ఆయన సమాధానంపై సంతృప్తి చెందని రాష్ట్ర అధిష్ఠానం సస్పెన్షన్ వేటు వేస్తూ నిర్ణయం తీసుకుంది.



సదస్సులో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

## మాదిగలకు 11 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి: మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణలో మాదిగలకు 11 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాంగ్ కులస్తుల భాష వేరైనప్పటికి వారి వృత్తి, మాదిగల కులస్తుల వృత్తి ఒక్కటేనని వారిని మాదిగలతోనే ఉంచాలని కోరారు. వర్గీకరణ బిల్లు తప్పుల తడకగా ఉందని, కాంగ్రెస్ పార్టీలోని మాల నాయకులు కుట్ర చేశారని ఆయన ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మాంగ్ కులస్తుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథి పాల్గొని ప్రసంగించారు. 15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 రిజర్వేషన్‌లు కేటాయిస్తూ 32 లక్షల జనాభా ఉన్న మాదిగలకు 9 శాతం రిజర్వేషన్‌లు కల్పించడం న్యాయమేనా అని ఆయన ప్రశ్నించారు. సోమవారం మాదిగల, నేతకానిల అభిప్రాయాలను సిఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రుల దృష్టికి తీసుకువెళతామన్నారు. పార్లమెంట్ మాజీ సభ్యుడు వెంకటేష్ మాట్లాడుతూ వర్గీకరణ బిల్లు తప్పుల తడకగా ఉందని, నేతకానిలను ప్రత్యేక కేటగిరిగా పరిగణించాలని కోరారు.

## బిసిల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటిసి, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఇటీవల ప్రత్యేకంగా ఒకరోజు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో రెండు బిల్లులు పెడతామని సిఎం ప్రకటించారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్‌లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచడానికి ఒక బిల్లు, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు పెడతామని ప్రకటించారని, కాని బిసిల రిజర్వేషన్‌లను పెంచే బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టలేదని, కేవలం జనాభా లెక్కల మీద మాత్రమే అసెంబ్లీలో పెట్టి బిసిల దృష్టిని మరల్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో బిల్లు ఎందుకు ప్రవేశపెట్టలేదని ఆయన సిఎంను ప్రశ్నించారు. సిఎం రిజర్వేషన్‌లు పెంచకుండా కులాల లెక్కలు తప్పుగా చూపిస్తూ ప్రజల దృష్టిని మరల్చడానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

# బల్క్ డ్రగ్ తయారీదారుల సంఘంతో ఉన్నత విద్యామండలి ఎంఒయు

## నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని పెంపొందించడమే లక్ష్యం

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** తెలంగాణ ఉన్నత విద్యా మండలి.. బల్క్ డ్రగ్ తయారీ దారుల సంఘం ఆఫ్ ఇండియా (బీడీఎంఏ)తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. విద్యాసంస్థ, ఔషధ పరిశ్రమ మధ్య నైపుణ్య అంతరాన్ని తగ్గించడానికి ఈ అవగాహన ఒప్పందం చేసుకోవడం జరిగిందని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడి యంట్ (ఏపీఐ) రంగం యొక్క పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి తగిన నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని పెంపొందించడానికి ఈ సహకారం ఒక ముఖ్యమైన అడుగని తెలిపారు. విద్యా శిక్షణను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సమలేఖనం చేయడమే ఎంవోయూ ప్రాథమిక లక్ష్యమన్నారు. ఫార్మా తయారీ, పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ అండ్ డీ), నాణ్యత నియంత్రణ (క్యూసీ), నాణ్యత హామీ (క్యూఏ), మొక్కల నిర్వహణ, భద్రత, నియంత్రణ మరియు పర్యావరణ నిర్వహణ వంటి రంగాలలో అవసరమైన ఆచరణాత్మక జ్ఞానం, సామర్థ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఎంవోయూపై ఉన్నత విద్యా మండలి, బీడీఎంఏ ఆఫీస్‌బేరర్లు శనివారం సంతకం చేశారు. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, బీడీఎంఏ అధ్యక్షుడు ఆర్‌కె అగర్వాల్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఏపీ రామేశ్వరరావు, ట్రెజరర్ అనుప్వీర్ పాల్గొన్నారు. విద్యార్థులకు సరైన నైపుణ్యాలు మరియు అవకాశాలతో సాధికారత కల్పించడంలో ఎంవోయూ ఒక ముందడుగు. విద్యార్థులకు వారి ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, నియామకాలు పరిశోధన కార్యకలాపాలకు కూడా వీలు కల్పించనుంది. నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని సృష్టించడమే కాకుండా ఫార్మాస్యూటికల్ మరియు బల్క్ డ్రగ్ తయారీకి కేంద్రంగా తెలంగాణ స్థానాన్ని బలోపేతం చేయనుందని ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అన్నారు.

9-2pg10.qxd:9-2pg10.qxd 01/01/01 7:23 AM Page 1



# హీటెక్కిన ఛాంపియన్స్ టోర్నీ




## ప్రారంభానికి ముందే వివాదాలు
## రచ్చ చేస్తున్న ఐసిసి నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ-2025కి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ ప్రారంభానికి మరో 10 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ టోర్నమెంట్ ఈ నెల 19 నుంచి పాకిస్తాన్, దుబాయ్‌లలో ప్రారంభం కానుంది. ఈ ఐసిసి టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. అన్ని జట్లు తమ జట్లను ప్రకటించాయి. టోర్నమెంట్ షెడ్యూల్ కూడా ప్రకటించారు. అయితే, మినీ వరల్డ్ కప్‌గా పేరుగాంచిన ఈ ఐసిసి టోర్నమెంట్‌కు సంబంధించి ఈ సారి అనేక వివాదాలు తలెత్తాయి. అందులో ప్రధాన వివాదాలను గుర్చి తెలుసుకుంటే పాకిస్తాన్ పర్యటనకు టీమిండియా నిరాకరణ ఒకటిగా ఉంది. చాలా కాలం తర్వాత, పాకిస్తాన్ ఐసిసి టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. కానీ, భద్రతా కారణాల దృష్ట్యా టీం ఇండియా పాకిస్తాన్ వెళ్లడానికి నిరాకరించింది. ఆ తరువాత ఐసిసి హైబ్రిడ్ మోడల్‌ను ఆమోదించింది. భారత జట్టు ఇకపై తన అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడుతుంది. టీం ఇండియా సెమీఫైనల్స్‌కు చేరుకుని, ఆ తర్వాత ఫైనల్స్‌కు చేరుకున్నా, ఈ మ్యాచ్‌లు దుబాయ్‌లోనే జరుగుతాయి. లేకుంటే అవి పాకిస్తాన్‌లోనే జరుగుతాయి. మరో వివాదం పాకిస్తాన్ కూడా భారతదేశానికి రావడానికి నో అంటోంది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్తాన్ వెళ్లడానికి భారతదేశం నిరాకరించినప్పుడు, పాకిస్తాన్ కూడా తన కఠిన వైఖరిని ప్రదర్శించింది. రాబోయే ఐసిసి టోర్నమెంట్ కోసం పాకిస్తాన్ జట్టు భారతదేశానికి వెళ్లడానికి కూడా నిరాకరించింది. భారతదేశం లాగే, పాకిస్తాన్ కూడా తన మ్యాచ్ కోసం హైబ్రిడ్ మోడల్‌ను డిమాండ్ చేసింది. ఇక ఇంగ్లాండ్, ఆఫ్ఘనిస్తాన్ మ్యాచ్‌పై వివాదం చెలరేగింది.

2021లో తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చాక ఆఫ్ఘనిస్తాన్‌లో మహిళా క్రీడలను నిషేధించారు. దీని కారణంగా, ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు కూడా రద్దు చేశారు. మహిళలు బయటకు వెళ్ళే హక్కు, వారి విద్య, అన్ని రకాల హక్కులు తీసివేశారు. అఫ్ఘాన్‌లో మహిళలపై జరుగుతున్న దారుణాలను దృష్టిలో ఉంచుకుని, ఇంగ్లాండ్‌కు చెందిన కొంతమంది రాజకీయ నాయకులు ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లాండ్ జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో మ్యాచ్‌లు ఆడకూడదని అభ్యర్థిస్తూ ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు ఒక లేఖ రాశారు. అయితే, ఐసిసి దీనికి సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అలాగే టీం ఇండియా జెర్సీపై గందరగోళం నెలకొంది. సాధారణంగా టోర్నమెంట్ నిర్వహించే దేశం పేరు అన్ని జట్ల జెర్సీలపై ఉంటుంది. కానీ, భారత జెర్సీ పై పాకిస్తాన్ పేరు ఉండదని నివేదికలు వచ్చాయి. ఈ విషయంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఐసిసికి ఫిర్యాదు చేసింది. అయితే, తరువాత టీం ఇండియా జెర్సీపై పాకిస్తాన్ పేరు ఉంటుందని స్పష్టమైంది. కాగా భారత మ్యాచ్ రిఫరీ, అంపైర్ల వివాదాలు కూడా తలెత్తింది. ఛాంపియన్స్ ట్రోఫీకి అంపైర్లు, మ్యాచ్ రిఫరీలను ఐసిసి ఇటీవల ప్రకటించింది. అందులో ఒక్క భారతీయుడి పేరు కూడా లేదు. ఈ ట్రోఫీ జాబితాలో భారత అంపైర్ నితిన్ మీనన్‌ను చేర్చాలని బిసిసిఐ కోరింది. కానీ, వ్యక్తిగత కారణాల వల్ల నితిన్ పాకిస్తాన్‌కు వెళ్లడానికి నిరాకరించాడు. ఈ విధంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఛాంపియన్స్ ట్రోఫీని వివాదాలు వెంటాడుతున్నాయి.




# ఇంటర్నేషనల్ లీగ్ టి20 టోర్నీలో.. ముంబై ఇండియన్స్ ఔట్

## 6 వికెట్ల తేడాతో షార్జా వారియర్స్ గెలుపు

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ లీగ్ టి20 టోర్నీలో (ఐఎల్‌టి20-2025) డిఫెండింగ్ ఛాంపియన్స్ ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్‌కు షాక్ తగిలింది. ప్రస్తుత ఎడిషన్లో ఆ జట్టు ఎలిమినేటర్ మ్యాచ్‌లో నాకౌటైంది. షార్జా వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎంఐ ఎమిరేట్స్ 6 వికెట్ల తేడాతో పరాజయంపాలై, టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 146 పరుగులు మాత్రమే చేసింది. 42 పరుగులు (22 బంతుల్లో; 6 ఫోర్లు, సిక్స్) చేసిన నికోలస్ పూరన్ ముంబై ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. టామ్ బాంటన్ (29), విల్ జాక్స్ (18), కుసాల్ పెరీరా (18), అకీల్ హుసేన్ (15) రెండంకెల స్కోర్లు చేశారు. భారీ హిట్టర్లు ఆండ్రీ ఫ్లెచర్ (0), బెవాన్ జాకబ్స్ (7), రొమారియో షెపర్డ్ (7) దారుణంగా విఫలమయ్యారు. వారియర్జ్ బౌలర్లలో టిమ్ సౌథీ 2, ఆడమ్ మిల్నే, దిల్షన్ మధుషంక, అస్టన్ అగర్, హర్మీత్ సింగ్, రోహన్ ముస్తఫా తలో వికెట్ పడగొట్టారు. ఇక స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన వారియర్జ్ 18.5 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకుంది. టామ్ కొహ్లర్ కాడ్‌మోర్ (40), జాన్సన్ ఛార్లెస్ (36) వారియర్జ్ విజయానికి గట్టి పునాది వేయగా, టిమ్ సీఫర్ట్ (40 నాటౌట్), రోహన్ ముస్తఫా (2 నాటౌట్) వారియర్జ్‌ను విజయ తీరాలకు చేర్చారు. జేసన్ రాయ్ (26) ఓ మోస్తరు స్కోర్ చేశాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో ముహమ్మద్ రోహిద్ ఖాన్ 3, ఫజల్ హక్ ఫారూకీ ఓ వికెట్ పడగొట్టారు. ఈ గెలుపు అనంతరం వారియర్జ్ రెండో క్వాలిఫయర్‌లో డెసర్ట్ వైపర్స్‌ను ఢీకొంటుంది. ఈ మ్యాచ్‌లో విజేత ఈ నెల 9న జరిగే ఫైనల్లో దుబాయ్ క్యాపిటల్స్‌తో అమీతుమీ తేల్చుకుంటుంది. కాగా, యూఏఈ వేదికగా జరిగే ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో ఇప్పటి వరకూ రెండు ఎడిషన్లు జరిగాయి. తొలి ఎడిషన్‌లో గల్ఫ్ జెయింట్స్ ఛాంపియన్‌గా నిలువగా, రెండో సీజన్లో ఎంఐ ఎమిరేట్స్ విజేతగానిలిచింది. గత ఎడిషన్ ఫైనల్లో ఎమిరేట్స్ దుబాయ్ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. ఈసీజన్‌లో క్యాపిటల్స్ అందరి కంటే ముందే ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.

# ముంబై ఓపెన్ టోర్నీలో.. సెమీస్‌కు మాయ




**న్యూఢిల్లీ:** ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టోర్నీలో సంచలన ప్రదర్శన కొనసాగిస్తూ భారత టీనేజ్ టెన్నిస్ స్టార్ మాయ రాజేశ్వరన్ రేవతి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో 15 ఏళ్ల మాయ 6-4, 3-6, 6-2తో ప్రపంచ 285వ ర్యాంకర్, జపాన్‌కు చెందిన మి యామగుచి పై గెలిచింది. రెండు గంటలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో మాయ ఐదు ఏస్లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. స్పెయిన్‌లోని రాఫెల్ నాదల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మాయ సెమీఫైనల్లో ప్రపంచ 117వ ర్యాంకర్, స్విట్జర్లాండ్‌కు చెందిన జిల్ టెచ్‌మన్‌తో తలపడనుంది. ఇక భారత మూడో ర్యాంకర్, తెలంగాణకు చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ఈ టోర్నీలో ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో రష్మిక 2-6, 2-6తో జిల్ టెచ్మన్ చేతిలో ఓడిపో యింది. క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలైన రష్మికకు 3,450 డాలర్ల (రూ. 3 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 27 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# పాకిస్తాన్‌కు భారీ షాక్



## ఫుట్‌బాల్ సమాఖ్యపై నిషేధం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఎఫ్‌ఐఎఫ్‌ఎ (ఫిఫా)) పాకిస్తాన్ ఫుట్‌బాల్ సమాఖ్యపై (పిఎస్‌ఎఫ్) సస్పెన్షన్ వేటు వేసింది. ఫిఫా నియమావళికి అనుగుణంగా పాక్ ఫుట్‌బాల్ సమాఖ్య నిర్వహణ జరగకపోవడంతో ఆ దేశ సమాఖ్యపై నిషేధం విధించింది. ఫిఫా నియమావళి ప్రకారం నడుచుకునేలా పీఎఫ్ఎఫ్ నిబంధనల్ని సవరించుకోవాలని, తద్వారా దేశంలో ఆటపై జవాబుదారీతనం పెరగాలని ఫిఫా ఇటీవల పలు సూచనల్ని చేసింది. అయితే పీఎఫ్ఎఫ్ వాటిని పెడచెవిన పెట్టింది. చివరి సారిగా నిబంధనలను అమలు చేయకపోయినట్లయితే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీంతోపాటు, పాక్ ఫుట్‌బాల్‌జట్లపై నిషేధాజ్ఞలుంటాయని హెచ్చరించింది. అయినా వాటిని ఏమాత్రం ఖాతరు చేయ కుండా నిబంధనల్లో సవరణలు చేయకపోవడంతో అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య తాజాగా పాకిస్థాన్ ఫుట్‌బాల్ సమాఖ్యను సస్పెండ్ చేసింది. అదేవిధంగా తాము సూచించిన సవరణలు పూర్తి చేసే వరకూ నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. కాగా 2019 జూన్‌లో ఫిఫా నియమించిన కమిటీనే పీఎఫ్ఎఫ్ వ్యవహారాలను చక్కబెడుతోంది. కానీ హరూన్ మాలిక్ నేతృత్వంలోని ఈ కమిటీని అక్కడి ప్రభుత్వం శాసించడంతో ఎన్నికల నిర్వహణ, నిబంధనల్లో సవరణల ప్రక్రియ మాత్రం చేపట్టలేకపోయింది. ఈ నేపథ్యంలో హరూన్ తమపై వేటు తప్పదని ఇటీవల పార్లమెంటరీ ప్యానెల్ దృష్టికి తెచ్చినా అక్కడి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఫిఫా నియమావళికి తగ్గ మార్పులు, చేర్పులకు పాక్ ప్రభుత్వ ఆజమాయిషీలోని సమాఖ్య సిద్ధంగా లేదని హరూన్ మాలిక్ ఇటీవల అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్యకు నివేదించాడు.

# పోరాడి ఓడిన రిత్విక్ జోడీ

**న్యూఢిల్లీ:** డాలస్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ పేయర్ బొల్లిపల్లి రిత్విక్ పోరాటం తొలి రౌండ్‌లో నేముగిసింది. అమెరికాలోని టెక్సస్‌లో జరుగుతున్న ఈ ఏటీపీ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో తొలి రౌండ్‌లో భారత్‌కు చెందిన రిత్విక్, కొలంబియాకు చెందిన నికోలస్ బారింటోస్ ద్వయం 6-7 (4/7), 7-5, 6-10తో సూపర్ టైబ్రేక్‌లో అమెరికా జంట రాజీవ్ రామ్-ఆస్టిన్ క్రాయిసెక్ చేతిలో ఓడిపోయింది. 1 గంట 57 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బారింటోస్ మూడు ఏస్లు సంధించి, రెండు డబుల్ ఫాల్టులు చేశారు. తమ సర్వీస్ను ఒకసారి కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను రెండు సార్లు బ్రేక్ చేశారు. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో అనుభవజ్ఞులైన రాజీవ్ రామ్, క్రాయిసెక్ పైచేయి సాధించి విజయాన్ని ఖరారు చేసుకున్నారు. రిత్విక్-బారింటోస్‌లకు 11,840 డాలర్ల (రూ.10 లక్షల 38 వేలు) ప్రైజ్ మనీ లభించింది. గత ఏడాది అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో నిలకడగా రాణించిన రిత్విక్, గత వారం భారత్-టోగో జట్ల మధ్య న్యూఢిల్లీలో జరిగిన వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ మ్యాచ్ ద్వారా డేవిస్ కప్‌లో అరగేంట్రం చేశాడు.

# ఇపిఎఫ్ఓ గడువు పెంపు

**ముంబై, ఫిబ్రవరి 8:** యూనివర్సల్ అకౌంట్ నంబర్ యాక్టివేట్ జనవరి 15 నుండి ఫిబ్రవరి 15 వరకు గడువు పొడిగిస్తున్నట్లు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రకటించింది. యూఏఎన్ యాక్టివేషన్, ఆధార్ సీడింగ్ కోసం గడువు 2025 ఫిబ్రవరి 15 వరకు పొడిగించాం అని ఫిబ్రవరి 2 నాటి సర్క్యులర్‌లో ఇపిఎఫ్ఒ గుర్తించింది. యూఏఎన్, యూనివర్సల్ అకౌంట్ నంబర్ అనేది ఇపిఎఫ్ఒద్వారా సభ్యులకు కేటాయించే ఒక విశిష్టమైన 12అంకెల సంఖ్య. ఇది ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను నిర్వహరణకు కీలకం. ఇది వివిధ కంపెనీల నుండి అన్ని ఈపీఎఫ్ ఖాతాలను ఒకే ఖాతాలోకి లింక్ చేస్తుంది. ఉద్యోగాలు మారేటప్పుడు నిధులను సులభంగా బదిలీ చేయడంలో యూఏఎన్ సురక్షిత ప్రామాణీకరణ ద్వారా ఖాతా సమాచారం, లావాదేవీలు ప్రతిని రక్షిస్తూ భద్రతను పెంచు తుంది. అదనంగా వివిధ కంపె నీల కింద సృష్టించిన ఎక్కువ పీఎఫ్ ఖాతాలను ఏకీకృతం చేసి ఇబ్బందిని తొలగిస్తుంది, ఉద్యోగుల పదవీ విరమణ పొదుపు ప్రక్రియను క్రమబద్ధీకరించడంలో




యూఏఎన్ జనరేట్ చేయడానికి అవసరమైన పత్రాలలో పాన్ కార్డ్, ఆధార్ కార్డ్, గుర్తింపు రుజువు (పాస్పోర్ట్, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ నేషనల్), చిరునామా రుజువు, బ్యాంక్ ఖాతా వివరాలు మొదలై నవి ఉన్నాయి. సంఘటిత రంగంలో ఉపాధిని పెంచడమే లక్ష్యం గా 2024 బడ్జెట్‌లో ఎంప్లాయీ లింక్డ్ ఇన్‌సెంటివ్ పథకాలను ప్రవేశపెట్టారు. ఇవి అటు యాజమాన్యాలతోపాటు ఇటు మొదటి సారి ఉద్యోగులకు ఇద్దరికీ ప్రయోజనాలను అందిస్తాయి. ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ ఇపిఎఫ్ఒలో నమోదు చేసుకోవాలి. ప్రస్తుతం మూడు ఈఎస్ఐ పథకాలు ఉన్నాయి. వాటిలో స్కీమ్ఎ అనేది మొదటి సారి ఉద్యోగులకు వర్తిస్తుంది. స్కీమ్‌బి తయారీ రంగంలోని కార్మికులకు, స్కీమ్‌సీ యాజమాన్యాలకు మద్దతు ఉంది. ఇపిఎఫ్ఒకి సంబంధించిన ఇఎస్ఐ పథకం కింద ప్రయోజనాలను పొందడం కోసం యాఏఎన్ యాక్టివేషన్, బ్యాంక్ అకౌంట్ ఆధార్‌తో లింక్ చేయడం తప్పనిసరి.

# టాప్‌గేర్‌లో ఆటో రిటైల్ మార్కెట్..

**ముంబై, ఫిబ్రవరి 8:** దేశమంతటా 26,500 డీలర్ షిప్‌లతో ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్ఏడీఏ) ఏర్పడింది. దీని అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం, జనవరిలో అన్ని రకాల విభాగాలలో పెరుగుదల నెలకొంది. టూ వీలర్స్, త్రీ వీలర్, ట్రాక్టర్, కమర్షియల్ వెహికల్స్ ఇలా ప్రతి వాహన వర్గం సానుకూల ధోరణి కనబరిచింది. వినియోగదారుల విశ్వాసం, స్థిరమైన మార్కెట్ పునరుద్ధరణకు ఇది నిదర్శనంగా నిలిచింది. గతనెలలో ప్యాసింజర్ వాహనాల రిటైల్ అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 16 శాతం పెరిగి 4,65,920 యూనిట్లకు చేరుకున్నాయి. వీటి డిమాండ్ బాగా పెరిగిందని చాలా మంది డీలర్లు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాల రిటైల్ అమ్మకాలు గత నెలలో 15.2 లక్షల యూనిట్ల వద్ద కొనసాగాయి. గత సంవత్సరం ఇదే నెలలో 14.6 లక్షల యూనిట్లతో పోల్చితే నాలుగు శాతం పెరుగుదల నమోదైంది. గ్రామీల ప్రాంతాల కన్నా పట్టణాల్లో వాహనాల కొనుగోళ్లలో స్వల్ప పెరుగుదల కనిపించింది. గతేడాదితో పోల్చితే నాలుగు నుంచి ఐదు శాతం ఎక్కువగా నమోదైంది. వాహనాల అమ్మకాలు పెరుగుదల వెనుక ఉన్న కారణాలను కూడా ఎఫ్ఏడీఏ ప్రతినిధులు వెల్లడించారు. కొత్త మోడల్ వాహనాల విడుదల, వివాహాల సీజన్, మెరుగైన ఫైనాన్సింగ్ వంటివి దీనికి కారణమని



తెలిపారు. అయితే పెరుగుతున్న వడ్డీరేట్లు, గ్రామీణ ద్రవ్యత సవాళ్లు, మార్కెట్ అనిశ్చిత గురించి ఆందోళనలు ఇప్పటికీ ఉన్నాయన్నారు. కానీ మార్కెట్ పెరుగుతూ ఉండడంపై సంతోషం వ్యక్తంచేశారు. వాణిజ్య వాహనాల అమ్మకాలు గతేడాదితో పోల్చితే 8 శాతం పెరిగి 99,425 యూనిట్లకు చేరుకున్నాయి. ట్రాక్టర్ విక్రయాలు 5 శాతం పెరిగి 93,381కి చేరాయి. ఇక త్రీ వీలర్ రిటైల్ అమ్మకాలు ఏడు శాతం పెరిగి 1,07,033గా నమోద య్యాయి. ఏది ఏమైనా నూతన సంవత్సరంలో ఆటోమొబైల్ మార్కెట్‌కు మంచి శుభారంభం లభించింది. తాజా సర్వే ప్రకారం.. దాదాపు సగం మంది డీలర్లు (46 శాతం) ఈ ఫిబ్రవరిలో కూడా అమ్మకాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. మరో 43శాతం మంది మాత్రం స్థిరంగా కొనసాగుతాయన్నారు.

# అస్మితా పటేల్‌పై సెబి ఉక్కుపాదం!


**ముంబై, ఫిబ్రవరి 8:** భారతీయ స్టాక్ మార్కెట్లను రెగ్యులేటర్ సెబి పర్యవేక్షిస్తోంది. అయితే చాలా మంది ఫిన్‌ఫ్లూయన్సర్ల ఆగడాలకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఇన్వెస్టర్లకు ఎక్కువ రాబడులను ఆశజూపి భారీగా సొమ్ము చేసుకోవటంపై కఠినంగా వ్యవహరించాలని సెబి నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రెగ్యులేటర్ సెబి చర్యలతో చాలా మంది చిక్కుకుంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులకు




టిప్స్ అందిస్తున్న అస్మితా జితేష్ పటేల్ అనే ఫిన్‌ఫ్లూయన్సర్‌పై సెబి చర్యలు చేపట్టింది. సెబి చట్టాల ప్రకారం రిజిస్టర్ కాని ఆమె పెట్టుబడిదారులకు చిట్కాలను అందిస్తోందని సెబి గుర్తిం చింది. వాస్తవానికి ఆమెను స్టాక్ మార్కెట్‌లో షీ వోల్ఫ్, ఆప్షన్స్ క్వీన్ అని పిలుస్తుంటారు. ఆమె పెట్టుబడిదారులకు ట్రేడింగ్ గురించి కోర్సులను కూడా నిర్వహిస్తుం డేది. దీనికోసం వారి నుంచి భారీగా రుసు ములు వసూలు చేస్తుండేది. అయితే కోర్సుల్లో ఆమె చెప్పిన టెక్నిక్స్ ఫాలో అయితే మంచి లాభాలను పొందవచ్చని భావించిన ట్రేడర్లు నష్టాలను చూశారు. ఆమె మాటలు నమ్మి నష్టాలను మూటకట్టుకున్న చాలా మంది పెట్టుబడిదారులు వరుసగా చేసిన ఫిర్యాదులపై మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబీ చర్యలు తీసుకునేందుకు రంగం లోకి దిగింది. పెట్టుబడి కోర్సులు, చిట్కాల పేరుతో సంపాదిం చిన రూ.104 కోట్లలో రూ.54 కోట్లను స్వాధీనం చేసుకుంది. అస్మితా జితేష్ పటేల్ నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానెల్‌కు 5 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇదే సమయంలో ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, లింక్డ్‌ఇన్, ట్విట్టర్లలో కూడా భారీగానే ఫాలోవర్లను ఆమె కలిగి ఉంది. అస్మితకు అస్మితా పటేల్ గ్లోబల్ స్కూల్ ఆఫ్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీని స్థాపించింది. కంపెనీ వ్యవస్థాపకురాలుగా ఉన్న ఆమె ఈక్విటీ మార్కెట్లలో ట్రేడింగ్ చేయాలని భావిస్తున్న చాలా మంది ఔత్సాహి కులకు ట్రేడింగ్ కోర్సులను ఈ కంపెనీ కొంత రుసుముకు నేర్పిస్తుం టుంది. వరుసగా వచ్చిన ఫిర్యాదులపై సెబీ స్పందిస్తూ ప్రస్తుతం ఆమెపై చర్యలకు ఉపక్రమించింది. సెబీ వద్ద రిజిస్టర్డ్ కాని వారు స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై టిప్స్ ఇవ్వటాన్ని నిషేధించిన సంగతి తెలిసిందే.

# టాటా ఎఐఎ నుంచి కొత్త పెన్షన్ ప్లాన్

**ముంబై, ఫిబ్రవరి 8:** టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఎఐఎ) స్మార్ట్‌పెన్షన్ సెక్యూర్ ప్లాన్‌ను ప్రారంభించింది. ఇది కొత్త తరం పదవీ విరమణ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన వినోద యూనిట్‌లింక్ పెన్షన్ ప్లాన్, ద్వితీయ ఆదాయ మార్గాలను సృష్టించడం నుండి పదవీ విరమణ పొదుపులను పొందడం వరకు ఈ ప్లాన్ ఆర్థిక భద్రత, స్వాతంత్రం కోరుకునే డిజిటల్ వినియోగదారులు, ప్రొఫెషనల్స్ ఆకాంక్షలను తీరుస్తుంది. ముందస్తు పదవీ విరమణ ప్రణాళిక: 45సంవత్సరాల వయస్సు నుండి పదవీ విరమణ చేయడానికి పూర్తి సౌలభ్యం. ఈక్విటీలో 100శాతం నిధులను కేటాయించే ఎంపికతో వివిధ ఫండ్స్‌లో పెట్టుబడులకు అవకాశం. ఎటువంటి ఖర్చు లేకుండా, ఎన్ని సార్లయినా ఒక ఫండ్ నుంచి మరో ఫండ్‌కు మారే వెసులు బాటు. మీ మొత్తం ప్రీమి యాన్ని మీకు నచ్చిన ఫండ్స్‌లో పెట్టుబడి పెడతారు. ఇది మీడబ్బు వృద్ధి చెందడానికి, కలల పదవీ విరమణకు మార్గం సుగమం చేస్తుంది. ఆన్‌లైన్ కొనుగోలుతో ఫండ్ బూస్టర్లు, లాయల్టీ జోడింపులు ఉంటాయి. ఫార్మసీ కొనుగోళ్లు, రోగనిర్ధారణ పరీక్షలపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను అందించే హెల్త్ ఈ బడ్డీ సర్వీస్, కస్టమర్ ఫార్మసీ కొనుగోళ్లు, రోగనిర్ధారణ పరీక్షలపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను అందించే హెల్త్ బడ్డీ సర్వీస్. కస్టమర్ హెల్త్ సెక్యూర్ రైను పర్సన్ ద్వారా ఓపీడీ సేవలను కూడా ఎంచుకోవచ్చు. 80సీసీసీ కింద పన్ను ఆదా. మెచ్యూరిటీ సమయంలో లంప్సమ్‌పై 60శాతం పన్ను రహితం. ఆపద సమయంలో కుటుంబ అవసరాలను తీర్చడానికి అంతర్నిర్మిత ప్రీమియం మినహాయింపు ఎంపిక. వివిధ అవసరాలకు సరిపోయేలా టాటా ఎఐఎ ప్లాన్లను రూపొందించింది.




స్మార్ట్‌పెన్షన్ సెక్యూర్ ప్లాన్‌లో స్మార్ట్ పెన్షన్ సెక్యూర్, స్మార్ట్ పెన్షన్ సెక్యూర్ ప్లస్ అనే రెండు ఎంపికలు ఉన్నాయి. ప్రణాళిక ప్రవేశ వయస్సు 35 నుండి 75 సంవత్సరాలు. వెస్టింగ్ వయస్సు 45 సంవత్సరాల నుండి రూపొందించబడింది.

## వాణిజ్యం


# అకౌంట్ అగ్రిగేషన్‌కు ఫోన్‌పే గుడ్‌బై

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఫిన్ టెక్ ప్లాట్‌ఫామ్ ఫోన్‌పే అకౌంట్ అగ్రిగేషన్ (ఎఎ) వ్యాపారం నుంచి వైదొలిగినట్లు ప్రకటించింది. ఈ సేవలను సరిపడా ఒప్పందాన్ని పొందలేకపోయినట్లు తెలిపింది. ఎన్‌బిఎఫ్‌సి- ఎఎ లైసెన్స్‌ను ఆర్బీఐకి స్వాధీనం నిర్ణయించినట్లు, అకౌంట్ అగ్రిగేషన్ కార్యకలాపాలను మూసివేసే చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. తన యూజర్ల ఆమోదం మేరకు వారి ఆర్థిక బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూట్‌లతో పంచుకోవడం ద్వారా రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర సేవలు అందించేందుకు ఈ లైసెన్స్ కింద అనుమతి ఉంటుంది. 2023జూన్ లో ఫోన్‌పేకుఎన్‌బిఎఫ్‌సి-ఎఎ లైసెన్స్ రావడం విశేషం. "రెండేళ్ల లోపే మా ఎఎ ప్లాట్ ఫామ్ 5 కోట్ల మంది భారతీ యులను చేర్చు కోవడం గర్వకారణంగా ఉంది. పోటీ ప్రాధాన్యతల దృష్ట్యా ఎక్కువ మంది ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ ప్రొవైడర్లను మా ప్లాట్‌ఫామ్ వైపు ఆకర్షించలేకపోయాం. దీంతో ఫోన్‌పే గ్రూప్ అకౌంట్ అగ్రిగేషన్ వ్యాపారం నుండి వైదొలగాలని నిర్ణయించుకుంది. దీనికి బదులుమార్కెట్లో ఉన్న ఇతర ఎఎలతో జట్టు కడతాం"అనిఫోన్‌పే ప్రకటించింది.




# బులియన్ మార్కెట్ కళకళ

**ముంబై, ఫిబ్రవరి 8:** దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుదల బాటపట్టాయి. క్రితం రోజున పెరుగుదలకు బ్రేకిచ్చిన పసిడి ధరలు శనివారం స్వల్పంగా పెరిగాయి. బంగారం ధరలు ద్రవ్యోల్బణం, గ్లోబల్ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంకు గోల్డ్ రిజర్వ్, హెచ్చుతగ్గుల వడ్డీరేట్లు, నగల మార్కెట్లతో సహా అనేక అంతర్జాతీయ కారకాలపై ఆధారపడి ఉంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.79,450, 24 క్యారెట్ల పసిడి ధర 10గ్రాములకు రూ.86,670 వద్ద ఉన్నాయి. శుక్రవారంతో పోలిస్తే రూ.150, రూ.160 చొప్పున పెరిగాయి. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.86,820, 22 క్యారెట్ల ధర రూ.79,960గా ఉన్నాయి. చెన్నైలో 22 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములకు రూ.79,450గా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.86,670గా ఉన్నాయి. దేశవ్యాప్తంగా వెండి ధరల్లో శనివారం ఎలాంటి కదలిక లేదు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ రూ.1,07,000 వద్ద, ఢిల్లీలో రూ.99,500 వద్ద నిలకడగా ఉన్నాయి.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14